www.jagritiweekly.com

సంపుటి : 74 సంచిక : 46 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ భాద్రపద బహుళ విదియ

12-18 సెప్టెంబర్ 2022

వెల : ₹15/-

నిజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు

ప్రత్యేక సంచిక

75

## రతనాల వీణ 'విముక్తి' నాదం


ఏడున్నర దశాబ్దాల తరువాత మొదటిసారి జాతీయ స్ఫూర్తితో తెలంగాణ గడ్డపై విముక్తి దినోత్సవాలు జరుగుతున్నాయి. ఇదొక గొప్ప మార్పు



జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

74 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక


ఈ 75 ఏళ్లలో దేశం ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొందని
మరో 25 ఏళ్లలో అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలని
ఎర్రకోట పైనుంచి ప్రకటన చేసిన
గౌ॥ ప్రధాని నరేంద్రమోదీ గారికి
72వ జన్మదిన
(సెప్టెంబర్ 17)
&
తెలంగాణ విమోచన దినోత్సవ
(సెప్టెంబర్ 17)
శుభాకాంక్షలు
శ్రీమతి & శ్రీ చింతల అరుణ - సురేందర్ యాదవ్
నాగోల్ డివిజన్ కార్పొరేటర్ - బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి


కశ్మీరానికి శాంతినీ, కాంతినీ కూర్చినవాడు
ఆక్రమిత కశ్మీరం ఎప్పటికీ మనదేనన్నవాడు
నరేంద్రమోదీ గారికి
72వ జన్మదినం
మరియు
తెలంగాణ
విమోచన దినోత్సవం
సెప్టెంబర్ 17
శుభాకాంక్షలు
అర్వింద్ ధర్మపురి
పార్లమెంట్ సభ్యులు - నిజామాబాద్

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ **040-27561453/9959997013**

## జాగృతి చందా – సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- ✦ అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- ✦ తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- ✦ పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- ✦ చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- ✦ రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ✦ ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- ✦ మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- ✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- ✦ **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- ✦ చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | **9959991304** |

డిజైనర్లు : సిహెచ్. కుమార్, ఎం. అనిత

**చు**ట్టుపక్కల ముస్లింలు ఉంటే అక్కడ హిందూ ఆలయాల నిర్మాణం, జీర్ణోద్ధరణ– రెండూ నిషిద్ధమే. పండుగలు, పర్వదినాలలో సాధుసంతులు వచ్చి ప్రసంగించడమూ చట్ట విరుద్ధమే. గ్రంథాలయాలు స్థాపించుకోవాలన్నా, పుస్తకాలు చదువుకోవాలన్నా సర్కారు అనుమతి తప్పనిసరి. ఇదీ నిజాం ఏలుబడి తీరు. ఈ సంస్థానంలో 87 శాతం హిందువులు. పది శాతమున్న ముస్లింలు మాట్లాడే పర్షియా అధికార భాష. కేఎం మున్షి రచన 'ది క్రాప్లింగ్ డికడెన్స్ ఆఫ్ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్' లోని కొన్ని వాక్యాలివి. ఆ సంస్థానంలో హిందువుల అణచివేత గురించి వందల రచనలు వచ్చాయి. ఆ చరిత్రను ఈ తరం దృష్టికి తేవడానికి ఉద్దేశించినవే నిజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు.

క్రీస్తుశకం 1206 మొదలు క్రీస్తుశకం 1857 వరకు సాగిన ముస్లిం పాలన, పర్యవసానాల గురించి నేటి తరాలు తెలుసుకోవాలి. భారతీయులు ద్వితీయ శ్రేణి పౌరులు కావడం దాని ఫలితమే. ఇస్లాం తరహా పాలనకు చిరునామాల వంటి అనేక ప్రాంతాలు దేశంలో వెలిశాయి. దాని దుష్ప్రభావాలను చవిచూసిన ప్రదేశాలు ఇంకా ఎక్కువ. దీనికి ప్రతిఘటన ఎదురైనా అది తాత్కాలికమే అయింది. కారణం– హిందువుల అనైక్యత, చరిత్ర పట్ల స్పృహ లోపించడం. ఉదయ్‌పూర్, విజయనగరం, ఓరుగల్లు వంటి ప్రాంతాలు ముస్లిం మత రాజ్య విస్తరణను నిరోధించగలిగాయి. ఖిల్జీలూ, తుగ్లక్‌లూ, మొగలులూ నాడు పాల్పడిన అకృత్యాలను ఇప్పుడు గుర్తు చేయాలా? వాళ్లు కూల్చేసిన దేవాలయాల గురించి ఇప్పటి తరాలకు చెప్పాలా? అందువల్ల భారతదేశంలో సామరస్య వాతావరణానికి భంగం కాదా? అని ప్రశ్నించే కుహనా మేధావులు, దొంగ సెక్యులరిస్టులు దేశంలో అంతకంతకు ఎక్కువవుతున్నారు. అలా చెప్పే క్రమంలో వీళ్లు మరుగు పరిచే అంశాలు, మసి పూసి మారేడుకాయ చేసే విషయాలు హిందూత్వ అస్తిత్వానికి సవాళ్లే. తాము ప్రత్యేక జాతి అని ప్రకటించుకుని, తమ మతాధిపత్యం కోసం ఈ దేశాన్ని విభజించిన ముస్లింల ధోరణి నాటికీ

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ భాద్రపద బహుళ విదియ**

**లోపలి పేజీలలో...**




ముఖపత్ర కథనం
**నిజాం మీద పోరుకు అడుగులు నేర్పిన అక్షరాలు** 6లో



**నిరంకుశత్వ నీడ, మతోన్మాద జాడ** 12లో



**అలజడికి బీజం ఆర్య సమాజం** 21లో

# జాగృతి

## సంపాదకీయం

నేటికీ ఎలా ఉంది? కొన్ని పార్టీలు, కొందరి బుజ్జగింపులు ఆ ఆధిపత్య ధోరణిని వారిలో ఇంకాస్త పెంచలేదా? ఆ మత్తు నుంచి ఆ వర్గం బయటపడలేక పోతోంది. అంతర్జాతీయ పరిస్థితులు కూడా ఇందుకు సహకరిస్తున్నాయి. ఈ ధోరణే దారుణ పరిణామాలకు కేంద్రబిందువైంది. ఆ ఆధిపత్య మనస్తత్త్వమే ఈ క్షణపు సత్యం కూడా. ఇందుకు మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పు గొప్ప రుజువు.

ఇప్పటిదాకా రకరకాల కారణాలతో హిందువుల పండగల మీద చిత్రవిచిత్ర రీతిలో న్యాయస్థానాలు నిషేధాలు విధించడం చూశాం. ప్రతి దీపావళికి నిషేధాజ్ఞ

## విముక్తి ఉత్సవాలు

ఒకటి సిద్ధంగా ఉంటుంది. హిందువులు సామాజికోత్సవాలను జరుపుకోవడానికి జమాత్ అనుమతి తీసుకోమని తాజాగా సాక్షాత్తు న్యాయస్థానమే ఆదేశించింది.

కోయంబత్తూర్‌లోని ఉక్కాడం ప్రాంతంలో పుల్లకాడు హౌసింగ్ యూనిట్ దగ్గర గణేశ్ మంటపం ఏర్పాటుకు అనుమతించవలసిందిగా మహాలక్ష్మి అనే మహిళ మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. మొదట అనుమతి కోసం పోలీసులకు దరఖాస్తు చేసినప్పటికీ, ఆ ప్రాంతంలో ముస్లింలు అధికంగా ఉన్నారు కాబట్టి అనుమతించడం లేదని వారు చెప్పారు. అందుకే ఆమె హైకోర్టుకు వెళ్లారు. ఈ ఉత్సవం, అందులో భాగంగా చేసే అన్నదానంతో ఎవరికీ ఇబ్బంది ఉండదు కాబట్టి అనుమతి ఇవ్వవలసిందిగా పోలీసులను ఆదేశించాలని మహాలక్ష్మి కోరారు. ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతం కాబట్టి గణేశ్ ప్రతిష్ఠకు అనుమతి ఇస్తే శాంతిభద్రతల సమస్య వస్తుందని అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. అసలు అక్కడ మంటపం పెట్టడానికి ముస్లింలే సానుకూలంగా ఉన్నారని, తాము కూడా ఉత్సవంలో పాల్గొంటామని కూడా చెప్పారని పిటిషనర్ తరపు న్యాయవాది సమాధానం ఇచ్చారు. ఈ వాదనలు విన్న జస్టిస్ ఎన్. సతీశ్‌కుమార్ చిత్రమైన తీర్పు ఇచ్చారు. ఆగస్ట్ 31 నాటి గణేశ్ చతుర్థికి తాము మంటపం ఏర్పాటు చేసుకుంటున్నట్టు పోలీసులకు ఒక అఫిడవిట్, జమాత్‌కు (ముస్లిం సమాజం) ఒక అఫిడవిట్ ఇవ్వాలని 26న ఆదేశాలు ఇచ్చారు. పోలీసుల అనుమతి సరే, జమాత్ అనుమతి ఎందుకు? ఇది హిందువులను అవమానించేది కాదా? ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ కూడా హిందువులును ద్వితీయ శ్రేణి పౌరులుగానే చూడదలచుకున్నాయా? అది ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతం కాబట్టి విగ్రహం పెట్టడం వరకే పిటిషనర్ పరిమితం కావాలి, విగ్రహంతో ఊరేగింపునకు అనుమతి లేదని కూడా కరాఖండీగా చెప్పింది కోర్టు.

ఇది సెక్యులర్ దేశం, ఇక్కడ అన్ని మతాలకు సమ గౌరవం ఉంటుంది అన్న రాజ్యాంగ సూత్రమే ఇక్కడ దారుణంగా భంగపడలేదా? వందేళ్ల నాడు లేదా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడున్నర దశాబ్దాల తరువాత కూడా హిందువులకు మతస్వేచ్ఛ మిథ్య అని తేలిపోయింది. నిజాం రాజ్యంలో ఆలయాల నిర్మాణం, జీర్ణోద్ధరణలను నిషేధించారు. పండుగలను బహిరంగంగా జరుపుకునే హక్కును హిందువుల నుంచి లాగేశారు.

ఇప్పుడు కోయంబత్తూరులో జరిగింది దాదాపు అదే. దేశంలో సెక్యులరిజం ఉన్నదా, లేదా? అది హిందువులను ఏ విధంగా పరిగణిస్తున్నది వంటి ప్రశ్నలకు సరైన సమాధానం గతం ఆధారంగా, వర్తమాన పరిస్థితుల అవగాహన చేసుకుంటేనే సాధ్యం. తరచి చూస్తే చాలాచోట్ల హిందువుల పరిస్థితి నిజాం రాజ్యంలోను, స్వతంత్ర భారతదేశంలోను ఒకే తీరుగా ఉందని అనిపిస్తుంది. ఈ దుస్థితి నుంచి హిందువులు తమను తామే విముక్తం చేసుకోవాలి. అందుకు ఈ అమృతోత్సవాలు కొత్త స్ఫూర్తిని ప్రసాదిస్తాయని ఆశిద్దాం. ★

12 సెప్టెంబర్ 2022, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్


26లో

**అసఫ్ జాహీల పాలిట అంకుశం ఆంధ్ర మహాసభ**


40లో

కథ

**నాలో ఉన్న బూజు**

- డా॥ చెల్లపిల్ల సూర్యలక్ష్మి


32లో

**తెలంగాణ రైతాంగ పోరాటం**

ధారావాహిక నవల

**ఆనంద మఠం**

- బంకించంద్ర చటర్జీ


42లో


34లో

**సమాఖ్యకు సలాం!**


| | | |
|---|---|---|
| 'విముక్తి'లో కలాలు.. గళాలు.. | - | 16 |
| నిజాంపై నారీ భేరి | - | 30 |
| ప్రపంచ కుబేరుడి నిరుపేద సంస్థానం | - | 38 |
| వారఫలాలు | - | 48 |
| పదరసం | - | 49 |



నిజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు

# నిజాం మీద పోరుకు అడుగులు నేర్పిన అక్షరాలు

నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరించేందుకు గ్రంథాలయోద్యమం ఒక సాధనం కాగలదన్న భావన అప్పటి మేధావులలో ఉండేది. గ్రంథాలయోద్యమం, ఆంధ్ర భాషోద్యమం అపుడు పరస్పరం పర్యాయ పదాలైనట్లు సాగుతుండేవి. గ్రంథాలయాలకు వారు పెట్టిన పేర్లను బట్టి చాలా అంశాలు అవగతమవుతాయి. భాషతో భావ దారిద్ర్యాన్ని, బానిస ప్రవృత్తిని వదలగొట్టాలని నాటి పెద్దలు యోచించడానికి చాలా కారణాలే ఉన్నాయి. సంస్థానంలోని మూడు భాషా ప్రాంతాలలో తెలంగాణ కంటే మరాఠా, కన్నడ ప్రాంతాలు తమ భాషా సంస్కృతుల పరిరక్షణలో మెరుగుగా ఉండేవి. ఆ ప్రాంతాలు హైదరాబాద్‌కు కొంత దూరంగా ఉన్నందువల్ల అధికారుల దృష్టి కొంత తక్కువగా ఉండేది. తన జీవితపు తొలి దశలో మరాఠా ప్రాంతంలో నివసించిన కొమర్రాజు లక్ష్మణరావు తెలుగు, ఇంగ్లిష్‌లతో పాటు మరాఠీలోనూ పండితుడు. ఆయన తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఆద్యుడు. తెలుగులో అక్షరాస్యత గలవారు తెలుగు సాహిత్యాన్ని, దేశంలోని ఇతర ప్రాంతాలలో జరుగుతున్న రాజకీయ, సాంస్కృతిక పరిణామాలను తెలుసుకునేందుకు వీలుగా గ్రంథాలయోద్యమాన్ని ప్రారంభించాడాయన. అంటే నిజాం రాజ్యంలోని హిందువులు తాము ఏ స్థితిలో ఉన్నారో ఆత్మ పరిశీలనకు ఇది ఉపకరించాలని ఆయన భావించారని అనుకోవాలి.

భాషా నిలయం కొత్త భవనం, హైదరాబాద్

జాగృతి డెస్క్



సెప్టెంబరు 1,1901న హైదరాబాద్‌లో శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం, 1904లో హనుమకొండలో శ్రీరాజరాజ నరేంద్ర ఆంధ్రభాషా నిలయం, 1905లో సికింద్రాబాద్‌లో ఆంధ్ర సంవర్ధినీ లైబ్రరీ ఏర్పడ్డాయి. 1910 వచ్చేసరికి సూర్యాపేట (ఆంధ్ర విజ్ఞాన ప్రకాశిని), మంథని, హుజూర్ నగర్, కుక్కునూరు, రుద్రకోట, శుభ్రవీడు, శ్రీశైలం, చెన్నూరు వంటి చిన్నస్థాయి తెలంగాణ పట్టణాలలో కూడా గ్రంథాలయాలు ఆవిర్భవించాయి. 1913లో వరంగల్లులో శబ్దానుశాసన గ్రంథాలయాన్ని నెలకొల్పారు. త్వరలోనే ఆదిలాబాదు నుంచి నల్లగొండ – మహబూబ్ నగర్ సరిహద్దుల వరకు పలువురు ఉత్సాహవంతులు స్వయంగా పుస్తక భాండాగారాలు తెరిచారు. అవి కొన్ని వందల నుంచి వేలాది పుస్తకాలతో నడిచేవి. 1920 నుంచి ఆరంభించి తెలుగు వార్తాపత్రికలను, మేగజైన్లను ఆయా గ్రంథాలయాలకు తెప్పిస్తుండేవారు. వివిధ గ్రంథాలయాల సమాచారాన్ని 'తెనుగు' అనే వార్తాపత్రిక వెలుగులోకి తెస్తుండేది. వాటి పేర్లను గమనించినప్పుడు, తర్వాతి కాలంలో రాజ్యానికి విముక్తి లభించినపుడు హిందూ–ముస్లిం ఐక్యతను సాధించడం ఆ గ్రంథాలయ స్థాపకుల లక్ష్యమనిపించేది.

హైదరాబాద్ ప్రభుత్వం రైతుల నుంచి శిస్తులో రూపాయికి ఒక అణా చొప్పున (రూపాయికి మొత్తం 16 అణాలు) స్థానిక నిధికి సర్ ఛార్జ్‌గా వసూలు చేస్తుండేది. కానీ ప్రాంతీయ భాషా గ్రంథాలయాలకు, పాఠశాలలకు ఎటువంటి నిధులు కేటాయించేది కాదు. పైగా, గ్రంథాలయాలు తెరిచిన ఔత్సాహికులను, వాటిని మూసివేయవలసిందిగా వత్తిడి చేసేది. తను మాత్రం ఉర్దూ, పర్షియన్, అరబిక్ గ్రంథాల కోసం హైదరాబాద్‌లో అసఫియా కుఖానా పేరిట లైబ్రరీ నెలకొల్పింది. ఇతర గ్రంథాలయాల నిర్వహణలో అధికారులు పలు సమస్యలు సృష్టిస్తుండేవారు. వాటిలో ఉంచాలంటూ ఉర్దూ పుస్తకాలు పంపేవారు. పోలీసులు తరచు ఆ గ్రంథాలయాలకు వెళ్లి అక్కడ జరిగే కార్యకలాపాలను గమనించేవారు. నిర్వాహకుల సమావేశాలపై నిఘా వేసేవారు. తరచు రికార్డులు తీసుకువెళ్లేవారు.

ఇన్ని నిర్బంధాలున్నా గ్రంథాలయోద్యమం పువ్వాడ వెంకటప్పయ్య, టి.కె. బాగయ్య, చట్రాతి లక్ష్మీనరసమ్మ, గంగుల సాయిరెడ్డి, మంత్రిప్రగడ వెంకటేశ్వరరావు, జానపాటి సత్యనారాయణ, ఉన్నవ వెంకటరామయ్య వంటివారి నిబద్ధమైన, నిస్వార్థమైన కృషి వల్ల విస్తరించసాగింది. వీరంతా ఒక బృందం వలె పనిచేశారు. 1901లో ఆరంభమైన ఆ ఉద్యమం తెలంగాణలో స్వాతంత్ర్యోద్యమకాలమంతా సాగి, సాంస్కృతిక పునరుజ్జీవనానికి దోహదం చేసి, అంతిమంగా నిజాం పాలనకు చరమవాక్యం పలికే రాజకీయోద్యమానికి దారులు వేసింది. గ్రంథాలయోద్యమం క్రమంగా విస్తరించి ప్రాముఖ్యాన్ని సంపాదించటంతో ఒక స్థాయిలో తెలంగాణలో గ్రంథాలయ సదస్సు జరిగింది. గ్రంథాలయోద్యమం క్రమంగా, ఆంధ్ర జనసంఘం నాయకత్వాన ఉండిన ఆంధ్రోద్యమంలో విలీనమైంది. ఈ పరిణామం 20వ శతాబ్దపు మూడవ దశాబ్దంలో చోటు చేసుకోగా, తర్వాతి శతాబ్దంలో నిజాం ఆంధ్రమహాసభలో భాగమైంది. ఆ విధంగా తొలుత కేవలం నిజాం సంస్థానంలో ఆంధ్ర సాంస్కృతికోద్యమంగా ఉన్న గ్రంథాలయోద్యమం, ఒక విశిష్టమైన రాజకీయోద్యమంగా పరిణతి చెందింది.

తెలంగాణ ప్రజల చైతన్యాన్ని పెంచేందుకు ఇతర







అనుబంధ ఉద్యమాలను ప్రారంభించటానికి గ్రంథాలయోద్యమం పునాదులు వేసింది. ఆ విధంగా ఉద్యమం బహుముఖీనమైంది. సంస్థానంలో రచనలు, ప్రచురణలు పెరిగాయి. అప్పుడు వెలువడిన సాహిత్యాన్ని చారిత్రక, వైజ్ఞానిక రచనలనీ, చిన్న కథలు, జాతీయ గీతాలని వర్గీకరించవచ్చు. ఆ తర్వాత నుంచి తెలంగాణ సాహిత్య దిశ సామాజిక, రాజకీయ అంశాలవైపు మళ్లింది. కొమర్రాజు లక్ష్మణరావు ఆలోచనల మేరకు హైదరాబాద్‌లో విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి ఏర్పడి, తర్వాత ఆయన పేరిట 'లక్ష్మణరాయ పరిశోధన మండలి'గా రూపాంతరం చెందింది. ఆ సంస్థ పక్షాన అనేక వైజ్ఞానిక, సామాజిక, చారిత్రక గ్రంథాలను చవక ధరకు ప్రచురించారు. మధ్యయుగాల నాటి తెలంగాణ చరిత్ర గ్రంథాలను కూడా వారు ప్రచురించటంతో పాటు, పరిశోధకులను గ్రామాలకు వెళ్లి శాసనాలు, తాళపత్ర గ్రంథాలు, ఇతర చారిత్రక ఆధారాలను సేకరించేటట్టు ప్రోత్సహించారు. ఇరవయ్యవ శతాబ్దపు మొదటి దశాబ్ద కాలంలో వేసిన సాహిత్య బీజాలు ఆ విధంగా తర్వాతి కాలంలో గొప్ప ఫలితాలనిచ్చాయి.

శేషాద్రి-రమణ కవుల పేరిట జంటకవులుగా ప్రసిద్ధులైన ఇద్దరిలో ఒకరైన దూపాటి వేంకటరమణాచార్యులు తనకు చారిత్రక పరిశోధనలో ఉన్న ఆసక్తితో ఆ పని కోసమే తెలంగాణ వచ్చి ఉపాధ్యాయునిగా స్థిరపడ్డారు. ఆయన అనేక శాసనాలను గ్రామాల నుంచి సేకరించి అప్పటి పత్రికలలో ప్రచురించారు. 'తెలంగాణలో మీరు ఎక్కడకు వెళ్లినా తాళపత్ర గ్రంథ సాహిత్యం లభిస్తుం'దని ఆయన సభలలో అంటుండేవారు. ఆయన వరంగల్లులో కాకతీయుల చరిత్రపై సదస్సు నిర్వహించి, ఆ పత్రాలతో కాకతీయ సంచిక పేరిట ఒక సంకలనాన్ని ప్రచురించాడు. తెలంగాణ సాహిత్య ప్రపంచానికి సురవరం ప్రతాపరెడ్డి ఇచ్చిన కానుక గోలకొండ కవుల సంచిక. సాహిత్యోద్యమంలో, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు తదితరులు ముఖ్యమైన పాత్రలు పోషించారు. సురవరం సామాజిక కార్యకలాపాలలో కూడా చురుకుగా పాలుపంచుకునేవారు. ఆయన రచించిన ఆంధ్రుల సాంఘిక చరిత్ర, తెలుగువారి సామాజిక, సాంస్కృతిక చరిత్ర రచనలో ఒక మైలురాయి వంటిది.

విజ్ఞాన చంద్రికా మండలి వలెనే మరికొన్ని ప్రచురణ సంస్థలు ఆ కాలంలో ఏర్పడి సామాజిక, చారిత్రక అంశాలపై అనేక పుస్తకాలను వెలువరించాయి. వాటిలో గోలకొండ, కిన్నెర, దివ్యవాణి, సుకృతి, ప్రసాదం, మాతృభారతి, ఆంధ్రశ్రీ, కాకతీయ, పూలతోట, వీరేశలింగ కవికంఠాభరణ, కృషి ప్రచారిణి, శివధర్మ, విజ్ఞాన ప్రచారిణి, వెంకటేశ్వర, కావ్యమాల అన్నవి పేరు పొందాయి. అణా గ్రంథమాల, దేశోద్ధారక గ్రంథమాల, ఆంధ్రకేసరి గ్రంథమాల సంస్థలు ఉద్యమానికి మద్దతుగా చవకగా పుస్తకాలను ప్రచురించేవి. కాని వాటిని రాయటం, ముద్రించటం కన్నా ప్రజలలోకి తీసుకువెళ్లటం ఎక్కువ కష్టంగా ఉండేది.

తెలుగు భాషాసంస్కృతుల పట్ల ప్రభుత్వ ఉపేక్ష అట్లుండగా, పుస్తకముద్రణ సదుపాయాలు తక్కువ. 1926 నాటికి కూడా కేవలం తెలుగులో ముద్రించే కేంద్రాలు హైదరాబాద్‌లో లేవు. అయిదారు ప్రెస్‌లలో అందుకు ఏర్పాటు మాత్రం ఉండేది. హైదరాబాద్ బయట వరంగల్, నల్లగొండ, ఇనుగుర్తిలో ఉండేవి. ఆ కాలంలో ప్రత్యేకంగా తెలుగు ముద్రణాలయాలన్నవి లాభసాటి అయ్యేవి కావు. 1912లో సరోజినీ విలాస్ ప్రెస్‌లో ముద్రితమై పాలమూరు (మహబూబ్ నగర్) నుంచి వెలువడిన 'జాతబోధిని' పత్రికను తొలి తెలుగు మాసపత్రికగా భావిస్తారు. దానికి సంపాదకుడు, ప్రచురణకర్త శ్రీనివాసశర్మ. కాని ఆ పత్రిక నిధుల కొరతతో మరుసటి సంవత్సరమే నిలిచిపోయింది. తర్వాత అక్కడా ఇక్కడా పత్రికలు వెలువడినా ఎక్కువకాలం నిలవలేదు. డివైన్ లైఫ్ సొసైటీ ఆలోచనలను ప్రచారం చేసేందుకు స్వామి వెంకటరావు 1917లో 'ఆంధ్రమాత' పత్రికను ప్రారంభించాడు. 1922 ప్రాంతంలో నల్లగొండ నుంచి 'నీలగిరి' పత్రిక మొదలైంది. వరంగల్ నుంచి 1923 జూన్‌లో ఆంధ్రాభ్యుదయం అనే మాస పత్రికను కోకల సీతారామశర్మ వెలువరించాడు. తెలంగాణలో విద్యావ్యాప్తి ఆ పత్రిక లక్ష్యం. అదే సంవత్సరం డిసెంబర్‌లో వరంగల్ నుంచే 'శైవ ప్రచారిణి' అనే మరొక మాసపత్రిక ఆరంభమైంది. వ్యవస్థాపకుడు కడివెల రాజలింగారాధ్య, సంపాదకుడు ముదిగొండ వీరేశలింగశాస్త్రి.

## సామాజిక సంస్కరణ

భారతదేశంలో సామాజిక సంస్కరణ, సామాజిక అభ్యున్నతి, జాతీయోద్యమం ముప్పేటగా సాగాయి. ఇందుకు హైదరాబాద్ రాజ్యం మినహాయింపు కాలేదు. బ్రిటిష్ ఇండియాలో సామాజిక పరిణామాల గురించి తెలిసిన మేధావులు, సాంస్కృతికోద్యమంలో భాగంగా సామాజిక సంస్కరణోద్యమాన్ని కూడా చేపట్టారు. హైదరాబాద్ సంస్థానంలో ఇందుకు ఆద్యుడు మాదర భాగ్యరెడ్డి వర్మ. ఆయన దళితుల అభ్యున్నతి కోసం పాటుపడ్డాడు. నగరంలోని దళితవాడలలో ఈ కార్యక్రమాన్ని 20వ శతాబ్దపు మొదటి దశకంలోనే ఆరంభించాడు. వారు తమ వివాహాల పరిష్కారం కోసం పంచాయితీల వైపు వెళ్లవద్దని, అవి తమకు అన్యాయం చేస్తాయని వారికి చెప్పాడాయన. కుల పంచాయితీలు కక్షిదారులు ఇద్దరినీ కొల్లగొడుతున్నందున అందుకు బదులు న్యాయ పంచాయితీలను ఏర్పాటు చేసుకొమ్మన్నాడు. మద్యపానం మానివేసి భవిష్యత్తు కోసం సొమ్ము దాచుకోవాలని చెప్పాడు. తమ రోజు కూలీ నుంచి అణా చొప్పున పొదుపు చేస్తే సంవత్సరానికి తులం బంగారం కొనుక్కోవచ్చునని లెక్కలు చూపాడు. ఆదిహిందువుల పేరిట తొలుత 35 మంది దళితులతో స్వచ్ఛంద సేవాదళాన్ని ఏర్పాటుచేశాడు. ఆ దళ సభ్యులు దళితులను చైతన్యవంతులను చేసేందుకు సమావేశాలు ఏర్పాటుచేశారు. ఇతర కులాలవారితోనూ కలిసి పనిచేసి వారి ప్రశంసలు


భాగ్యరెడ్డి వర్మ

పొందారు. భాగ్యరెడ్డి జగన్మిత్ర పేరుతో ఒక సంస్థను ఏర్పాటుచేసి దానిద్వారా దళితవాడలలో దళిత హరిదాసులతో భజనలు, హరికథల వంటివి చెప్పించేవాడు.


దళిత కళాకారులతో పాటు జానపద నృత్యాలు, నాటక కార్యక్రమాలు నిర్వహించ వలసిందిగా ఇతర కులాలవారిని ప్రోత్సహించాడు. తర్వాత 1911లో సామాజిక సంస్కరణల కోసం దళితులను, సవర్ణులను కలిపి ఆది-హిందూ సర్వీస్ లీగ్‌ను నెలకొల్పాడు. ఆ లీగ్‌కు కార్యదర్శిగా పనిచేశాడు. 1921 నుంచి 1924 వరకు ఆది-హిందూ సభలు నిర్వహించాడు.

దళితుల అభ్యున్నతితో పాటు సామాజిక సంస్కరణోద్యమాన్ని చేపట్టేందుకు హైదరాబాద్‌లో 1913లో డెక్కన్ హ్యూమానిటేరియన్ లీగ్‌ను ఏర్పాటు

చేశారు. అందులో అన్ని కులాలవారున్నారు. లీగ్‌కు లాల్జీ మేఘ్ జీ అనే కలప కాంట్రాక్టరు ఉదారంగా ఆర్థికసహాయం చేశాడు. ఆ సంస్థకు రాయ్ బాలముకుంద్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగా, భాగ్యరెడ్డి కార్యదర్శి. 1915లోనే హైదరాబాద్ సోషల్ సర్వీస్ లీగ్‌ను కూడా స్థాపించారు. హిందూ సమాజాన్ని సంస్కరించవలసిన అవసరం గురించి ప్రజలకు తెలియజెప్పేందుకు జిల్లాలలో పలు సమావేశాలు నిర్వహించారు. సంస్కరణల సమస్యలను చర్చించేందుకు మూడు సామాజిక సదస్సులు జరిపారు. హైదరాబాద్‌లో 1921 నవంబర్ 11-12 తేదీలలో జరిగిన చివరి సదస్సులో ఆలంపల్లి వెంకటరామారావు తెలుగులో మాట్లాడుతుండగా మహారాష్ట్ర యువకులు హేళన చేశారు. ఆ సదస్సులో వేర్వేరు భాషలవారున్న మాట నిజమే అయినా, అత్యధిక సంఖ్యాకులైన తెలుగువారి పరిస్థితి ముస్లిమేతర వర్గాల దృష్టిలో కూడా తీసికట్టు అయినట్లు ఆ ఘటన నిరూపించింది. దానితో ప్రభుత్వంతోపాటు ఉర్దూ, మరాఠా, కన్నడ సామాజికులు తమను గుర్తించి గౌరవించే విధంగా ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవాలని తెలుగు మేధావులు భావించారు. వారు అదే రాత్రి సమావేశమై ఆంధ్ర జనసంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సాంస్కృతిక ఉద్యమం పేరిట ఒక సుదీర్ఘమైన రాజకీయ ఉద్యమానికి ఆ విధంగా అంకురార్పణ జరిగింది.

**జాతీయోద్యమం**

తెలుగు భాషా సంస్కృతుల పునరుద్ధరణకు 20వ శతాబ్దపు మొదటి రెండు దశాబ్దాల కాలంలో జరిగిన ఈ ప్రయత్నాలను అట్లుంచి, బ్రిటిష్ ఇండియాలో చోటుచేసుకున్న ముఖ్య పరిణామాలకు కూడా హైదరాబాద్ రాజ్యం స్పందించింది. అక్కడి రాజకీయ కార్యకలాపాలతో సంస్థాన ప్రజలకు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. స్వదేశీ ఉద్యమాన్ని హైదరాబాద్ నగరంలో 1905లో ముల్లా అబ్దుల్ ఖయ్యూం, అఘోరనాథ ఛటోపాధ్యాయ ఆరంభించారు. నగరంలోని పలుచోట్లనేగాక బయట కూడా వారు సమావేశాలు జరిపి స్వదేశీ గురించి వివరిస్తూ విదేశీ ఉత్పత్తులను బహిష్కరించవలసిందిగా ప్రజలను కోరారు. లాలా లాజపత్ రాయ్, బాలగంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్ వంటి జాతీయ నాయకుల చిత్రాలను విక్రయించారు. జాతీయవాద కార్యకలాపాల వ్యాప్తికి వివేకవర్ధని, నూతన విద్యాలయ, శ్రీకృష్ణదేవరాయ గ్రంథాలయం వంటి సంస్థలు కేంద్రాలుగా మారాయి. తిలక్‌ను ప్రభుత్వం విచారించి 1908లో ద్వీపాంతర శిక్ష విధించిన అనంతరం ఉద్యమం ఉద్ధృతమైంది. చిన్నా పెద్దా భజనమండళ్లు, ఇతర సంఘాలు ఆందోళనలో పాల్గొన్నాయి. నిజాం ప్రభుత్వం విదేశీ సరకుల దిగుమతినైతే నిరోధించలేదుగాని, స్వదేశీ వస్త్రాలను, ఉద్యమ సాహిత్యాన్ని విక్రయించరాదని దుకాణాల వారిని హెచ్చరించింది. 1918లో కాంగ్రెస్ కమిటీ



ఆన్ హైదరాబాద్, హైదరాబాద్ స్టేట్ రిఫార్మ్స్ అసోసియేషన్ పేరిట రెండు సంస్థలు ఏర్పడ్డాయి. ఖిలాఫత్ ఉద్యమంతో ముస్లిం, హిందూ మేధావులు ఒకే వేదిక పైకి వచ్చారు. వారి ఉమ్మడి సమావేశాలు వివేకవర్ధిని పాఠశాలలో జరుగుతుండేవి. ఆ ఉద్యమానికి బారిస్టర్ అస్టర్, అస్కరీ హసన్, ఖలీయుజ్జమా, మొహమ్మద్ మూర్తుజా, హుమాయూన్ మీర్జా నాయకత్వం వహించారు. కాని ఆ మైత్రి స్వల్ప కాలికం అయింది. అదెట్లున్నా, బాధ్యతాయుత ప్రభుత్వాన్ని కోరుతూ విస్తృత రాజకీయోద్యమాన్ని ప్రారంభించేందుకు హైదరాబాద్‌లో పరిస్థితులు అనువుగా ఉన్నట్లు మాత్రం ఈ పరిణామాలు సూచించాయి.

హైదరాబాద్ రాజ్యంలోని జాతీయోద్యమం విప్లవ జాతీయోద్యమ ధోరణికి దూరంగా ఏమీలేదు. 1895లో జువ్వాద్ హుస్సేన్ అనే వ్యక్తి బ్రిటిష్ రెసిడెంట్‌ను హతమార్చేందుకు ప్రయత్నించగా అతన్ని పట్టుకుని రాజ్యం నుంచి బహిష్కరించారు. బ్రిటిష్ ఇండియాలో అటువంటి చర్యలకు పాల్పడిన విప్లవకారులు కొందరు హైదరాబాద్ సంస్థానంలో శరణు తీసుకునేవారు న్యాయశాస్త్రం చదివేందుకు ఇంగ్లండులో ఉండిన (1908-10) శ్రీకిషన్‌కు వీర సావర్కర్ స్థాపించిన అభినవ భారత్‌తో సంబంధాలుండేవి. ఆయన న్యాయమూర్తి రాయ్ బాల్ ముకుంద్ కుమారుడు. తండ్రి చదువు పూర్తిచేయకుండానే తిరిగి రావలసిందిగా చెప్పాడు. అట్లా వచ్చిన శ్రీకిషన్ ఇక్కడనే న్యాయశాస్త్రం చదివి ప్రాక్టీసు ఆరంభించాడు. మరొకవైపు తీవ్రవాద సిద్ధాంతాలతో యువకులను జాతీయోద్యమం దిశగా ప్రోత్సహిస్తూనే ఉన్నారు. నియంతృత్వ పాలనలో ఉండిన హైదరాబాద్ సంస్థానంలో అధిక సంఖ్యాకులైన ప్రజలు, నాయకులు తమ సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం అనుసరించిన ఈ రాజకీయ-సాంస్కృతిక వ్యూహాలలో, పరాయిపాలనకు వ్యతిరేకంగా బ్రిటిష్ ఇండియాలో జరిగిన జాతీయోద్యమ లక్షణాలన్నీ కనిపించేవి. ఈ వ్యూహాలు 20వ శతాబ్దపు మొదటి రెండు దశాబ్దాల పొడవునా కన్పించాయి. 19వ శతాబ్దపు చివరి దశలోనే నాటిన ఈ విత్తనాలు ఈ రెండు దశాబ్దాలలో మొలకెత్తాయి. ★




దేశభక్తి, ధర్మనిష్ఠ, కార్యదీక్ష దక్షత గల,
సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్
అనే నినాదంతో ప్రజల అభిమానాన్ని చూరగొన్న
మన ప్రియతమ ప్రధాని
గౌ॥ ప్రధాని నరేంద్రమోదీ గారికి
72వ జన్మదిన
(సెప్టెంబర్ 17)
&
తెలంగాణ విమోచన దినోత్సవ
(సెప్టెంబర్ 17)
శుభాకాంక్షలు
గద్వాల వెంకటాద్రి రెడ్డి
భాజపా రాష్ట్ర నాయకులు, గద్వాల్ నియోజకవర్గం, తెలంగాణ

*With best complements from*

# WUNDERKINDS PUBLIC SCHOOL

**H.no1-9-819, Postal colony, subedari, Hanamkonda, Warangal- Pin:506001.**

## మా పాఠశాల ప్రత్యేకత


విద్యార్థులకు చదువుతోపాటు ఆధ్యాత్మిక పరంగా భగవద్గీత తరగతులు,
కరాటే శిక్షణ తరగతులు, సంగీతం, నాట్యం, సంస్కృతం మొదలైన అంశాలను నేర్పిస్తాం.
నేటి సమాజంలో విద్యార్థులకు ఇవి కొరవడినవి. ఈ అంశాలను విద్యార్థులు నేర్చుకుని సమాజంలో
మంచి నడవడిక, క్రమశిక్షణ గల విద్యార్థులుగా తీర్చిదిద్దడానికై మా పాఠశాల ప్రయత్నం చేస్తున్నది.



*correspondent*
**R.Varaprasad**


*principal*
**R.Navaneetha**

నిజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు



# నిరంకుశత్వ నీడ, మతోన్మాద జాడ

చరిత్రనీ, సామాజిక పరిణామాలనీ సృజనాత్మక ప్రక్రియతో విశ్లేషించడం క్లిష్టమైన అభిరుచి. చారిత్రకతకు లోటు లేకుండా, విశ్వసనీయతకు భంగం రాకుండా కాలగమనాన్నీ, ఆయా ఘటనలనీ సఫలీకరించడం సామాన్యమైన సంగతి కాదు. 'ది ఇన్ సైడర్'లో పి.వి. నరసింహారావు దీనిని సునాయాసంగా సాధించారు. స్వాతంత్ర్యోద్యమ తుది అంకాన్ని ఆవిష్కరించుకుంటున్న సమర భారతదేశ చరిత్రనూ, హైదరాబాద్ సంస్థానంలో (దీనికే రచయిత పెట్టిన పేరు అఫ్రోజాబాద్) అదే కాలంలో చోటు చేసుకున్న విశిష్టమైన అంశాలను, పరిణామాలను పి.వి. ఈ 'ఆత్మకథాత్మక నవల'లో ఆవిష్కరించారు. కథానాయకుడు ఆనంద్ పాత్ర ద్వారా ఇవన్నీ కళ్లకు కడతారు రచయిత.



నిజాం నివాసం,
కింగ్ కోఠి, హైదరాబాద్

నిజాం సంస్థానం సామాజిక దృశ్యం, హిందూ-ముస్లిం సంబంధాలు, నిజాం సంస్థానంలో అధిక సంఖ్యాకులైన హిందువుల ద్వితీయ శ్రేణి పౌరసత్వం, పర్షియా ఆధిక్యం, ప్రజల భాష తెలుగుకు ఎదురైన నిరాదరణ, ఆచారాలు, అణచివేత, వెట్టిచాకిరి వంటి అంశాలను నవల తొలి అధ్యాయాలలో రచయిత స్పృశించారు. ఏ అంశాన్నయినా చరిత్రలో దాని ప్రాధాన్యం, సామాజిక సాంస్కృతిక పరిణామంలో అది నిర్వహించిన భూమికను పరిచయం చేస్తూనే, కళ్లకు కట్టినట్టు చిత్రించారు. అవి మతం ప్రాతిపదికగా నిజాం రాజ్యంలో సాగుతున్న అరాచకాలే.

ఈ నవలా నాయకుడు ఆనంద్‌ను ప్రభావితం చేసిన నాటి సామాజికాంశాలు సమీక్షించుకోదగినవి. అవన్నీ ఆనంద్‌ను మాత్రమే ఆలోచింపచేసినవి కాదు. కథా కాలానికి కొన్ని దశాబ్దాల ముందు వరకు భారతీయ సమాజాన్ని ప్రభావితం చేసిన అంశాలు కూడా అవే. కథాకాలం తరువాతి యుగాన్ని ప్రభావితం చేసినవీ ఆ అంశాలే. వాటి ప్రతిధ్వనే నిజాం మీద తిరుగుబాటు.

ఇక ఇతివృత్తం దగ్గరకు వస్తే- భారతదేశ పెద్ద సంస్థానాలలో ఒకటైన అఫ్రోజాబాద్‌లో ఒక గ్రామం

జాగృతి డెస్క్

అనంతగిరి. ఆనంద్ సొంతూరు అదే. దేశాన్ని స్వాతంత్య్రేచ్ఛ ఒక ప్రభంజనంలా ఊపేస్తుంటే, వెన్నులో వణుకు పుట్టిన నవాబు మరింత పెట్రేగి పోయిన కాలాన్ని రచయిత పరిచయం చేశారు. నిజాం స్వాతంత్య్రోద్యమం వేడితో ఉన్న మిగిలిన భారతావనితో సంస్థానానికి ఉన్న సంబంధాలు కత్తిరించేశాడు. ఆ రాజ్యంలో రైళ్లు ఆగవు. రేడియోలు మోగవు. అన్నీ ఆంక్షలు. కానీ నవాబు గుర్తించ లేకపోయిన వాస్తవం ఒకటి ఉంది. రాజకీయ కార్యాచరణ నిషిద్ధమైనపుడు సాంస్కృతిక అభివ్యక్తి అనివార్యమవుతుంది. అనంతగిరిలోనూ అదే జరిగింది. మిగిలిన దేశంతో ఉన్న సాంస్కృతిక అనుబంధాన్ని మాత్రం నవాబు విచ్ఛిన్నం చేయలేకపోయాడు. ముఖ్యంగా మెజారిటీ ప్రజల భాష విషయంలో.


అఫ్రోజాబాద్‌లో దేశభాషలకు విలువలేదు. కాని ప్రజలకు వినోదాన్నిచ్చే కళారూపాలు దేశభాషలోనే ఉంటాయి. కమ్మగా పాడుకునే పద్యాలూ ఆ భాషలోనే వినిపించేవి. అయినా, ప్రజలు ఇంతగా ఆరాధించే ఆ భాష పాలకుల దృష్టిలో అనాగరికమైనది. ఇక్కడి ప్రజలతో, సాహిత్యంతో, సంస్కృతితో ఎలాంటి సంబంధం లేని పర్షియన్‌కు రాచమర్యాద. విద్య లేనివాడు కాదు, పర్షియన్ రాని వాడు వింత పశువు. ఇది ప్రజలకు ఆగ్రహం, మనస్తాపం కలిగించేది. కొన్ని కొన్ని రచనలూ, భావాలూ సంస్థానంలో ప్రవేశించడం- ఇంకా చెప్పాలంటే వాటిని గురించి ప్రస్తావించడం కూడా దాదాపు 'రాజద్రోహం'. ప్రధానంగా జవహర్‌లాల్ నెహ్రూ రచనలకు అసలు ప్రవేశం లేదు. ఆయన రచనలకు అటు ఒక్క అడుగు దూరంలో విద్రోహవాదం, ఇటు మరో అడుగు దూరంలో ఉగ్రవాదం ఉంటాయని నవాబుగారి వీర విధేయులు దృఢాభిప్రాయం. ఇలాంటి నిర్బంధం, వెనుకబాటుతనాలకు తోడు పేదరికం సంస్థానంలో సాధారణ దృశ్యం. శరీరం మొత్తం గుడ్డ కప్పుకో గలిగిన స్తోమత చాలా తక్కువమందికే ఉన్నది.


పాకిస్తాన్ ఏర్పడడం తథ్యమన్న భావన తలెత్తిన తరువాత హిందూ ముస్లిం సంబంధాలలో వస్తున్న మార్పులను పీవీ అక్షరబద్ధం చేసిన తీరు చరిత్రాత్మకంగా ఉంటుంది. సామాజిక, సాంస్కృతిక అనుబంధంతో పాటు, అక్కడక్కడా ఈ రెండు మతస్థుల మధ్య తొలుత బంధుత్వాన్ని కూడా చూసిన ఆనంద్, కాలక్రమేణా వారు కత్తులు దూసుకోవడాన్ని చూడవలసి వస్తుంది. అటు భారత్ రిపబ్లిక్‌గా అవతరిస్తున్న కాలంలో, ఇటు నవాబు పీడ విరగడవుతున్న కాలంలో చిత్రంగా ఈ రెండు మతాల మధ్య అగాధం పెరిగిపోవడం కూడా ఆనంద్ గమనిస్తాడు. 'ముందు ముందు దేశంలో సామరస్య జీవనాన్ని దారుణంగా దెబ్బతీయబోతున్న వేర్పాటువాదం తొలి సంకేతాలు ఆ మార్పులలో కనిపించాయి'. ఆనంద్ గమనించిన ఆ మార్పులు ఇలా ఉన్నాయి.

భారత్ రిపబ్లిక్ అయినప్పటికీ రాజు ముస్లిం కాబట్టి, రాజ్యంలోని ప్రతి ముస్లిమూ రాచరికంలో భాగం అన్న ఆధిక్య భావన కనిపించింది. ఒకనాడు దసరా, కృష్ణాష్టమి, రెండు మతాల వాళ్లు కలసి చేసుకునేవారు. పీర్ల పండుగను హిందువులూ తమ పండుగ వలెనే గౌరవించేవారు. కొత్త పరిణామంలో 'విగ్రహారాధనపై ఆధారపడి జరిపే హిందువుల పండుగల్లో ముస్లింలు పాలు పంచుకోవడం ఇస్లాం ఒప్పుకోద'ని కొందరు మత గ్రంథాన్ని ఉటంకిస్తూ ఉద్ఘాటించడం ప్రారంభించారు. 'అంతేకాదు, ఉమ్మడి సంప్రదాయాలని కాపాడుకునే సాహసం క్రమంగా వాళ్లలో సన్నగిల్లుతోంది.' ఇది కూడా ఆనంద్ గ్రహించాడు. హిందువుల పండుగలు హిందువులే జరుపుకోవాలని ఓ ముస్లిం పెద్ద ఆదేశించడమూ ఆనంద్ వింటాడు. ఇస్లాంలోని కొన్ని ఆచారాలను చూసి అతడు 'దిగ్భ్రమ' చెందుతాడు కూడా. మతాంతరీకరణలు ఎక్కువయ్యాయి. మల్లికార్జున్ రాత్రికి రాత్రి మహ్మద్‌గా మారిపోతున్నాడు. అంతవరకు లేని దూకుడు ఇలా మతం మారిన వారిలో ఇంకో పరిణామం.

చాపకింద నీరులా ప్రవేశించిన ఈ మార్పులన్నీ, పట్నంలో ఉద్యోగం చేస్తూ సెలవు మీద ఇళ్లకు వస్తున్నవారు తెచ్చినవే. నిజానికి ఇలాంటి మత విభజనకు పల్లెలు దూరంగా ఉన్నాయి. పట్టణాలలో మాత్రం స్ఫుటంగా ఉంది. శిథిలమైన మసీదులు మరమ్మతులకు నోచుకున్నాయి.

చర్యకు ప్రతిచర్య ఉంటుంది. అదే సమయంలో కొన్ని హిందూ సంస్థలు పుట్టుకొచ్చాయి. దూషణ ప్రతిదూషణలు మొదలైనాయి. ప్రతి హిందువుకు ప్రతి ముస్లిం సహజ శత్రువన్న గాఢమైన అభిప్రాయం నెలకొనడం మొదలయింది. ఈ నేపథ్యంలోనే నిజాం



రాజ్యంలోని అధికారుల జులుం విజృంభించింది. ఆఖరికి రహదారి మీద ఎద్దుల బండిని తప్పించడం దగ్గర వచ్చిన చిరు కలహంలో కూడా అధికారులు రాజద్రోహాన్ని చూడడం ప్రారంభించారు. "హిందువులంతా కాంగ్రెస్‌లో చేరిపోయి రాజును కూలద్రోయాలనుకుంటున్నారు'' అంటాడు కోశాధికారి. కేవలం రాజోద్యోగి బండి ముందు పోవడానికి వీలుగా తన ఎద్దుల బండిని తప్పించనందుకే ఆనంద్ రాజద్రోహం ఆరోపణను ఎదుర్కొంటాడు. నవాబు మతానికి చెందిన అధికారుల పొగరు ఇలా ఉంటే, ఆ నవాబు ప్రాపకం పొందిన కొందరు అగ్రకుల హిందువుల ప్రవర్తన కూడా ఆనంద్‌కు జుగుప్స కలిగిస్తుంది. తిరునామాలతో ఆపాదమస్తకం భక్తి తొణికిసలాడుతూ కనిపించే ఓ మేనేజర్‌ను ఆకలితో ఏడుస్తున్న తన పసిబిడ్డకు పాలు పట్టి రావడానికి ఓ తల్లి అనుమతి కోరడం కూడా సహించరాని క్రమశిక్షణా రాహిత్యంగా కనిపిస్తుంది. ఆ స్త్రీ రెండు చెంపలు అదే పనిగా మేనేజర్ వాయించడం ఆనంద్ కంట పడుతుంది. గుక్కపట్టి ఏడుస్తున్న చిరుప్రాణానికి కాస్త సాంత్వన కలిగించి వస్తానని ఆమె కోరడమే పాపమైపోయింది. అధికార మదాన్నీ, మగ దురహంకారాన్నీ జమిలిగా ప్రదర్శిస్తూ, ఆమె పాలిండ్ల మీద వ్యాఖ్యలు చేస్తాడు.

బండికి దారి ఇవ్వడం, చిన్నారికి పాలు ఇవ్వడాన్ని కూడా నిషేధించడం- ఈ రెండు ఘటనలు ఆనంద్‌ను కదిలిస్తాయి. అందుకే అసలు ఈ వ్యవస్థను నేలమట్టం చేయాలని భావించే శక్తులలో ఒకడిని కావాలని నిర్ణయించుకుంటాడు. అఫ్రోజాబాద్ రాజుకు వ్యతిరేకంగా జరుగుతున్న సాయుధ సమరంలో సైనికుడవుతాడు.

వెనుకబాటుతనం, కదలిక తేలేని విద్య, బాల్య వివాహాలు వంటి దురాచారాలున్న వ్యవస్థల మధ్య పెరిగిన అణచివేత మీద తిరుగుబాటు చేయవలసిన అవసరాన్ని గొప్పగా గుర్తించిన తరానికి ఆనంద్ ప్రతీకగా నిలుస్తాడు.

ఇందులో కథా వస్తువు కల్పితం కాదు. సమకాలీన ఘటనల సమాహారం. నిజానికి ఇందులో ఆనంద్ పాత్ర రచయితదే కూడా. ★



గౌ॥ నరేంద్ర మోదీ గారికి
(సెప్టెంబర్ 17)
72వ జన్మదిన శుభాకాంక్షలు...
&
తెలంగాణ విమోచన అమృత మహోత్సవ
(సెప్టెంబర్ 17) శుభాకాంక్షలు...
దేవర కరుణాకర్ గుడిమల్కాపూర్ కార్పొరేటర్ డివిజన్ (71)




గౌ॥ నరేంద్ర మోదీ గారికి
(సెప్టెంబర్ 17)
72వ జన్మదిన శుభాకాంక్షలు...
&
తెలంగాణ విమోచన అమృత మహోత్సవ
(సెప్టెంబర్ 17) శుభాకాంక్షలు...
పుప్పల శ్రీనాథ్
భాజపా భాగ్యనగర్ జిల్లా కార్యదర్శి




ఆదిత్యరెడ్డి
కార్పొరేటర్, కోకాపేట్
గౌ॥ నరేంద్ర మోదీ గారికి
(సెప్టెంబర్ 17)
72వ జన్మదిన శుభాకాంక్షలు...
&
తెలంగాణ విమోచన అమృత మహోత్సవ
(సెప్టెంబర్ 17)
శుభాకాంక్షలు...
టి. సృజన్ కుమార్ రెడ్డి
హైకోర్టు అడ్వకేట్ తెలంగాణ
టి. నర్సింహ్మారెడ్డి, న్యాయవాది
బీజేపీ సీనియర్ నాయకులు, తెలంగాణ



విశ్వకర్మ జయంతి
మరియు
గౌ॥ ప్రధాని నరేంద్రమోదీ గారికి
72వ జన్మదిన
(సెప్టెంబర్ 17)
శుభాకాంక్షలు
తెలంగాణ విమోచన దినోత్సవ
(సెప్టెంబర్ 17)
శుభాకాంక్షలు...
డా॥ కొత్తపల్లి శ్రీనివాస్
భాజపా సిర్పూర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్,
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా







# 'విముక్తి'లో కలాలు.. గళాలు...

హైదరాబాద్ రాజ్యంలో ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, పరిపాలనలో భాగస్వామ్యం లేకపోవడం, రజాకార్ల దాష్టీకం, మాతృభాష పట్ల నిరాదరణ లాంటివి సాయుధ పోరాటానికి దారితీశాయి. తెలంగాణ ప్రాంతానికి నిజాం పాలన నుంచి విముక్తి కోసం జరిగిన ఉద్యమంలో కవులు, రచయితలు కళాకారులు, పాత్రికేయుల పాత్ర విస్మరించరానిది. రచయితలు, కవులు తమ రచనలతో, కళాకారులు కళారూపాల ప్రదర్శనతో ప్రజలను జాగృత పరిచారు. 1921 నుంచి మూడు దశాబ్దాల పాటు సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లేదా రజాకార్ వ్యతిరేకోద్యమాన్ని ప్రతిబింబిస్తూ నవలలు, నాటకాలు, పాటలు, గేయాలు వంటివి వెలువడ్డాయి. వట్టికోట ఆళ్వారు స్వామి 'ప్రజల మనిషి', దాశరథి కృష్ణమాచార్యుల 'అగ్నివీణ', కుందుర్తి ఆంజనేయులు 'తెలంగాణ', ఆరుద్ర 'త్వమేవాహమ్', సుంకర- వాసిరెడ్డి 'మా భూమి, పోతుగడ్డ' వంటివి రూపొందాయి. ఈ ఉద్యమంలో అనేక మంది ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడారు. ఆర్థికంగా, హార్దికంగా చితికిపోయారు. అయినా కలాలనే ఆయుధాలుగా చేసుకున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మాదిరిగానే ఈ ఉద్యమంలోనూ పత్రికలు తమ వంతు పాత్ర పోషించాయి. గోల్కొండ, రయ్యత్, ఇమ్రోజ్, హితబోధ, తెనుగు.. వంటి పత్రికలు నిజాం దురాగతాలను ప్రచురించి కడగండ్ల పాలయ్యాయి. హైదరాబాద్ రాజ్య ఏడవ, చివరి నిజాంగా మహబూబ్ అలీ పెద్ద కుమారుడు ఉస్మాన్ అలీఖాన్ తన పాలనలో (1911-1948) కొన్ని సంస్కరణలు తెచ్చినా, ఆయన నియంత పోకడలు ప్రజా జీవితాన్ని కష్టాల్లోకి నెట్టాయి. 'నేనే దేవుణ్ణి. నేనెవరికీ తలవంచను' అని ప్రచారం చేసుకున్న ఆయన తీరుపై వివిధ వర్గాలు అవిశ్రాంతంగా పోరాడాయి. అంతిమంగా ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు విమానాశ్రయంలో తలవంచి నమస్కరించి స్వాగతం పలికే స్థాయికి తీసుకొచ్చాయి.


'తెలంగాణ విమోచనంలో, సాంస్కృతిక వికాసంలో గ్రంథాలయ ఉద్యమంతో పాటు పత్రికా రంగం దోహదం చేసింది. ఈ ప్రాంతంలో 'నీలగిరి'ని తొలి (1922) రాజకీయ పత్రికగా పరిగణిస్తారు. షబ్నవీసు వెంకట రామనరసింహారావు, ఆంధ్ర జనసంఘం ప్రోత్సాహంతో ఈ పత్రిక ప్రారంభ మైంది. బూర్గుల రామకృష్ణారావు, మాడపాటి హనుమంతరావు లాంటి ఉద్దండులు దీనికి వ్యాసాలు అందించారు.

వరంగల్ జిల్లా ఇనగుర్తికి చెందిన ఒద్దిరాజు సోదరులు రాఘవరావు, సీతారామచంద్రరావు సంపాదకత్వంలో 'తెనుగు' (1926)పత్రిక ప్రారంభమైంది. తెలుగు మాటను పలికేందుకే భయ పడిన కాలంలో ఆ పేరుతో పత్రిక రావడమంటేనే సాహసమే. చాలా పత్రికలలానే ఇదీ ఆర్థిక ఇబ్బందుల పాలై, మూతపడింది. వనపర్తి, గద్వాలలో ప్రచురణ సంస్థలు అవతరించాయి. సంఖ్యాపరంగానూ, ఆర్థికంగా అంతంత మాత్రమే బలం ఉన్నా నిజాం అరాచక పాలనపైనా, రజాకార్లకు వ్యతిరేకంగా వార్తలు రాయడంలో వెనుకంజ వేయలేదు. రజాకార్ల దాష్టీకాలను ప్రచురించినందుకు గోలుకొండ, రయ్యత్, ఇమ్రోజ్, తెనుగు లాంటి పత్రికలు వేధింపులపాలయ్యాయి.


సురవరం ప్రతాపరెడ్డి, దాశరథి కృష్ణమాచార్యులు, వట్టికోట ఆళ్వారు స్వామి, బూర్గుల రామకృష్ణారావు, ఒద్దిరాజు సోదరులు, మాడపాటి హనుమంతరావు, గడియారం రామకృష్ణశర్మ, వానమామలై వరదాచార్యులు, జగన్నాథాచార్యులు, దేవులపల్లి రామానుజరావు, ముడుంబై గోవిందాచార్యులు, కాళోజీ, బిరుదురాజు రామరాజు, భండారు సదాశివరావు, రావి నారాయణరెడ్డి, బీఎన్ శాస్త్రి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, పాశం నారాయణ రెడ్డి, మరింగంటి కవులు, గార్లపాటి రాఘవరెడ్డి, చెర్విరాల చాగయ్య, చందాల కేశవదాసు, ఆదిపూడి ప్రభాకర కవి, పొట్లూరి రామారావు, కుందుర్తి ఆంజనేయులు, పేర్వారం జగన్నాథం... ఇలా కవిపండితులు, పాత్రికేయులు కలాలు, గళాలతో తెలంగాణ విమోచన పోరును ఉరకలెత్తించారు. నాటి కల్లోల తెలంగాణపై పదిహేను వరకు నవలలు వచ్చాయి. ఒక ఉద్యమంపై ఇన్ని నవలలు రావడం తెలుగు సాహిత్యంలో అదే మొదటిసారని విశ్లేషకులు చెబుతారు. ఇక పాటలు, గేయాల సంగతి సరేసరి. ఆయా అక్షరయోధుల గురించి విహంగవీక్షణంగా మననం చేసుకుంటే....

**'రయ్యత్' మందముల**


ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చేవేళ్లకు చెందిన మందముల నర్సింగరావు తెలంగాణ విమోచన ఉద్యమంలో పాల్గొనేందుకు న్యాయవాద వృత్తిని వదులుకున్నారు. స్వీయ సంపాదకత్వంలో 'రయ్యత్' అనే ఉర్దూ పత్రికను (1927) ప్రారంభించారు. 'రయ్యత్' అంటే రైతాంగం. తెలంగాణ ఉద్యమానికి మూలకందం రైతు. సంస్థానాధీశులు, జాగీర్దార్లు అత్యంత అధునిక సౌకర్యాలతో అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్-సికింద్రాబాద్ జంటనగరాలలో విలాస జీవితాలు గడుపుతుండగా, కనీసం నీటి వసతి లేని మారుమూల, కుగ్రామాలలో చెమటోడ్చి సేద్యం చేసి, సిరులు నింపుతూ తాను మాత్రం నిరుపేదగానే మిగిలినవాడు రైతు. వారితో పాటు ప్రజా సమస్యలను, ప్రజానీకం అభిప్రాయాలను చాటడమే తన పత్రిక ధ్యేయమని మందముల ప్రకటించారు. లక్ష్యం మంచిదే అయినా, పత్రికను తెలుగులో బదులు ఉర్దూలో నడపమేమిటనే సందేహాలు వ్యక్తం అయ్యాయి. 'నాకు తెలుగు భాష అంతగా రాదు. ఉర్దూ రాజభాష. కనుక ఆ భాష ద్వారానే దేశ సేవ చేయాలనుకున్నాను' అని సమాధానమిచ్చారు. కానీ తెలుగు తెలిసిన వారి సహాయంతో పత్రికను నిర్వహించవచ్చు. అయితే 'పత్రికలో వచ్చే సమాచారాన్ని, సందేశాలను పాలకులు, పాలితులు తెలుసుకోవాలి. వారందరికి అర్థమయ్యే భాషలో (ఉర్దూ) పత్రికను తెస్తేనే సమస్యలు పాలకుల దాకా వెళతాయి' అన్నది అసలైన మరో కారణం. నిజాం నిరంకుశ పాలనను, రజాకార్ల హింసాకాండ చర్యలను తిప్పికొడుతూ అనేక సంపాదకీయాలు రాశారు. అత్యంత ప్రతికూల పరిస్థితులలోనూ కలం పక్కన పెట్టలేదు. ఎలాంటి పరిణామాలు ఎదురైనా స్వతంత్ర భావాలను వ్యక్తం చేసేదిగా ఆ పత్రికకు పేరుండేది. దాంతో నిజాం ప్రభుత్వం ఆయనపై నిఘాపెట్టి అరెస్టు చేయించింది. ముషీరాబాద్




షోయబుల్లాఖాన్



సురవరం ప్రతాపరెడ్డి



దాశరథి కృష్ణమాచార్యులు



జైలులో నిర్బంధించిన తరువాత, నిజాం నవాబే దిగివచ్చి ఆయనను విడుదల చేయడంతో పాటు మంత్రి పదవి ఇవ్వజూపారు. అప్పటికే (1938–42) నిజాం లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉన్న మందుముల ఆ ప్రతిపాదనను తిరస్కరించి, నిజాంపై వ్యతిరేక పోరాటాన్ని ముమ్మరం చేశారు. ఫలితంగా పత్రిక నిజాం ఆగ్రహానికి బలై, మూతపడింది.

**'గోలకొండ' సురవరం**

నిజాం పాలనలో తెలుగుజాతిని తట్టిలేపిన వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. తెలంగాణలో నిద్రాణమై ఉన్న భావ, భాషా సాహిత్య చైతన్యాలకు బావుటాను ఎత్తిన వారిలో ముందు వరుసలో ఉండే ఆయన, నాటి నిరంకుశ పాలనపై కలం ఝుళిపించారు. ముట్నూరి కృష్ణారావు, కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ఆధ్వర్యంలోని కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక ప్రజలలో రాజకీయ సాంస్కృతిక చైతన్యం కలిగించినట్లే, సురవరం నేతృత్వంలోని 'గోలుకొండ' పత్రిక నిజాం రాష్ట్ర ఆంధ్రులను వివిధ రంగాలలో జాగృత పరచిందని విశ్లేషకులు చెబుతారు. 'గోలుకొండ' పత్రికలో సురవరం వెలువరించిన సంపాదకీయాలు నిజాం ప్రభుత్వ గుండెలలో కుంపట్లు రాజేసేవని చెప్పుకుంటారు. దాంతో ఆయన సంపాదకీయాలపై ప్రభుత్వం 'ప్రీ సెన్సార్‌షిప్' విధించడంతో అది పత్రిక ఆత్మ గౌరవానికి భంగకరంగా భావించి సంపాదకీయం నిలిపివేశారు. అయితే వివిధ రంగాలలో నిష్ణాతులతో సందర్భోచితంగా స్ఫూర్తిదాయక వ్యాసాలు రాయించి సంపాదకీయం చోటులో ప్రచురించారు. అవి ఆయన సంపాదకీయాల కంటే పదునుగా ఉండి ఏలికలను మరింత చికాకు పరిచేవట. 1926 మే 10న ప్రారంభమైన పత్రికకు చాలా ఏళ్ల వరకు సంపాదకుడిగా ఆయన పేరు లేకపోయినా పరోక్షంగా అన్ని బాధ్యతలూ ఆయనే చూశారు. పదమూడేళ్ల తరువాత (1939) సంపాదకత్వ బాధ్యతలు చేపట్టి 1947 వరకు ఆ పదవిలో కొనసాగారు. 1922లో ప్రారంభమైన నిజాం రాష్ట్రాంధ్ర జనసంఘం మరో ఎనిమిదేళ్లకు (1930) ఆంధ్రసభగా రూపాంతరం చెందిన వెంటనే జోగిపేటలో జరిగిన దాని ప్రథమ సమావేశానికి సురవరం అధ్యక్షత వహించారు.




# మొనగాడు మొగిలయ్య

వరంగల్ కోటలో మొగిలయ్య ఆయన సోదరుడు రామస్వామి సాహసోపేతమైన యువకులు. వీరు తమ కులవృత్తి చేసుకునేవారు. స్థానిక యువకులతో కలసి వ్యాయామం చేసేవారు. టి.హయగ్రీవాచారి, కాళోజి నారాయణరావుల ప్రబోధంవల్ల వీరికి దేశం మీద భక్తిభావం కుదిరింది. దేశం కోసం ఎట్టి త్యాగానికైనా సిద్ధం కావాలనే పట్టుదల కుదిరింది. స్థానిక యువకులతో ఒక స్వచ్ఛంద సేవకుల దళాన్ని గూడా ఏర్పాటు చేసుకున్నారు. ఇంతలో భారతదేశానికి స్వతంత్రం వచ్చింది. స్టేట్ కాంగ్రెస్ ఆదేశానుసారం ఆగస్ట్ 15, 1947 నాడు జెండా వందనం చేయాలని నిశ్చయించుకున్నారు.

జెండా ఆవిష్కరణ వార్త రజాకార్లకు తెలిసింది. అయితే మొగిలయ్యను ఎదురుబడి కొట్టడం కష్టం. ఎదురైన పదుగురిని హతమార్చిగాని అతను చావడు. అందుకని లక్డి 'పహల్వాన్ అని పిలిచే ఖాసిం షరీఫ్ 40,50 రజాకార్లను వెంటబెట్టుకుని వెనుక నుండి వచ్చి దాడిచేసినారు. వీరులు ఎదురుగా వచ్చి తలపడతారు. పిరికిపందలు దొంగచాటుగా దాడిసల్పుతారు.

బ్రిటిష్ పాలన అంతమైంది. ఇక నిజాం రాచరికాన్ని అంతం చేసి, ప్రజాస్వామ్యం నెలకొల్పుతామని సంబరపడుతూ మొగిలయ్య సోదరులు జెండా వందనానికి సిద్ధమవుతున్నారు. వందల జనం గుమిగూడారు. భారతమాతకి జై, మహాత్మాగాంధీకి జై, స్టేట్ కాంగ్రెసు జిందాబాద్ అనే నినాదాలు మిన్నుముట్టగా మొగిలయ్య జాతీయ పతాకాన్ని ఎగురవేసినారు. జెండాకు కట్టిన తాడును బిగించటానికి



వీర మొగిలయ్య వంగినారు. వెనుక నుండి వచ్చి లక్డి పహల్వాన్ బల్లెం తీసుకొని జండా తాడు బిగించటానికి వంగిన మొగిలయ్య మెడమీద బలంగా పోటు పొడిచినాడు. అంతే జయ్ భారతమాతా అంటూ నేలకూలినాడు. వీరుడైన మొగలయ్యపై జరిగిన దురంతం క్షణాలమీద పట్టణమంతా పాకిపోయింది. యువకుల హృదయాలలో దాగిన రౌద్రం విజృంభించింది. 'రజాకార్ల రాక్షసత్వాన్ని అంతం చేస్తాం' అని శపథం పూనినారు.

('హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర' నుంచి)






నిజాం పాలనలో నిరాదరణలో ఉన్న తెలుగుతో కూడిన విద్యాబోధన, రైతుల స్థితిగతులు మెరుగు పరచడం ఈ సభ ప్రధాన ఉద్దేశం. ఈ సభ స్ఫూర్తితో భూస్వామ్య వ్యతిరేక, నిజాం ప్రభుత్వ వ్యతిరేక సాయుధ పోరాటం ఊపందుకున్నాయి. 'చదువు, అక్షర జ్ఞానంతోనే ప్రజాచైతన్యం సాధ్యమంటూ గ్రంథాలయోద్యమాన్ని నడిపిన సారథులలో ఆయన ముఖ్యులు.

**'ఇమ్రోజ్' షోయాబుల్లాఖాన్...**


రచయిత, మంచి కలం యోధుడు. కాని రావలసినంత పేరు రాలేదని అంటారు. 'తేజ్' పత్రికతో పాత్రికేయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన మందుముల నర్సింగరావు నిర్వహించిన 'రయ్యత్' పత్రికలో ఉప సంపాదకుడిగా పని చేశారు. ప్రభుత్వ దమననీతిని, పాక్షిక వైఖరిని విమర్శించినందుకు నిజాం దానిని మూసి వేయించిన తరువాత షోయాబ్ సొంతంగా 'ఇమ్రోజ్' (ఈరోజు) పత్రిక స్థాపించారు. నిజాం అరాచకాలను నిరసిస్తూ, నిజాం రాజ్యాన్ని భారత్‌లో విలీనం చేయాలని ఏడుగురు ముస్లిం పెద్దలు రూపొందించిన ప్రతిపాదనను షోయాబ్ ప్రచురించారు. హైదరాబాద్ సంస్థానంలోని ప్రజాభీష్టం మేరకు వెంటనే భారత యూనియన్‌లో విలీనం కావాలంటూ సహేతుకంగా వాదిస్తూ సంపాదకీయాలు రాశారు. అలా కాకపోతే అది ఆత్మహత్యా సదృశమేనని నిజాం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రజాకార్ల దౌర్జన్యాలను బట్టబయలు చేస్తూ, సయ్యద్ కాసీం రజ్వీ విధానాలను, ఉపన్యాసాలను, యుక్తియుక్తంగానే ఖండించే వారు. అది సహజంగానే పాలకులకు కంటకప్రాయమైంది. దరిమిలా బెదిరింపు లేఖ వచ్చింది. ఈ తరహా వార్తలు వేస్తే చేతులు నరికేస్తామని 1948 ఆగస్ట్ 19న హెచ్చరించిన రజాకార్లు మూడవ నాడు (21న) కాచిగూడ చౌరస్తాలో అన్నంత పని చేశారు. ఆ మరునాడు ఆయన కన్నుమూశారు. అంతకు ముందు తనను చూడవచ్చిన బూర్గుల రామకృష్ణారావుతో 'నేను గాంధీజీ అడుగుజాడల్లో నడిచే అహింసావాదిని. ఒకవేళ దేశం కోసం, సత్యం కోసం ప్రాణాలు ఇవ్వవలసి వస్తే అందుకు ఎంతో గర్విస్తాను' అని చెప్పారట. అన్నట్లుగానే నియంత పాలనపై 'అక్షరాన్ని ఆయుధాలుగా చేసుకున్న ఆయన కత్తి'కి బలయ్యారు.

**'మిజాన్' బాపిరాజు**

నిజాం నవాబు ప్రోత్సాహంతో నిర్వహించిన 'మిజాన్' తెలుగు పత్రికకు ప్రముఖ రచయిత, చిత్రకారుడు అడవి బాపిరాజు సంపాదకత్వం వహించారు. తన ఆశయసిద్ధికి స్వతంత్రంగా పత్రిక అవసరమని భావించిన నిజాం నవాబు ఆంగ్లం, హిందీ, తెలుగు భాషలలో పత్రిక ప్రారంభించాలనుకున్నారు. గులాం అల్లాద్దీన్ అనే వాణిజ్యవేత్త సహకారంతో బొంబాయికి నుంచి కలకత్తా వాలా అనే వ్యక్తిని రప్పించి పత్రికను (1943)పెట్టించారు. తెలుగు పత్రికకు కాకినాడకు చెందిన మహ్మద్ ఖాసిం సంపాదకుడిగా ఉండేందుకు ముందుకు వచ్చినా, తెలుగు పాఠకులను లక్ష్యంగా చేసుకున్న నవాబు, వారిని ఆకట్టుకునేందుకు ఆయనను కాదని బాపిరాజును ఎంపిక చేశారు. ఆయన ఆంధ్రప్రాంతం వ్యక్తి కనుక, తెలంగాణలో పరిణామాల పట్ల సరైన అవగాహన ఉండదని, పైగా ఆయన ద్వారా ప్రజలతో మంచి సంబంధాలు నెలకొల్పుకోవచ్చని నిజాం సలహాదారులు భావించారట. కానీ సంపాదక మండలి విషయంలో నిజాం ఇచ్చిన స్వేచ్ఛతో బాపిరాజు తనకు నచ్చిన, ఇష్టమైన వారిని నియమించుకున్నారు. నిజాం ఆదేశాలకు అనుగుణంగా వార్తలతో పాటు వ్యతిరేకంగానూ వచ్చేవి. 'నిజాం నవాబు తన రాజ్యంలో కమ్యూనిస్ట్ దినపత్రికను నిషేధించినా, ఆంధ్రమహాసభ వార్తలు మిజాన్‌లో వస్తూనే ఉండేవి.

**'ప్రజల మనిషి' వట్టికోట**

స్వయంకృషితో వంటబట్టించుకున్న విజ్ఞానం తప్ప పెద్దగా చదువుకోని వట్టికోట ఆళ్వారు స్వామి అటు స్వాతంత్ర్య ఉద్యమంతో (క్విట్ ఇండియా) పాటు అనంతరం తెలంగాణ విమోచన ఉద్యమంలో పాలు పంచుకున్న తెలంగాణ ప్రాంత తొలి నవలా రచయిత. సాహిత్యంలో తొలిసారిగా ప్రజా భాషతో వెలువడిన ఆయన 'ప్రజల మనిషి' నవల తెలంగాణ విమోచన ఉద్యమాన్ని రగిల్చింది. తెలంగాణ రైతాంగ




పోరాటం సాయుధ పోరాటంగా మారడానికి ఆయన రచనలే కారణమని చెబుతారు. మరో నవల 'గంగు' తెలంగాణ మహత్తర రాజకీయ ప్రజా ఉద్యమ చరిత్రకు అక్షర రూపంగా చెబుతారు. అగ్నికి గాలి తోడైనట్లుగా నిజామాబాద్ జైలులో దాశరథి పరిచయంతో రెట్టింపు ఉత్సాహంతో పనిచేశారు. అక్కడి జైలు గోడలపై దాశరథి బొగ్గుతో రాసిన 'ఓ నిజాము పిశాచమా....' పద్యం అంటే ఎంతో ఇష్టం. అది తనకు మరింత స్ఫూర్తినిచ్చిందని చెప్పేవారట. జైలు అధికారులు గోడపై పద్యాన్ని చెరుపుతున్న కొద్దీ తిరిగి రాసేవారు. ఆ 'జంట' తిరుగుబాటు అధికారులకు కంటగింపైంది. ఫలితంగా వట్టికోటను గుల్బర్గా, దాశరథిని హైదరాబాద్ జైళ్లకు తరలించారు. **'ఆశ్రయింపు లెరుగనివాడు/ విశ్రాంతి తెలియనివాడు/స్వసుఖం కోరనివాడు/ వారం వారం మారనివాడు/రంగులద్దు కోలేనివాడు/మిత్రుడి కోసం కంఠం ఇవ్వగలడు/మంచికి పర్యాయపదం ఆళ్వార్/ అదినిదే సార్థకమైన జీవితం/అతనికే అగ్నిధార అంకితం'** అంటూ తన తొలిరచన, తెలంగాణ పోరాటకావ్యం 'అగ్నిధార'ను దాశరథి ప్రియమిత్రుడికి అంకితమిచ్చారు. వట్టికోట పత్రికా రచయిత కూడా. కడవెండిలో జరిగిన దొడ్డి కొమరయ్య హత్యోదంతాన్ని 'మీజాన్' పత్రిక ద్వారా వెలుగులోకి తెచ్చారు. నిజాం ఏలుబడిలోని జైళ్లలోని దుర్భర పరిస్థితులు, ఖైదీల మనోభావాలను విశ్లేషిస్తూ 'జైలు లోపల' గ్రంథం రాశారు. 'నిద్రాణమై ఉన్న తెలంగాణ మేలుకుంది. వట్టికోట, దాశరథి, కాళోజీ గొంతెత్తి ఆ నూతన జాగృతిని ప్రతిధ్వనింప చేశారు. తెలంగాణకు చెందిన వారు యావదాంధ్ర కవులు' అని శ్రీశ్రీ అభివర్ణించారు.

**'రతనాలవీణ' దాశరథి**

'నా తెలంగాణ కోటి రతనాల వీణ' పద్య పాదంతో మాతృభూమికి ఎనలేని ప్రాధాన్యం, గుర్తింపును తెచ్చిన కవిపండితుడు దాశరథి కృష్ణమాచార్యులు. తెలంగాణ విమోచన పోరు సందర్భంగా ఆయన అన్న ఈ మాటలు అనంతరం ప్రత్యేక రాష్ట్ర తొలి, మలి ఉద్యమానికి తారక మంత్రంగా నిలిచాయి. ఆ మాటలను ఏదో ఒక సందర్భంలో ఉటంకించని తెలంగాణ బిడ్డడు ఉండడనడం అతిశయోక్తి కాదు. ఆయన దృష్టిలో



వట్టికోట ఆళ్వారుస్వామి



జమలాపురం కేశవరావు




మందుముల నర్సింగరావు




సంసారం కంటే సమాజమే మిన్న. నిజాం విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూ విలువైన జీవితాన్ని, జీవనాన్ని త్యాగం చేశారు. పదిహేనవ ఏటనే (1940) నల్లగొండకు చెందిన రామానుజమ్మను వివాహ మాడిన ఆయన తాను నమ్మిన సిద్ధాంతం కోసం నిజాం పాలనపై ఉద్యమించి జైలుకు వెళ్లారు. ఒకవైపు ఉద్యమం, జైలు జీవితం, మరోవంక అనారోగ్యం. జైలులో కల్తీ, కలుషిత ఆహారం వల్ల ఆరోగ్యం బాగా దెబ్బతింది. శిక్ష ముగిసి ఇంటికి చేరే సరికి అనారోగ్యంతో భార్య కన్ను మూశారు. అటు తరువాత లక్ష్మీదేవమ్మను వివాహమాడారు.

**'ఓ పరాధీన మానవా, ఓపరాని/దాస్యము విదల్చలేని శాంతమ్ము మాని/తలుపులను ముష్టి బంధాన కలచివైచి/చొచ్చుకొని పొమ్ము, స్వాతంత్ర్యం సురపురమ్ము'** అని చెప్పిన పద్యానికి 'సింహగర్జన చేశావు నాయనా'! అని తెలంగాణ వైతాళిక ప్రముఖుడు సురవరం ప్రతాపరెడ్డి అభినందించారు. **'చీకటిలో దివ్వె అతడు/ఆకసమున అరునుడతడు/మూగబడిన తెలంగాణా మూల్గిన తొలినాటి ధ్వని'** అనీ అభివర్ణించారు.

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినప్పటికీ నిజాం తనను తాను స్వతంత్రుడిగానే ప్రకటించుకున్నారు. తన రాష్ట్రంలో జాతీయ పతాకం ఎగరడానికి వీలులేదని 'ఫర్మానా' జారీ చేయడంతో, గుండె రగిలిన దాశరథి అజ్ఞాతం వీడి 'ముసలి నక్కకు రాచరికంబు దక్కునే? అని నిజాంను నేరుగా నిలదీశారు. కుగ్రామాలు, తండాలు తిరుగాడి నిజాం దమననీతికి వ్యతిరేకంగా కులమత లింగ వర్గ వర్ణ భేదాలకు అతీతంగా ప్రజలను ఏకం చేశారు. నిరంకుశ పాలనపై ఆగ్రహం కట్టలు తెంచుకుని కవితా 'అగ్నిధార' కురిపించిన ఆయనను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు ఈడ్చుకు వెళ్లారు. అయినా మొండి ధైర్యంతో తప్పించుకు వెళ్లారు. తర్వాత మరోసారి పట్టుబడగా 1947 సెప్టెంబర్‌లో 16 నెలల జైలుశిక్ష విధించి నిజామాబాద్ చెరసాలకు తరలించింది నాటి ప్రభుత్వం. అక్కడ అగ్రజ సమానులు, కవి వట్టికోట ఆళ్వార్‌స్వామితో కలసి ఉద్యమ కవితా వ్యాసంగం సాగించారు. కవిత్వాన్ని కాలక్షేపం కోసం కాకుండా ఉద్యమానికి, సామాజిక వికాసానికి సాధనంగా ఉపయోగించుకోవాలన్న ఆయన....




డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

**'ఓ నిజాము పిశాచమా! కానరాదు...**
**నిను బోలిన రాజు మాకెన్నడేని**
**తీగెలను తెంపి అగ్నిలో దింపినావు**
**నా తెలంగాణ కోటి రతనాల వీణ'** ....అని జైలు గోడమీద బొగ్గుతో రాసి నిర్భయంగా గానం చేశారు. 'మధ్యయుగాల రాచరిక జులుమే నా కవితకు ప్రేరణ. నిజాం తాబేదార్ల హింసాకాండ పెచ్చు పెరిగింది. ఎటు చూచినా దోపిడీలు, గృహ దహనాలు, మానభంగాలు. నా హృదయం స్పందిం చింది. చైతన్యం పెల్లుబికింది' అని ఒక ముఖా ముఖీలో చెప్పారు దాశరథి. నిజాంకు వ్యతిరేకంగా రాసిన గేయాలు దాశరథిని మానసికంగా, శారీరకంగా 'గాయ' పరిచాయి. రక్తం ఓడేలా హింసించాయి. అయినా వెరవలేదు, బెదరలేదు. తన లక్ష్యాల్లో ప్రధానమైన తెలంగాణ విముక్తి సిద్ధించడంతో తన 'రుద్రవీణ' కవితా సంపుటిని తెలంగాణకు అంకితమిచ్చి 'మాతృభూమి' రుణం తీర్చుకున్నట్లు భావించారు.

**మడమతిప్పని 'సర్దార్'**


పక్షపాత, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అత్యంత ధైర్యసాహసాలతో ప్రజాఉద్యమాన్ని నడిపిన మేటి నేత జమలాపురం కేశవరావు. నిజాం పాలకులకు వ్యతిరేకంగా మాట్లాడడం, విమర్శించడమంటే మృత్యుముఖంలో తలపెట్టడమే అనే పరిస్థితులలోనూ, సామాన్యులపై జరుగుతున్న అత్యాచారాలను బహిరంగంగానే విమర్శించారు. జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడారు. అవినీతి అధికారులకు ఆయన సింహస్వప్నం. నిస్వార్థబుద్ధి, శాంతి సహనాలు, అతి అతినిరాడంబరతలే ఆయనకు ఆభరణాలని చెబుతారు. అందుకే నిరంకుశ, అవినీతి అధికారులు ఆయనను మాటలతో కూడా ప్రతిఘటించలేక పోయేవారట. 'నిరంకుశ పాలన అంతం–ప్రజారాజ్యం ఆవిర్భావం' నినాదంతో జనాన్ని జాగృత పరిచేందుకు బుర్రకథ, హరికథ, నాటకాల దళాలు ఏర్పాటు చేశారు. వయోజన పాఠశాలలు, గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్కసారి ప్రయాణించేందుకు బస్సు కిరాయికి డబ్బులేని ఆయన, ఇలాంటి కార్యక్రమాలు చేపట్టారంటే, ఆయనకున్న ప్రజాదరణే కారణంగా చెబుతారు. నిజాం నిరంకుశ పాలనను అంతమొందించి బాధ్యతాయుత ప్రభుత్వాన్ని స్థాపించగలమని పిడికిలెత్తి నినదించినందుకే తెలంగాణ గొంతులు ప్రేమాభిమానాలతో 'సర్దార్' అని అభివర్ణించాయి. అదే ఏలికలకు కన్నెర్రయింది. మధిరలో సత్యాగ్రహం చేస్తున్న ఆయనను నిర్బంధించి రెండేళ్లు కఠిన జైలు శిక్ష వేశారు. ఆయన ప్రజాభిమానం పటిమ వల్లే కావచ్చు ఆరు నెలలలోనే ఆయన విడుదలయ్యారు. అయితే ఆ ఆరునెలలూ జైలు అధికారులు అనేక రకాలుగా బాధించినా లొంగలేదు. 'నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడాన్ని నేను నేరంగా భావించడంలేదు. తిరుగుబాటు చేయనివాడు పిరికిపంద' అని నిండు న్యాయస్థానంలో ధైర్యంగా వ్యాఖ్యానించారని ఆయన అభిమానులు శ్లాఘిస్తుంటారు.




**'గళ' యోధుడు సుద్దాల**

రెండవ తరగతితోనే చదువు ఆపేసిన సుద్దాల హనుమంతు హైదరాబాద్ సంస్థాన విమోచన ఉద్యమంలో గొంతెత్తారు. నైజాం సంస్థ పాలనపట్ల విముఖతతో పోరాడుతున్న ఆర్యసమాజం వైపు ఆకర్షితులై బలవంతపు మత మార్పిళ్లను వ్యతిరేకించే సామాజిక గీతాలు రాశారు. వ్యవసాయ శాఖలో ఉద్యోగిగా ఉంటూ ఉద్యమ కార్యక్రమాలలో పాల్గొనడం, ఆర్య సమాజంతో సంబంధాల పట్ల నిఘా విభాగం అందించిన నివేదిక ఆధారంగా అధికారులు మందలించడంతో, ఉద్యోగ యూనిఫాంను వదలి వచ్చేశారు. నిజాం ప్రతినిధులు (ఏజెంట్లు)గా భూస్వాములు, దొరల దోపిడీ దౌర్జన్యాలతో తల్లడిల్లుతోన్న పల్లెలలో తిరుగుతూ ప్రజలలో పోరాటపటిమను నింపి తిరుగుబాటు ఉద్యమాన్ని రగిల్చాలని అక్కడ స్థిరపడ్డారు. బుర్రకథ, గొల్లసుద్దులు, పిట్టలదొర, ఫకీరు వేషాల ప్రక్రియల ద్వారా పోరాటాలను సమాయత్తపరచే సాహిత్యాన్ని సృష్టించారు. 'తెలంగాణ సాయుధ పోరాటం, అమరవీరులకు జోహార్లు' అనే గొల్లసుద్దులను ఎన్నో రాశారు. ★



# అలజడికి బీజం ఆర్య సమాజం

**ఏ దేశం/రాష్ట్రంలోనైనా విముక్తి ఉద్యమాల్లో రాజకీయ సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయి. ఒక మత, సామాజిక సంస్థ విముక్తి ఉద్యమంలో పాల్గొనడం చాలా అరుదు. పూర్వపు హైదరాబాద్ స్టేట్ విముక్తి పోరాటంలో కీలక పాత్ర పోషించిన అటువంటి సంస్థే ఆర్యసమాజ్. ఇందుకు ఈ ప్రాంతంలో నెలకొన్న కొన్ని ప్రత్యేక పరిస్థితులు దోహదం చేశాయి. దీన్ని స్వామి దయానంద సరస్వతి 1875లో స్థాపించారు. హిందూ సమాజంలో నెలకొన్న అంధవిశ్వాసాలను, కులవ్యవస్థను తొలగించి, సంస్కరించడమే దీని స్థాపన ప్రధాన లక్ష్యం. తన ప్రఖ్యాత రచన 'సత్య ప్రకాష్'లో ఆయన అభిప్రాయాలను స్పష్టంగా వివరించారు. ఆయన ప్రారంభించిన 'శుద్ధి ఉద్యమం' అప్పటి సమాజంలో ఎంతో ప్రాచుర్యం పొందింది. భారత్‌కు వేదసంప్రదాయాన్ని అనుసరించడమే ఉత్తమ మార్గమని ప్రచారం చేశారు. 1883లో ఆయన మరణించిన తర్వాత మహాత్మ హంసరాజ్, గురుదత్త విద్యార్థి, లాలా లజపతి రాయ్, మున్షిరామ్ తదితరులు మరింత ముందుకు తీసుకెళ్లారు.**



ఇక నాటి హైదరాబాద్ సంస్థానం విషయానికి వస్తే ఇందులో మూడు భాషా ప్రాంతాలుండేవి. తమ ప్రాంతాల్లోని ప్రజల స్థితిగతులను మెరుగు పరచేందుకు ఈ మూడు ప్రాంతాల్లో ఆంధ్రపరిషత్ (1921), కన్నడ పరిషత్ (1934), మహారాష్ట్ర పరిషత్ (1937)లు కృషిచేశాయి. ముఖ్యంగా నాటి ప్రభుత్వపు ఒంటెత్తు పోకడలను నిలువరించి అందరికీ సమాన న్యాయం, అభివృద్ధిని కోరుతూ ఒత్తిడి తీసుకొచ్చాయి.

### ఉద్యమానికి ఊపునిచ్చిన సరోజినీ నాయుడు ప్రసంగం

తొలినాళ్లలో ఆర్యసమాజ్ ప్రభావం నాటి హైదరాబాద్ స్టేట్‌లోని కర్ణాటక ప్రాంతంలో ఎక్కువగా ఉండేది. తర్వాతి స్థానాల్లో వరుసగా మహారాష్ట్ర, తెలంగాణ ఉండేవి. కానీ ఉద్యమం తీవ్రమయ్యే కొద్దీ మూడు ప్రాంతాల్లో ఆర్యసమాజ్




ప్రభావం బలీయ స్థితికి చేరుకొని హైదరాబాద్ విముక్తికి దోహదం చేసింది. నిజానికి 1938లో సరోజినీ నాయుడు ఉస్మానియా యూనివర్సిటీలో ఇచ్చిన ఉద్వేగపూరిత ప్రసంగంతో హైదరాబాద్ విముక్తి ఉద్యమానికి ఒక ఊపు వచ్చిందని చెప్పాలి. అప్పుడే ఆర్యసమాజ్ నేత స్వామి రామానంద తీర్థ నేతృత్వంలో హైదరాబాద్ స్టేట్ విముక్తి ఉద్యమం పతాకస్థాయికి చేరుకుంది. హైదరాబాద్ విముక్తి పోరాటంలో కీలక పాత్ర పోషించిన స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలో ఉద్యమం ఏకతాటిపై నడిచింది. ఆయన నేతృత్వంలో చేపట్టిన నిజాం వ్యతిరేక ఉద్యమం చివరకు 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావడానికి దోహదం చేసింది.

నిజాం సంస్థానంలో నిర్వహించిన విమోచన ఉద్యమాల చరిత్రలో ఆర్యసమాజ్ పాత్ర చిరస్మరణీయం. కులవ్యవస్థ నిర్మూలనకు పోరాడిన ఆర్యసమాజ్ ప్రభావం నేటి హిందూ సమాజంపై ఎంతో ఉందనడం అతిశయోక్తి కాదు. ఏది ఏమైనా పూర్వపు నిజాం సంస్థానాన్ని జాతీయవాద ప్రధాన స్రవంతిలోకి మొదటగా తీసుకెళ్లింది ఆర్యసమాజ్ మాత్రమే. నిజాం నవాబు మతఛాందస విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐకమత్యంతో ఎదురు నిలవడానికి ఆర్యసమాజ్ ఎంతో దోహదం చేసింది. నైజాం రాష్ట్రంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తొలి నిరసన కార్యక్రమం చేపట్టింది కూడా ఆర్యసమాజ్ మాత్రమే. ఆర్యసమాజ్‌కు చెందిన రాజకీయ కార్యకర్తల కృషివల్లనే నాటి హైదరాబాద్ స్టేట్‌లో 70% ప్రజల్లో రాజకీయ చైతన్యం కలగడంతో పాటు, మూడు ప్రాంతాల కాంగ్రెస్ నాయకులకు ఉద్యమస్ఫూర్తి కలిగిందంటే అతిశయోక్తి కాదు. 1942 నాటి ‘సాధించు లేదా మరణించు’ ఉద్యమంలోను, 1946–47 ‘యూనియన్‌లో విలీనం’ ఉద్యమంలో, 1947–48 ‘సరిహద్దు ఉద్యమం’ లోనూ ఆర్యసమాజ్ కార్యకర్తల త్యాగాలు వెలకట్టలేనివి. ఈ ప్రాంతంలోని జాతీయవాదులకు ఆర్యసమాజ్ ఒక శిక్షణ కేంద్రంగా కొనసాగింది.

**రాయచూర్‌లో కార్యకలాపాలు ప్రారంభం**

పండిట్ బన్సీలాల్, బీదర్ జిల్లా హళ్లిఖేడ్‌కు చెందిన శ్యామ్‌లాల్‌లు ఆర్యసమాజ్‌లో నిబద్ధంగా పనిచేసిన ప్రముఖులు. ఆర్యసమాజ్ భావజాలంతో ఉత్తేజితులైన వీరిద్దరూ బీదర్, గుల్బర్గా, రాయ్‌చూర్, యాద్గిర్, యెల్‌బుర్గా, కొప్పల్, ఇటాగీ, కుక్కునూరు,


స్వామి రామానంద తీర్థ

అలవండి మొదలైన ప్రాంతాల్లో ఆ సంస్థ శాఖలను స్థాపించారు. 1925లో ఆర్యసమాజ్ కార్యకలాపాలు రాయ్‌చూర్‌లో ప్రారంభమయ్యాయి. ఈ శాఖకు అధ్యక్షుడిగా పండిట్ రామ్ స్వరూప్‌జీ వ్యవహరించారు. స్వామి సచ్చిదానందజీ ఆయన సహచరుడు. మంగళ్‌దేవ్ శాస్త్రి, మహావీర్ కల్యాణ్ వంటి చాలామంది ప్రముఖులు రాయ్‌చూర్, కొప్పల్ జిల్లాల్లో ఆర్యసమాజ్ విస్తరణకు కృషిచేశారు. మొదట్లో ఆర్యసమాజ్ కార్యకలాపాలు జానకి ప్రసాద్ నివాస గృహంలో జరిగేవి. తర్వాత 1930– 35 మధ్యకాలంలో ఈ రెండు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో శాఖలు విస్తరించాయి.

**రాజకీయానికి ఎందుకు ప్రాధాన్యం?**

నిజానికి ఆర్యసమాజ్ ఒక మత, సామాజిక ఉద్యమంగా దేశంలో కీలక పాత్ర పోషించినప్పటికీ, హైదరాబాద్ స్టేట్‌కు వచ్చేసరికి రాజకీయ కార్యకలాపాలకు ప్రాధాన్యమివ్వడానికి ప్రధాన కారణం మైనారిటీ ముస్లిం రాజులు, మెజారిటీ హిందువులను పాలించడం. మరో ప్రధాన కారణం– నాటి హిందూ సమాజం పేదరికం, నిరక్షరాస్యత వంటి సమస్యలతో కునారిల్లడం. నాటి నిజాం పాలనలో హిందువులు తీవ్ర అభద్రతా భావంతో జీవిస్తుండటాన్ని ఆర్యసమాజ్ గుర్తించింది. ఆ విధంగా 1892లో ఆర్యసమాజ్ హైదరాబాద్‌లోకి కాలుపెట్టింది. సుల్తాన్ బజార్ ఆర్యసమాజ్‌కు ప్రధాన కేంద్రంగా నిలిచింది. నిజానికి 1880లో భీర్ జిల్లా ధరూర్ తాలూకాలో స్వామి దయానంద సరస్వతి ఏర్పాటు చేసిన ఆర్యసమాజ్ శాఖను 1892లో హైదరాబాద్‌కు తరలించారు. దీని మొదటి అధ్యక్షులు కామత్ ప్రసాద్‌జీ రైస్తా. 1905లో పండిట్ కేశవరావ్ కోరాట్కర్ హైదరాబాద్ స్టేట్ ఆర్యసమాజ్ అధ్యక్షుడయ్యాక, ఉద్యమం కొత్తరూపు సంతరించుకుంది. ఈయన అప్పటి హైదరాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మాత్రమే కాదు, గొప్ప దేశభక్తుడు కూడా. అప్పటినుంచి ఆర్యసమాజ్ ప్రజల్లో రాజకీయ చైతన్యం కోసం తీవ్రంగా కృషిచేసింది. 1938 నాటికి హైదరాబాద్ స్టేట్‌లో 250 శాఖలు ఏర్పడ్డాయి. వీటిల్లో 20 జంట నగరాల్లోనే ఉండటం విశేషం.

**మతాంతరీకరణకు వ్యతిరేకంగా..**

నిజాం ప్రభుత్వం చేపడుతున్న మతాంతరీకరణ విధానాన్ని ఆర్యసమాజ్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇదే సమయంలో హైదరాబాద్ స్టేట్‌కు చెందిన స్వామి రామానంద తీర్థ, ఉద్గీర్‌కు చెందిన కాంబ్లేవాలే, జమలాపురం కేశవరావు, పీవీ నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి, బీదర్‌కు చెందిన రామచంద్ర వీరప్ప, కేవీ నరసింగరావు, గుల్బర్గాకు చెందిన విద్యాధర్ గురూజీ, రాయచూర్‌కు చెందిన పండిట్ తారానాథ్, ఇంకా ఉస్మానాబాద్, వరంగల్, జహీరాబాద్, ఆదిలాబాద్, బసవకల్యాణ్, ఔరంగాబాద్, బీడ్‌లకు చెందిన ప్రముఖ నాయకులను ఆర్యసమాజ్ ఎంతో ప్రభావితం చేసింది. వీరు ముస్లిమేతరుల పౌర, మతహక్కులను నొక్కి చెప్పడమే కాకుండా ఇందుకోసం పోరాటం సలిపారు. నాటి నిజాం ప్రభుత్వం ఇస్లామిక్ స్టేట్‌ను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ముస్లిమేతరుల హక్కులను అణచివేసింది. రాజకీయాలను, మతాన్ని కలిపేసి ‘తబ్లీగ్’ను ప్రారంభించేందుకు ‘ఇత్తెహాద్’ను ప్రోత్సహించింది. ఇందులో భాగంగానే నిజాం ప్రభుత్వం ఒక ఫర్మానాను జారీచేసింది. దీని ప్రకారం ‘ముఫసా’, ‘గైర్ ముఫసా’ చట్టాలను అమల్లోకి తెచ్చింది. ముస్లిం, మతాంతరీకరణకు గురైన హిందువుల ఆస్తుల రక్షణకు, వారి సాధికారతకు ఈ చట్టాలు హామీ ఇస్తాయి. ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఆర్యసమాజ్ నేతృత్వంలో హిందువులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. మానవులంతా సమానమే, కులవ్యవస్థ ఖండన, విద్యకు సమానావ




**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

కాశాల కల్పన, వేదాలకు మళ్లండి (వేదాలే జీవన ప్రమాణం), భారత్ భారతీయులదే వంటి ఆర్య సమాజ్ సందేశాలను ఈ సందర్భంగా విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రజలను ఈ దిశగా విద్యావంతులను చేసే ప్రక్రియను సంస్థ కార్యకర్తలు చేపట్టారు. శ్యామ్‌లాల్.. ఉద్గిర్‌లో అంటరాని వారి కోసం ఒక ఆసుపత్రిని ప్రారంభించాడు. బీదర్, ఉద్గిర్, చితగుప్ప, గుల్బర్గా, రాయచూర్‌లలో ఆర్యసమాజ్ పాఠశాలలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని ఆర్యసమాజ్ నాయకులు నిరుపేద హిందువుల అభ్యున్నతికి కృషిచేయాలని ప్రతిన పూనారు. ముస్లిం మతంలోకి మారిన వారిని తిరిగి హిందూమతంలోకి రావడం ద్వారా హిందూ సంస్కృతిని రక్షించాలని కోరేవారు. 'దీన్‌దార్', 'తబ్లీక్'లకు ప్రతిగా ఆర్యసమాజ్ 'శుద్ధి' ఉద్యమాన్ని ప్రారంభించింది. ముస్లింలుగా మారిన వారిని తిరిగి హైందవంలోకి తీసుకొని రావడం దీని ప్రధాన లక్ష్యం. నిజాం ప్రభుత్వం శుద్ధి ఉద్యమానికి మద్దతు ఇచ్చినవారిని తీవ్రంగా హింసించింది.

**భారత్ భారతీయులదే**


'భారత్ భారతీయులదే' అంటూ ఆర్యసమాజ్ ఇచ్చిన పిలుపు నిజాంకు, రజాకార్ల అకృత్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు హిందువుల్లో చైతన్యం రగిలించింది. నిజాం ప్రభుత్వం జారీచేసిన 144వ సెక్షన్‌కు వ్యతిరేకంగా ఆర్యసమాజ్ 'హవన కుండం' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా 'బసవ జయంతి', 'దసరా' పర్వదినాల సందర్భంగా హైదరాబాద్‌లో 'ఓం పతాకాలను' ఎగురవేశారు. ఈ కార్యక్రమాలు 1935–45 మధ్య కాలంలో విస్తృతంగా ఆర్యసమాజ్ నిర్వహించింది. హిందువుల్లో కుల నిర్మూలనను ప్రోత్సహించేందుకు, హరిజనులు, లింగాయత్‌లు, బ్రాహ్మణుల మధ్య కులాంతర వివాహాలను జరిపింది. బీదర్, ఉద్గిర్, చితగుప్ప, ఉస్మానాబాద్, ఔరంగాబాద్, మరఠ్వాడా ప్రాంతాల్లో ఈ కులాంతర వివాహాలు పెద్దఎత్తున జరిగాయి. హిందువులకు స్వీయరక్షణ పద్ధతుల్లో శిక్షణ ఇచ్చింది. ముఖ్యంగా రజాకార్లను ఎదుర్కొనే లక్ష్యంతోనే ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించింది. ఇందులో భాగంగా 'హనుమాన్ వ్యాయామ శాలలను' రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసింది. వీటి ద్వారా హిందువుల్లో జాతీయ భావాలను పెంపొందింపజేసేందుకు కృషి చేసింది. నిజాం ప్రభుత్వం ఆర్యసమాజ్ కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేసేందుకు యత్నించింది. ముఖ్యంగా ఆర్య సమాజ్ నిర్వహించే మత, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనకుండా ప్రజలను భయ భ్రాంతులను చేయడమే లక్ష్యంగా ఇత్తెహాద్ పనిచేసింది. ఇదిలా ఉండగా హైదరాబాద్ రాష్ట్రంలో కార్యకలాపాలను నిర్వహించేందుకు ఆర్యసమాజ్‌కు నైతిక, ఆర్థికపరమైన మద్దతునిచ్చింది 'సర్వదేశిక్ ఆర్య ప్రతినిధి సభ'. ఈ సంస్థ మద్దతు 1948, సెప్టెంబర్ 13 వరకు కొనసాగింది.




దయానంద సరస్వతి

**దీన్‌దార్ వ్యతిరేక ఉద్యమం**

1930 ప్రాంతంలో సిద్దిఖీ దీన్‌దార్ అనే ముస్లిం వ్యక్తి తనను తాను చెన్నబసవేశ్వరుడి అవతారంగా ప్రకటించుకొని, రామ, కృష్ణ అవతారాలను తక్కువ చేసి మాట్లాడటం మొదలుపెట్టాడు. ఈవిధంగా చేయడం ద్వారా కర్ణాటక ప్రాంతంలోని లింగాయత్‌లు, బ్రాహ్మణుల మధ్య విభేదాలు సృష్టించాలన్నది అతని ఉద్దేశం. దీనికి వ్యతిరేకంగా మంగళదేవ, రామచంద్ర ధేల్వీలు నాటి హైదరాబాద్ కర్ణాటక, మరఠ్వాడా ప్రాంతాల్లో విస్తృతంగా సమావేశాలు ఏర్పాటుచేసి హిందువుల్లో ఐక్యత చెడకుండా కృషిచేశారు. వీరి ఉత్తేజవంతమైన సమావేశాలు ముస్లింలలోని ప్రగతిశీలవాదులను కూడా ఆలోచింపజేశాయి. ఫలితంగా నిజాం, రజాకార్ల అణచివేత చర్యలను వీరు ఖండించడం మొదలు పెట్టారు. క్రమంగా నిజాం ప్రభుత్వం



కేశవరావ్ కోరాట్కర్



ఆర్యసమాజ్‌పై కఠినచర్యలకు ఉపక్రమించింది.

**వార్షిక సమావేశాల నిషేధం**


ఆర్యసమాజ్ వార్షిక సమావేశాలను నిషేధిస్తూ నిజాం ప్రభుత్వం 1937లో ఘస్తీ నిషాన్ పేరిట 53వ నెంబరు సర్క్యులర్ జారీచేసింది. ఈ సర్క్యులర్‌ను వేద్‌ప్రకాష్ అనే ఆర్యసమాజ్ కార్యకర్త తీవ్రంగా వ్యతిరేకించగా, అతడిని ఇస్లాంలోకి మారమంటూ ఒత్తిడి తీసుకురావడంతో అందుకు అంగీకరించలేదు. ఫలితంగా గుంజోటీలో హత్యకు గురయ్యాడు. నిజాం ప్రభుత్వంలోని మొఘలాయి సైనికులకు ఎంతమాత్రం భయపడకుండా ఆర్యసమాజ్ తన వార్షిక సమావేశాలను కొనసాగిస్తూ వచ్చింది. ఇందులో భాగంగా 1942లో ఉద్గిర్‌లో జరిగిన వార్షిక సమావేశానికి పండిట్ వినాయక్ రావు విద్యాలంకార్ అధ్యక్షత వహించగా, 1943లో నిజామాబాద్‌లో జరిగిన వార్షిక సమావేశానికి గణపతి కృష్ణశాస్త్రి అధ్యక్షత వహించారు. అదేవిధంగా నారాయణపేట్‌లో జరిగిన మూడో వార్షిక సమావేశం ఆర్.ఎస్. చంద్రజీ నేతృత్వాన జరిగింది. అయితే దసరా ఉత్సవం సందర్భంగా ఇక్కడ మత ఘర్షణలు జరిగాయి. ఆర్యసమాజ్ నాలుగో వార్షిక సమావేశాలు 1945 ఏప్రిల్ 22 నుంచి 24 వరకు గుల్బర్గాలో నిర్వహించారు. ఇవి రాజ్ నారాయణ్ లాల్ పిట్టే ఆధ్వర్యంలో జరిగాయి. ఆర్యసమాజ్ ఐదో వార్షిక సమావేశం 1946లో వరంగల్‌లో జరిగింది. తర్వాత ప్రభుత్వం నుంచి ఏవిధమైన అనుమతులు లేకుండానే ఆర్యసమాజ్ ఉత్సవాలను నిర్వహించడం ప్రారంభించింది. ఫలితంగా గుల్బర్గా, ఉద్గిర్, నిజామాబాద్, బీదర్, ఉస్మానాబాద్‌ల్లో మత ఘర్షణలు చోటుచేసుకున్నాయి.

**హైదరాబాద్ డే**

సర్వదేశిక ఆర్య ప్రతినిధి సభ 1936–37లో 'హైదరాబాద్ డే'ను జరుపుకోవాలని నిజాం సంస్థానంలోని ఆర్యసమాజ్ శాఖలను ఆదేశించింది. ప్రభుత్వ మతాంతరీకరణ విధానాలను నిరసిస్తూ, పౌరహక్కుల పరిరక్షణను కోరుతూ ఉద్యమించడం 'హైదరాబాద్ డే' నిర్వహణ ప్రధాన లక్ష్యం. తమ డిమాండ్లను నిజాం నవాబు పట్టించుకోకపోవడంతో 1938, అక్టోబర్ 24న సత్యాగ్రహం జరపాలని ఆర్యసమాజ్ నిర్ణయించింది. ఈ సత్యాగ్రహాలు




1939 వరకు కొనసాగాయి. ఈ సందర్భంగా రెండువేల మంది సత్యాగ్రహులను నిజాం ప్రభుత్వం అరెస్ట్ చేసింది. ఈ నిరసన క్రమంగా తీవ్రమై, నైజాం రాష్ట్రం యావత్తు మత ఘర్షణలకు దారితీసింది. గుల్బర్గాలో హోలీ పండుగ సందర్భంగా ఘర్షణలు జరిగాయి, హైదరాబాద్‌లోని ధూల్‌పేటలో గొడవలు జరగడంతో 21 మంది కార్మికులను ప్రభుత్వం అరెస్ట్ చేసింది. ఉద్గిర్‌లో దసరా ఉత్సవాలు జరుపుతున్న సందర్భంగా శ్యాంలాల్‌తో సహా 20 మందిని పోలీసులు అరెస్ట్ చేసి బీదర్ జైలుకు తరలించారు.



అక్కడే శ్యామ్‌లాల్ మృతి చెందారు. పండిట్ నరేంద్రజీని ప్రభుత్వం అరెస్ట్ చేసి మన్ననూమ్‌కు పంపింది. మొట్టమొదటి డిక్టేటర్ మహాత్మా నారాయణ స్వామి 1939 ఫిబ్రవరి 4న, రెండో డిక్టేటర్ కున్వర్ చంద్రకరణ్‌జీ 1939, మార్చి 2న గుల్బర్గాలో నిరాహార దీక్షలు జరిపారు. వీరిద్దరినీ అరెస్ట్ చేసి గుల్బర్గాలోని జైలుకు నిజాం ప్రభుత్వం తరలించింది.

**కార్యకర్తల ప్రాణత్యాగాలు**

హైదరాబాదేతరులను సంస్థానంలోకి రాకుండా నిజాం ప్రభుత్వం నిషేధం విధించినప్పుడు ఇతర ప్రాంతాలకు చెందిన ఆర్యసమాజ్ కార్యకర్తలు ఇక్కడ జరిగే ఉద్యమానికి మద్దతునివ్వడం కోసం షోలాపూర్, విజయవాడ, బార్సి, అహమ్మద్ నగర్, మన్మాడ్, పూనా, చాందల ద్వారా ప్రవేశించారు. వీరిలో చాలా మందిని నిజాం పోలీసులు అరెస్ట్ చేసి జైళ్లకు తరలించారు. అక్కడ ఆహారం అందించక పోవడంతో, ఎంతోమంది ఆకలితో చనిపోయారు. నిజాంకు వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో బసవకల్యాణ్‌కు చెందిన ధర్మప్రకాశ్, గుల్బర్గాకు చెందిన విష్ణు భగవాన్‌జీ, హుమానాబాద్‌కు చెందిన శివచంద్రజీ, హలిక్కేడ్‌కు చెందిన శ్యామలాజీ, ఉద్గిర్‌కు చెందిన భీమ్‌రావ్‌జీలు 1938-39 మధ్యకాలంలో నిర్వహించిన సత్యాగ్రహాల్లో పోలీసుల దెబ్బలకు ప్రాణాలు కోల్పోయారు. జైళ్లలో నిజాం పోలీసుల దాష్టీకం వల్ల 24 మంది సత్యాగ్రహులు ప్రాణాలు కోల్పోయారు. మరికొంత మంది సత్యాగ్రహులకు అన్నంలో విషం కలిపి ఇవ్వడంతో మరణించారు.

**తెలంగాణ ప్రాంతంలో**

నిజాం ప్రభుత్వం ఉర్దూ మీడియంలో మాత్రమే విద్యను అందిస్తున్న నేపథ్యంలో పండిట్ తారానాథ్ ఘట్‌కేసర్‌లో స్వాధ్యాయ మండల్, నల్గొండలో ఉపదేశిత్ విద్యాలయ పేరుతో శిక్షణా కేంద్రాన్ని నడిపేవారు. దీన్ని గుర్తించిన నిజాం ప్రభుత్వం తారానాథ్‌ను రాయచూర్‌లో హమ్‌దర్ద్ పాఠశాలను ప్రారంభించేందుకు బలవంతంగా పంపించింది. అయితే ఆర్యసమాజ్, గుల్బర్గా (1908), రాయ్‌చూర్ (1920), కుకునూర్ (1922)ల్లో పాఠశాలలను అప్పటికే నడుపుతోంది. తెలంగాణ ప్రాంతంలో ఆర్యసమాజ్ నగర సంకీర్తనలు, ఓం పతాకా విష్కరణలు, హవన కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో వీటిపై నిజాం ప్రభుత్వం నిషేధం విధించింది. 1895లో చాదర్‌ఘాట్, శాలిబండ వద్ద మొదటిసారి గణేష్ ఉత్సవాలను నిర్వహించారు. 1947లో పెంబర్తి గ్రామంలో గోగిడి రాఘవ అనే ఆర్యసమాజ్ కార్యకర్తపై ఇక్బాల్ నేతృత్వంలో రజాకార్లు దాడి చేశారు. అయితే అతన్ని స్థానిక రైతులు రక్షించినా ఈ ఘర్షణలో ముగ్గురు గొల్లెల కాపర్లు ప్రాణాలు కోల్పోయారు. మరో సంఘటనలో నీరుమళ్ల గ్రామానికి చెందిన భూస్వామి జంగారెడ్డిని డిప్యూటీ కలెక్టర్ జీపు వెంట ఐదు మైళ్లు పరిగెత్తించారు. చివరకు ఈ వేధింపులు తట్టుకోలేక ఆయన గుడివాడ పారిపోయారు. బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డి, జమలాపురం కేశవరావు, మాడపాటి హనుమంతరావు, మర్రి చెన్నారెడ్డి, బొమ్మకంటి సత్యనారాయణ, హయగ్రీవాచారి, పాగా పుల్లారెడ్డి, కోదాటి నారాయణరావు, కొమరగిరి నారాయణరావు, కాళోజీ నారాయణరావు, ఉమ్మెత్తల నరసింగరావు, పీవీ నరసింహారావు, కొలిపాక కిషన్‌రావు, కొలిపాక రామచంద్రరావు, దాశరథి, హీరాలాల్ మోరియా, ఐతరాజు రామారావు, జలగం వెంగళరావు వంటి నాయకులకు నిజాం విముక్తి పోరాటంలో ముందుకు దూసుకుపోయేందుకు స్ఫూర్తి ప్రదాత ఆర్యసమాజ్ మాత్రమే. స్వామి రామానంద తీర్థ నేతృత్వంలో వీరంతా పనిచేశారు. ఒకరకంగా చెప్పాలంటే వీరికి ఆర్యసమాజ్ ఒక శిక్షణ కేంద్రంగా నిలిచిందని చెప్పవచ్చు. నైజాం స్టేట్‌లో సర్దార్ జమలాపురం కేశవరావు విద్యా వ్యాప్తికోసం చేసిన కృషి, గ్రంథాలయోద్యమం, చేపట్టిన సత్యాగ్రహాలు వంటి వాటి వెనుక ఆర్యసమాజ్ ప్రభావం బలీయంగా ఉంది. ఈ కారణంగానే ఆయన స్వామి రామానందతీర్థ మార్గదర్శకత్వంలో పనిచేశారు. నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణలో తొలి సత్యాగ్రహం చేసింది స్వామి రామానంద తీర్థ, జమలాపురం కేవవరావులు కావడం విశేషం.

**కర్ణాటక ప్రాంతంలో**

సమావేశాలపై నిజాం ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో ముందంగి పట్టణంలో యువకులు సమావేశమై రజాకార్లు, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా మొట్టమొదటి ఫ్రీడమ్ ఫైట్ క్యాంపును ఏర్పాటుచేయగా దీనికి అర్మదానయ్య పౌరాణిక్ నేతృత్వం వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.కాం. చదువుతున్న ఈయన మధ్యలోనే చదువు మానేసి ఈ క్యాంపులో చేరారు. ఈయనకు ముందంగి మఠం నుంచి అవసరమైన సహాయ సహకారాలు అందేవి. ఆర్యసమాజ్ కార్యకర్త వేద్‌ప్రకాశ్ పౌరాణిక్ దాదాపు వెయ్యిమంది యువకులను కూడగట్టి రజాకార్లు, పోలీసులపై యుద్ధం చేయడానికి గెరిల్లా పోరాటంలో శిక్షణ ఇచ్చాడు. ఈ విషయంలో ముందంగి ఫౌజ్‌దార్ హెబ్‌సూర్, పౌరాణిక్‌కు అన్నిరకాలుగా సహాయం అందించాడు. ఆవిధంగా శిక్షణ ఇచ్చిన పౌరాణిక్ దాదాపు 85 గ్రామాలకు నిజాం నుంచి విముక్తి కలిగించాడు. ఈయన పోరాట పటిమకు ముచ్చటపడ్డ సర్దార్ పటేల్.. కేంద్ర మంత్రి గాడ్గిల్‌ను ముందంగికి పంపి తన ప్రశంసలు తెలిపారు. ఇటువంటి సంఘటనలు నైజాం స్టేట్‌లో చాలా జరిగాయి. ఇదిలా ఉండగా 1942లో ఉద్యమాన్ని బలహీన పరచేందుకు హిందువులను ఆర్థికంగా దెబ్బకొట్టే ఉద్దేశంతో రజాకార్లు గుల్బర్గాలో హిందువులకు చెందిన దుకాణాలను లూటీచేశారు.

అయినా నిజాం ప్రభుత్వం రజాకార్లపై ఏవిధమైన చర్యలు తీసుకోలేదు.


**మహారాష్ట్ర ప్రాంతంలో**

మహారాష్ట్రలో పండిట్ భగవత్ స్వరూప్, గోకుల్ ప్రసాద్‌లు చేసిన ప్రసంగాలు 1891 నుంచి మహారాష్ట్రలోని భిర్ జిల్లాలో ఆర్యసమాజ్ కార్యక్రమాలు ఊపందుకోవడానికి దోహదం చేశాయి. పండిట్ రావు కోరాట్కర్ అధ్యక్షతన 1932లో నైజాం స్టేట్‌లోని మహారాష్ట్ర వ్యాప్తంగా ఆర్యసమాజ్ శాఖలు ఏర్పాటయ్యాయి. గ్రంథాలయాలు, పాఠశాలల ద్వారా విద్యావ్యాప్తి జరిగింది. దీన్‌దార్ ఉద్యమాన్ని నిరసిస్తూ వై.డి. జోషి నేతృత్వంలో హిందూ సివిల్ లిబర్టీస్ మూవ్‌మెంట్ తరపున పౌర ఉద్యమం ప్రారంభమైంది. 1938, అక్టోబర్ 24న దసరా ఉత్సవాల సందర్భంగా ఉదయగిరి శాఖ అధ్యక్షుడు మాణిక్‌రావును ముస్లింలు కాల్చి చంపారు. దసరా సందర్భంగా ఆంక్షలు అమల్లో ఉన్న నేపథ్యంలో మాధవరావు వడగోంక, పురుషోత్తమరావు చపలగోంకర్, రామారావు పాటిల్, శ్రీపతిరావులు అరెస్టయ్యారు. ఔరంగాబాద్‌లోని ఇంటర్మీడియట్ కళాశాలలో అధ్యాపకుడిగా ఉన్న జి.ఎం. ష్రాఫ్ వందేమాతరం ఉద్యమానికి మద్దతిచ్చాడు. ఆయన తన ఉద్యోగానికి రాజీనామా చేసి విద్యార్థులతో కలిసి ఉద్యమంలో పాల్గొన్నాడు.

1940లో జి.ఎం. ష్రాఫ్, ఎస్. కె. వల్లంప్యాన్, డి.ఎల్. పాఠక్, ఎ.కె. వాఘ్మేర్‌లను నిజాం ప్రభుత్వం అరెస్ట్ చేసి జైలుకు పంపింది. 1941లో మరఠ్వాడా మూడో సదస్సు ఉద్గి (నాందేడ్)లో జరిగింది. కాశీనాథ్ వైద్య దీనికి నేతృత్వం వహించారు. వేలాదిమంది పాల్గొన్న ఈ సదస్సులో లక్ష్మణ్‌రావు వలుజ్కార్ తన ప్రసంగంతో ఉగ్రూతలూగించారు. ఆయన వయోజన విద్యాకేంద్రాలు, లైబ్రరీలను స్థాపించారు. ఇదే సమయంలో మహారాష్ట్ర పరిషత్‌ను పునర్ వ్యస్థీకరించారు. కమ్యూనిస్టులు కూడా ఈ పరిషత్‌లో చేరారు. ఔరంగాబాద్‌లో సి.డి. చౌదరి ఆర్గనైజర్‌గా ఉండగా, ఆర్.డి. దేశ్‌పాండే భిర్ జిల్లాలో, వి.డి. దేశ్‌పాండే నాందేడ్‌లో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. 1946లో నిజాం ప్రభుత్వ వ్యతిరేక పోరాటం ఉచ్ఛస్థితికి చేరుకుంది. ఈ సమయంలో లాతూర్‌లో నలుగురు రైతులు హత్యకు గురయ్యారు. ఆ సమయంలో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మూడు కమిటీలు ఏర్పాటయ్యాయి. ఒకటి సామూహిక సత్యాగ్రహాలు, ఫారెస్ట్ సత్యాగ్రహం, రజాకార్లపై పోరాటానికి హింసాత్మక సత్యాగ్రహం. వాఘ్మేర్, వైశంపాయన్, ఖర్థాంకర్, ఛబ్రా, దగదాబాయి షెల్కే ఉద్యమకారులకు మందుగుండు సామగ్రిని అందించేవారు. వీరు ఈ ఉద్యమంలోనే ప్రాణాలు కోల్పోయారు.

**అరాచకాలకు కారణం ఖాసిం రజ్వీ**

1930-44 మధ్యకాలంలో బహదూర్ యార్



జంగ్ నేతృత్వంలోని మజ్లిస్ పార్టీ బలంగా రూపొంది, హైదరాబాద్ ముస్లింల ప్రతినిధిగా వ్యవహరించింది. 1946-48 మధ్యకాలంలో మతమౌఢ్యం నరనరానా నింపుకున్న ఖాసిం రజ్వీ ఈ పార్టీకి నేతృత్వం వహించి, రజాకార్ల పేరుతో వాలంటీర్లను నియమించి ముస్లిమేతరులపై దారుణాలకు పాల్పడ్డాడు.

అతను సాగించిన దారుణ మారణకాండ హైదరాబాద్ చరిత్రలో చీకటి అధ్యాయాన్ని మిగిల్చింది. ఇండియన్ యూనియన్‌లో కలిసేందుకు ఎంతమాత్రం ఇతడికి ఇష్టం ఉండేదికాదు. ఇతను అనుసరించిన మతఛాందస విధానమే చివరికి సైనిక చర్యకు దారితీసింది. ఎట్టకేలకు నిజాం ప్రభుత్వ పతనంతో హైదరాబాద్ సంస్థాన ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకోగలిగారు.

**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**

వార్త

# ఏడాది పాటు 'నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు'




**భాగ్యనగరం:** చరిత్ర పట్ల తెలంగాణ యువతకు సంపూర్ణ అవగాహన కలిగించడమే లక్ష్యంగా ఏడాది పాటు (2022, సెప్టెంబర్ 17 నుంచి 2023 సెప్టెంబర్ 17) నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలను నిర్వహిస్తున్నట్టు 'నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల కమిటీ- తెలంగాణ' గౌరవ అధ్యక్షుడు జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి తెలిపారు. భాగ్యనగరంలో సెప్టెంబర్ 3న ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా, ప్రజల భాగస్వామ్యంతో, ఎలాంటి డిమాండ్లు లేకుండా, చరిత్ర పట్ల యువతను జాగృత పరచడానికే ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఎందరో అమరవీరుల త్యాగాలు, పోరాటం ఫలితంగా 1948, సెప్టెంబర్ 17 త్రివర్ణ పతాకం ఎగురవేయడంతో తెలంగాణలో బానిసత్వపు చీకట్లు తొలగి పోయాయన్నారు. తెలంగాణతో పాటు హైదరాబాద్ సంస్థానం నుంచి విడిపోయిన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు.. ఆ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులను స్మరించుకునేలా వివిధ కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 28 మందితో కూడిన రాష్ట్ర కమిటీని జస్టిస్ నరసింహారెడ్డి ప్రకటించారు. అధ్యక్షుడిగా డాక్టర్ వంశీతిలక్, ఉపాధ్యక్షులుగా విశ్రాంత ఐఏఎస్ అధికారి చామర్తి ఉమా మహేశ్వరరావు, కార్మిక శాఖ విశ్రాంత కమిషనర్ హెచ్‌కే నాగు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగ విశ్రాంత అధిపతి ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి, తదితరులు కమిటీలో ఉన్నారు.

**అందరి భాగస్వామ్యంతో..**

సెప్టెంబర్ 17న రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, రెవెన్యూ మండలాల్లోనూ ప్రముఖులు, యువకులతో అమృతోత్సవాల కమిటీని ఏర్పాటుచేస్తారు. అదే రోజున త్రివర్ణ పతాకానికి వందన సమర్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. నవంబర్‌లో యువకులు, కళాశాల విద్యార్థులతో యువ సమ్మేళనాలు నిర్వహిస్తారు.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో లక్షలాది కుటుంబాలకు తెలంగాణ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిపై అవగాహన కలిగించే దిశగా జనజాగరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 2023, సెప్టెంబర్ 17న తెలంగాణ అంతటా జిల్లా కేంద్రాల్లో ప్రముఖ వ్యక్తులు, మేధావులతో సదస్సులు నిర్వహిస్తారు. ఆ రోజున గ్రామ గ్రామాన త్రివర్ణ పతాకానికి వందన సమర్పణతో నైజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుంది. ★




# అసఫ్‌జాహీల పాలిట అంకుశం ఆంధ్ర మహాసభ

**నిజాం రాజ్యంలో అణగి ఉన్న తెలుగు సమాజంలో భాషాసంస్కృతులను కాపాడుకోవాలనే స్పృహను రగిలించిన మహోద్యమం అది. చిన్న పాయలా ప్రారంభమైన ఈ సాంస్కృతిక ఉద్యమం అసఫ్ జాహీల పాలనకే ఎసరు పెట్టింది. హైదరాబాద్ రాష్ట్ర విముక్తిలో ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర మహాసభల పాత్ర మరువరానిది. ఎందరో సాహితీవేత్తలు, సామాజిక, సాంఘిక ఉద్యమకారులు, రాజకీయ నాయకులు ఈ వేదికల ద్వారా పని చేశారు. నిజాం రాజు తరతరాల బూజు అని గుర్తించడమే కాదు, దానిని వదిలించిన ఆ మహోద్యమం, దాని స్ఫూర్తి చిరస్మరణీయం.**

భారతభూమి నడి బొడ్డున అతిపెద్ద సంస్థానం హైదరాబాద్. ఇది మూడు భాషా ప్రాంతాలలో ఉండేది. తెలుగువారున్న అతిపెద్ద భూభాగం తెలంగాణ. సంస్థానంలో అత్యధిక ప్రజలు మాట్లాడే తెలుగు, మరాఠీ, కన్నడ భాషలను కాదని ఉర్దూకు పెద్ద పీట వేశారు. అంతకు ముందు పార్శీ. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే పాఠశాలల్లో ఉర్దూ మాత్రమే బోధించేవారు. ఈ భాష తెలిసిన వారికే ప్రభుత్వ ఉద్యోగాలు లభించేవి. ఎంత అణచివేత ఉన్నా మెజారిటీ ప్రజల భాషలు అస్థిత్వాన్ని కాపాడుకుంటూ వచ్చాయి. ఇందుకు కారణం హైందవమతం. ఈ ఆధ్యాత్మిక, సాంస్కృతిక స్పృహే తెలుగు, మరాఠీ, కన్నడ భాషలను కాపాడుతూ వచ్చింది. కానీ తెలుగువారికి అంతర్లీనంగా తమ భాష రక్షణకు వేదిక ఏదీ ఏర్పడలేదు. ఈ దశలో హైదరాబాద్ నగరంలో జరిగిన ఓ ఘటన పెద్ద మార్పును తీసుకు వచ్చింది. ఇది సంస్థానంలో ఆంధ్ర మహోద్యమానికి నాంది పలికింది. నిజాం అస్థిత్వాన్ని సవాలు చేసి సంస్థానం పతనానికి దారి తీసింది.

**ఆంధ్ర జనసంఘం ఆవిర్భావం**

నవంబరు 12, 1921. హైదరాబాద్‌లోని కోఠిలో ఉన్న వివేకవర్ధిని ఆడిటోరియంలో హిందూ సంస్కార సభ జరిగింది. దీనికి పుణె మహిళా విశ్వవిద్యాలయ స్థాపకులు దోండే కేశవకార్వే అధ్యక్షత వహించారు. సంస్థానంలోని అన్ని ప్రాంతాల ప్రముఖులు హాజరయ్యారు. వక్తలంతా ఇంగ్లీష్, ఉర్దూలతో పాటు మరాఠీ, కన్నడ భాషల్లో ఉపన్యాసాలు ఇస్తున్నారు. ఒక వక్త, హైకోర్టు ప్రముఖ

న్యాయవాది అలంపల్లి వెంకటరామారావు తీర్మానాలను సమర్థిస్తూ తెలుగులో ఉపన్యాసం ప్రారంభించారు. తమకు అర్థం కావడం లేదని, ప్రసంగం ఆపేయాలంటూ సభికులంతా గోల చేశారు. సభలో పాల్గొన్న తెలుగువారు దీన్ని అవమానంగా భావించి నిరసన తెలుపుతూ బయటకు వచ్చేశారు. అంతకు ముందు కూడా మరో తెలుగు ప్రముఖుడు మాడపాటి హనుమంతరావుకు ఇదే తరహా అవమానం జరిగింది.

అదే రోజు రాత్రి కొందరు తెలుగు ప్రముఖులు వివేకవర్ధిని వెనుకే ట్రూప్‌బజార్‌లో ఉన్న టేకుమాల రంగారావు ఇంట్లో సమావేశమయ్యారు. ఇందులో మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణా రావు, టేకుమాల రంగారావు, మిట్ట లక్ష్మీనరసయ్య, ఆదిరాజు వీరభద్రరావు, నడింపల్లి జానకి రామయ్య, మందుముల నరసింగరావు, బోయినపల్లి వెంకట రామారావు, కొమ్మవరపు సుబ్బారావు, బూర్గుల నరసింహారావు, డాక్టర్ పందింటి రామస్వామి నాయుడు ఉన్నారు. అంతా కలిసి 'ఆంధ్ర జనసంఘం' పేరుతో సరికొత్త వేదికను స్థాపించారు. రూపాయి చందాతో సభ్యులుగా మారారు.

ఆంధ్ర జనసంఘంలో వందమంది సభ్యులు చేరిన తర్వాత ఫిబ్రవరి 24, 1922 కొండా వెంకటరంగారెడ్డి అధ్యక్షతన సమావేశమైంది. ఆ తర్వాత మార్చి 17, ఏప్రిల్ 4 తేదీల్లో మరో రెండు సమావేశాలు నిర్వహించి నియమావళిని రూపొందిం చారు. ఆంధ్ర జనసంఘం అధ్యక్షునిగా బారిస్టర్ ఆర్. రాజగోపాల్ రెడ్డి, కార్యదర్శిగా మాడపాటి హనుమంతరావు, సహాయ కార్యదర్శిగా మందుముల నర్సింగరావులను ఎన్నుకున్నారు. కొండా వెంకట రంగారెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, టేకుమాల రంగారావు, పాపిరెడ్డి, డాక్టర్ రామస్వామి నాయుడు, రాజా రంగారావు పాలకవర్గ సభ్యులుగా ఉన్నారు. ఆ సమయంలో సంస్థానంలో రాజకీయ సభలు, సమావేశాలపై నిర్బంధం ఉండేది. అందుకే కొంత కాలం బహిరంగంగా రాజకీయ అంశాల జోలికి వెళ్లకుండా సంస్కరణలకే పరిమితమైంది.


**ఆంధ్ర జనసంఘం సమావేశాలు**

ఆంధ్ర జనసంఘం తొలి సమావేశం జులై 27, 1923న హైదరాబాద్‌లోని మాడపాటి హనుమంత రావు ఇంట్లో జరిగింది. రాజ బహదూర్ వెంకట రామారెడ్డి అధ్యక్షునిగా, మాడపాటి హనుమంత రావును కార్యదర్శిగా ఎన్నుకున్నారు. రెండో సమావేశం మార్చి 1, 1924న నల్గొండలో జరిగింది. 'నీలగిరి' పత్రిక సంపాదకులు షబ్నవీసు వేంకటరామనరసింహారావు కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ సభకు కూడా వెంకటరామారెడ్డే అధ్యక్షుడు. ఈ సమావేశాల్లోనూ తెలుగువారి విద్యా వికాసాలు, వారి భాషాభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాలనే నిర్ణయించారు.

మూడో సమావేశం ఫిబ్రవరి 21, 1925న మధిరలో జరిగింది. మరునాడు గ్రంథాలయ మహాసభ నిర్వహించారు. బొంబాయి ఆంధ్రులు మద్దతు ప్రకటించారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో నిజాం అప్రమత్తమయ్యాడు. సంస్థానం బయటివారు జోక్యం చేసుకుంటున్నారంటూ నాలుగో మహాసభకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. రాజకీయేతర సభలకు ఆంక్షలు వర్తించవని హైకోర్టు చెప్పినా పట్టించుకోలేదు. అలా వాయిదాపడిన ఈ సభలు సూర్యాపేటలో 1928, మే 28, 29, 30 తేదీల్లో అత్యంత విజయవంతంగా జరిగాయి. ఆంధ్ర జనసంఘం సభలకు సమాంతరంగా గ్రంథాలయ మహాసభలు, వర్తక సంఘం సమావేశాలు కూడా జరిగాయి. డిసెంబరు 2,1922న 'సూర్యాపేట వర్తక సంఘం' ఆవిర్భవించింది.

**జాగృతమైన తెలంగాణ సమాజం**

నిజాం రాజ్య ఆంధ్రోదయంలో 'ఆంధ్ర మహాసభ' మొదటి దశ కాగా, రెండో దశ 'ఆంధ్రజన కేంద్ర



సంఘం'. ఆంధ్ర మహాసభను మరింత విస్తరించి అన్నిరకాల కార్యకలాపాలను సమన్వయ పరచడానికి ఆంధ్ర జన కేంద్ర సంఘం ఏర్పడింది. వరంగల్, నల్లగొండ, మధిర, సూర్యాపేట, జోగిపేట, దేవరకొండ, ఖమ్మం, సిరిసిల్లలతో ఈ సమావేశాలు జరిగాయి. ఆంధ్ర జనసంఘం స్థాపించిన మరుసటి ఏడాది దానికి ఉపసంఘంగా ఆంధ్ర పరిశోధక సంఘం ఏర్పాటయ్యింది.

**ఆంధ్ర మహాసభకు అంకురార్పణ**

ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర జనకేంద్ర సంఘం సభలు, సమావేశాలతో హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణలో నిరంకుశ అధికారులు, దొరల బెడద కొంత తగ్గింది. పదేళ్ల పాటు జరిగిన ఈ కార్యాక్రమాలతో కొద్దికాలంలోనే తెలుగువారికి ఒక వేదిక ఉందన్న విశ్వాసం ఏర్పడింది. ఈ దశలో ఆంధ్ర జన సంఘంతో పాటు వివిధ సంఘాల ఐక్యతతో తెలంగాణ అంతటికీ ప్రాతినిధ్యం వహించే సంస్థ అవసరమైంది. భాషా సంస్కృతిక కార్యక్రమా లతో పాటు సామాజిక, సాంఘిక సంస్కరణతోపాటు క్రమంగా రాజకీయాలపై దృష్టి సారించడమే లక్ష్యంగా 'ఆంధ్ర మహాసభ' అవతరించింది. విద్యావంతులు, న్యాయవాదులు, వ్యాపారులు, ప్రముఖులకు పరిమితం కాకుండా అన్నివర్గాల ప్రజలను కలుపుకొని పోయేందుకు కృషి చేసింది. ఇందు కోసం సభ్యత్వ రుసుము ప్రతి ఏటా క్రమంగా తగ్గిస్తూ రూపాయి, పావలా, అణా వరకూ తీసుకొచ్చారు. యువతతో పాటు రైతులు, కూలీలు, నిరక్షరాస్యులను కూడా సభ్యులుగా చేర్చుకున్నారు.

**మొదటి ఆంధ్ర మహాసభ**

1930 మార్చి 3, 4, 5 తేదీల్లో మెదక్ జిల్లా జోగిపేటలో మొదటి ఆంధ్ర మహాసభ జరిగింది. సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సభకు అనుమతి ఇచ్చేందుకు ప్రభుత్వం ఎన్నో షరతులు విధించింది. సభకు అధ్యక్షత వహించేవారు గైర్ ముల్కీ (బయటివారు) కాకూడదన్నది ప్రధాన షరతు. ఈ మహాసభ సమావేశాల్లో 32 తీర్మానాలను ఆమోదించారు. వీటిలో విద్య, సంఘ సంస్కరణలకు సంబంధించినవే ఉన్నాయి. స్త్రీలకు విద్య, బాల్య వివాహాల నిషేధం, వితంతు వివాహం లాంటి తీర్మానాలను కూడా చేశారు. అయితే సభలో ఉన్న



**నాలుగవ ఆంధ్రమహాసభ, సిరిసిల్ల. మాడపాటి హన్మంతరావుతో పాటు ఆవునూరు వేణుగోపాలరావు (ఆహ్వాన సంఘ అధ్యక్షులు) కొడిమాల భూమయ్య వకీల్, ఇరుకుల వెంకన్న, లక్ష్మణరావు వకీల్ తదితరులు ('హైదరాబాదు స్వాతంత్రోద్యమ చరిత్ర' నుంచి)**




సనాతనవాదులను ఈ తీర్మానాలు బాధించాయి. ప్రముఖ సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అంటరాని తనం నిర్మూలన, మాల మాదిగలకు విద్యావ కాశాలపై తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సమయంలో సనాతనవాదులు నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. వామననాయక్ వారిని తప్పుపడుతూ తీర్మానాన్ని సమర్థించారు.

ఆంధ్రమహాసభలకు సమాంతరంగా ఆంధ్ర మహిళా సభలు కూడా జరిగాయి. నడింపల్లి సుందరమ్మ అధ్యక్షతన రాజకీయాల్లో మహిళలకు భాగస్వామ్యంతో పాటు పలు కీలక అంశాలను చర్చించారు.


**రెండో ఆంధ్రమహాసభ**

1931 మార్చి 3, 4, 5 తేదీల్లో దేవరకొండలో జరిగిన రెండో ఆంధ్రమహాసభకు బూర్గుల రామకృష్ణారావు అధ్యక్షత వహించారు. ఈ సభకు రావి నారాయణరెడ్డి నాయకత్వంలో రెడ్డి హాస్టల్ విద్యార్థులు కాలి నడకన బయలుదేరి, ప్రతి గ్రామంలో ప్రచారం చేస్తూ దేవరకొండ చేరుకున్నారు. ద్వితీయాంధ్ర మహాసభకు అనుమతి వచ్చే విషయంలో కూడా ప్రభుత్వం అనేక షరతులు విధించింది. ప్రభుత్వ విధానాలకు అనుకూలంగా తీర్మానాలు ఉండాలని వాటిలో ప్రధాన షరతు. రెండో ఆంధ్రమహాసభలో బహిరంగ సభలపై ప్రభుత్వం విధించే ఆంక్షలకు సంబంధించిన గస్తినిషాన్ తిర్పన్ – సర్క్యులర్ నం. 53ను ఉపసంహరించాల్సిందిగా తీర్మానం చేశారు. వెట్టిచాకిరి, భూమిశిస్తు, రైతుల కష్టాలపై చర్చించారు.

వరలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగిన ఆంధ్రమహిళా సభలో మరికొన్ని తీర్మానాలు చేశారు. మహిళల విద్య, వైద్య అవసరాలు, గోషాపై నిషేధం, కళావంతుల వివాహాలకు సంబంధించిన సంస్కరణలు ఇందులో ఉన్నాయి.

**మూడో ఆంధ్రమహాసభ**

రెండో ఆంధ్రమహాసభలో రాజకీయ తీర్మానాలు చేయకున్నా, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగాయనే కారణంతో నిజాం ప్రభుత్వం తదుపరి సభకు మూడేళ్లపాటు అనుమతి ఇవ్వలేదు. అనేక అడ్డంకులను సృష్టించింది. వీటిని ఎదుర్కొంటూ 1934 డిసెంబరు 13, 14, 15 తేదీల్లో ఖమ్మంలో మూడో మహాసభలు జరిగాయి. ఈ సభలకు పులిజాల వెంకటరంగారావు అధ్యక్షత వహించారు. 'తెలంగాణ సర్దారు' జమలాపురం కేశవరావు ఈ సభలో క్రియాశీల పాత్ర పోషించారు. ఎల్లాప్రగడ సీతాకుమారి అధ్యక్షత వహించిన ఆంధ్ర మహిళా సభకు 3 వేల మంది హాజరుకావడం విశేషం.



ఏడవ ఆంధ్రమహాసభ – అధ్యక్షులు మందుముల రాంచంద్రరావు, కేవీ రంగారెడ్డి, డి. రాంరెడ్డి తదితరులు..
('హైదరాబాదు స్వాతంత్రోద్యమ చరిత్ర' నుంచి)

**నాలుగో ఆంధ్ర మహాసభ**

1935 డిసెంబరు 26, 27, 28 తేదీల్లో మాడపాటి హనుమంతరావు అధ్యక్షతన సిరిసిల్లలో నాలుగో ఆంధ్ర మహాసభలు జరిగాయి. ఈ సమావేశాల్లో ఆంధ్ర మహాసభ వ్యవహారాలన్నీ తెలుగులోనే జరగాలని, ఉపన్యాసాలు తెలుగులోనే ఉండాలని నిర్ణయించారు. ఈ మహాసభలో ప్రవేశ పెట్టడానికి వీలులేదని ప్రభుత్వం నిషేధించిన తీర్మానాలను ఆంధ్ర మహిళా మహాసభలో ప్రవేశ పెట్టారు. దీనికి మాణిక్యమ్మ అధ్యక్షత వహించారు. మాతృభాషలో విద్య, నిర్బంధ విద్య, బాలికలకు ఉన్నత విద్య, బాల్య వివాహాల నిషేధం, జాగీర్ ప్రజల హక్కులు, స్థానిక పాలన తదితర అంశాలపై తీర్మానాలు చేశారు. మరోవైపు ఈ సభలకు వచ్చిన యువకులు ఆంధ్రమహాసభల్లో రాజకీయాంశాలు లేకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు.

**అయిదో ఆంధ్ర మహాసభ**

1936 డిసెంబరు 15, 16, 17 తేదీల్లో కొండా వెంకటరంగారెడ్డి అధ్యక్షతన షాద్‌నగర్‌లో అయిదో ఆంధ్రమహాసభలు జరిగాయి. దీనికి దాదాపు 10వేల మంది హాజరయ్యారు. ఈ మహాసభలో చేసిన తీర్మానాల్లో చెప్పుకోదగ్గ విశేషాలేమీ లేవు. అన్ని సభలకు వచ్చినట్లే ఈ సభకు కూడా కన్నడ, మరాఠా నాయకులు వచ్చారు. అయితే నాల్గవ మహాసభలో భాషావాదులు ప్రవేశపెట్టిన క్లాజు మూలంగా వారు నోరు మెదపటానికి కూడా వీలులేకపోయింది. చివరకు వారు తమ సందేశాన్ని కూడా ఇవ్వకుండా తిరిగి వెళ్లవలసివచ్చింది. ఆంధ్రమహిళా సభకు బూర్గుల అనంతలక్ష్మమ్మ అధ్యక్షత వహించారు.

**ఆరో ఆంధ్ర మహాసభ**

1937 డిసెంబరు 6,7,8 తేదీల్లో నిజామాబాద్‌లో జరిగిన ఆంధ్రమహాసభకు మందుముల నరసింగరావు అధ్యక్షత వహించారు. అప్పటివరకు ఆంధ్ర మహాసభను రాజకీయేతర సంస్థగానే నడిపించారు. ఆరో మహాసభ రాజకీయ కార్యాచరణ దిశగా అడుగులు వేసింది. మరాఠా నాయకుడైన కాశీనాథరావు ముఖ్ పాల్కర్, మౌల్వి గులాం భాషానీ మారాఠీలో మాట్లాడేందుకు ప్రయత్నించగా వ్యతిరేకత వ్యక్తమైంది. రావినారాయణ రెడ్డి జోక్యం చేసుకొని వారిని మాట్లాడించారు. హైదరాబాద్ స్టేట్‌లో బాధ్యతాయుతమైన ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా ఈ అంశంపై నిజాం నియమించిన అరావముదు అయ్యంగార్ కమిటీకి సూచిస్తూ తీర్మానం చేశారు. ఇప్పటి వరకూ ఆంధ్రమహాసభలో అంతర్లీనంగా ఉన్న అతివాద, మితవాద భావాలను ఆరో మహాసభలో బహిర్గతమయ్యాయి..

**ఏడో ఆంధ్ర మహాసభ**

1940లో హైదరాబాద్‌లోని మల్కాపురంలో జరిగిన ఏడో ఆంధ్రమహాసభకు మందుముల రామచంద్రరావు అధ్యక్షత వహించారు. సంస్థానంలో 1938 నుంచి స్టేట్ కాంగ్రెసు సత్యాగ్రహోద్యమం ప్రారంభం కావడంతో మహాసభల నిర్వహణలో కాస్త ఆలస్యం జరిగింది. సత్యాగ్రహంలో మందుముల రామచంద్రరావు, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి పాల్గొన్నారు. సత్యాగ్రహం ద్వారా రాజకీయ చైతన్యాన్ని పొందిన యువకులు మహాసభల్లో మరింత చురుగ్గా పాల్గొన్నారు. ఏడో ఆంధ్రమహాసభ

సమావేశాలు అంతకుముందు వాటి కంటే భిన్నంగా జరిగాయి. కమ్యూనిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సభ నుంచే మితవాదులు, అతివాదు లనే రెండు గ్రూపులు ఏర్పడ్డాయి. సంస్థానంలో రాజకీయ సంస్కరణల కోసం నియమించిన అయ్యంగార్ కమిటీ సమర్పించిన నివేదికపై చర్చ జరిగింది. ఇందులో కొన్నింటిని తిరస్కరిస్తూ చేసిన తీర్మానం ఓటింగ్‌లో వీగిపోయింది.

**ఎనిమిదో ఆంధ్ర మహాసభ**

నల్లగొండ జిల్లా చిలుకూరులో 1941లో ఎనిమిదో ఆంధ్ర మహాసభ రావి నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగింది. నాయకులు మితవాదులు, అతివాదులుగా చీలిపోవడంతో చిలుకూరు సభలకు ప్రాధాన్యం ఏర్పడింది. అధ్యక్ష ఉపన్యాసంలో ప్రపంచ యుద్ధాలు, అంతర్జాతీయ అంశాలు, పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల వల్ల కలిగే నష్టాలు వంటి అంశాలు చోటుచేసుకున్నాయి. కౌలు సమస్య, వెట్టిచాకిరి, రైతుల సమస్యలు, స్త్రీల సమస్యలు లాంటి అంశాలు చర్చకు వచ్చాయి. ఆంధ్ర మహాసభ తరఫున విద్యా వారం (1941 అక్టోబరు 19-25), బేగారి వారం (1941 డిసెంబరు 25-1942 జనవరి 1), రాజకీయ బాధితుల దినం (1941 డిసెంబరు 25) నిర్వహించడం ద్వారా గ్రామాల్లోని రైతులు, కూలీల్లో చైతన్యం నింపారు.

**తొమ్మిదో ఆంధ్ర మహాసభ**

1942 మేలో వరంగల్ జిల్లా ధర్మవరంలో జరిగిన తొమ్మిదో ఆంధ్రమహాసభకు మాదిరాజు రామకోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. మిత వాదుల్లో మితవాది మాదిరాజు. ఈ సభలో పరిస్థితులు అతివాదులకు అనుకూలంగా ఉన్నప్పటికీ యువ నాయకుల సహాయ సహకారాలు ఈ సభకు లభించలేదు.

**10వ ఆంధ్ర మహాసభ**

1943 మే 23, 24, 25 తేదీల్లో హైదరాబాద్‌లో పదో ఆంధ్రమహాసభ జరిగింది. కొండా వెంకట రంగారెడ్డి దీనికి అధ్యక్షత వహించారు. మొదటి సారిగా అధ్యక్ష పదవికి ఈ మహాసభలో పోటీ పడ్డారు. అతివాద నాయకుడు బద్దం ఎల్లారెడ్డి, మితవాద నాయకుడు కొండా వెంకట రంగారెడ్డి మధ్య పోటీ జరిగింది. రంగారెడ్డి విజయం సాధించారు. ఈ మహాసభలతో మితవాదులు, అతివాదుల మధ్య అంతరం తారస్థాయికి చేరింది.


**11వ ఆంధ్ర మహాసభ**

1944 మార్చిలో భువనగిరిలో జరిగిన పదకొండవ ఆంధ్రమహాసభకు రావి నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సమావేశాల్లో మితవాదుల జోక్యం పెద్దగా లేదు. విజయవాడ ప్రాంతం నుంచి సుమారు వంద మంది కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు సభలో పాల్గొన్నారు. ఈ సభలకు 10వేల మంది హాజరయ్యారు. సభలో సభ్యత్వ రుసుమును నాలుగు అణాల నుంచి ఒక అణాకు తగ్గించి మహాసభను ప్రజలకు మరింత చేరువ చేశారు.

ఈ సమావేశాలతో పూర్తిగా కమ్యూనిస్టుల చేతిలోకి వెళ్లిపోయిన ఆంధ్రమహాసభలో చీలిక వచ్చింది. మితవాద నాయకులు మాడపాటి హనుమంత రావు, కొండా వెంకట రంగారెడ్డి, మందుముల నరసింగరావు, రామచంద్రరావు, మాదిరాజు కోటేశ్వరరావు, పులిజాల వెంకట రంగారావు తదితరు జాతీయ ఆంధ్రమహాసభ పేరిట నూతన వేదిక ప్రారంభించారు. వీరు1945లో వరంగల్‌లోని మడికొండలో ఆంధ్ర మహాసభలను నిర్వహించారు.

**12వ ఆంధ్ర మహాసభ**

ఖమ్మంలో 1945 ఏప్రిల్ 26, 27 తేదీల్లో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన కమ్యూనిస్టుల నాయకత్వంలోని ఆంధ్రమహాసభ 12వ సమావేశాలు జరిగాయి. ఈ సభలో రైతులకు సంబంధించి అనేక తీర్మానాలు చేశారు. వెట్టిచాకిరిని వెంటనే రద్దు



చేయాలని సభ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. నిజాం రాజ్యాన్ని ఎదిరించి, ప్రజారాజ్యాన్ని స్థాపించాలని ఆంధ్ర మహాసభ పిలుపునిచ్చింది. ఈ మహాసభల తర్వాత రాజకీయ పోరాటాలు తెలంగాణ అంతటా వ్యాపించాయి. మరోవైపు సంప్రదింపులకు వీలుగా ఆంధ్ర మహాసభపై 1946 జులైలో ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ సభ తర్వాత కమ్యూనిస్టులు ఆంధ్రమహాసభ ముసుగు తొలగించుకొని క్రమంగా సాయుధ పోరాటంలోకి వెళ్లిపోయారు.

1946లో జాతీయవాదుల నాయకత్వంలోని ఆంధ్ర మహాసభ కందిలో జమలాపురం కేశవరావు అధ్యక్షతన జరిగింది. ఆ తర్వాత నిజాం ప్రభుత్వం స్టేట్ కాంగ్రెస్‌పై నిషేధం ఎత్తివేయడంతో ఈ ఆంధ్ర మహాసభ కాంగ్రెస్ పార్టీలో విలీనమైంది.

తెలంగాణలో నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాట పంథాను ఆంధ్రోద్యమం మలుపు తిప్పింది. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలకు ఆంధ్ర మహాసభ రెండున్నర దశాబ్దాల పాటు వేదికగా ఉపయోగపడింది. ఎందరో నాయకులను అందిం చింది. తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణతో పాటు సామాజిక, సాంఘిక, రాజకీయ చైతన్యం రగిలించ డంలో ఆంధ్రమహాసభలు ఎంతో ఉపయోగపడ్డాయి. హైదరాబాద్ స్టేట్‌లో పాటు తెలంగాణ ప్రజల్లో వచ్చిన చైతన్యాన్ని అణచి వేసేందుకు నిజాం ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

ఆగస్టు 15,1947న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత హైదరాబాద్ సంస్థాన పాలకుడు ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ స్వతంత్ర రాజ్యంగా ప్రకటించుకున్నాడు. సంస్థానాన్ని భారత్ ఈ దశలో విలీనం చేయాలనే డిమాండ్‌లో పోరాడిన ఎంతోమంది నాయకులు, కవులు, కళాకారులు నిర్బంధానికి, చిత్ర హింసలకు గురయ్యారు. ఎందరో అమరులయ్యారు. వీరందరికీ ఆరంభంలో ఆంధ్ర జన సంఘం, తర్వాత కాలంలో ఆంధ్ర మహాసభ స్ఫూర్తిగా నిలిచాయి. సెప్టెంబర్ 17, 1948న భారతదేశంలో సంపూర్ణంగా విలీనం కావడంతో హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణ, మరాఠ్వాడా, కర్ణాటక ప్రాంతాలు విముక్తమయ్యాయి. ఈ సందర్భంగా వీరందరినీ స్మరించుకుందాం.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**

## రచనలకు స్వాగతం



**నిజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాల్లో భాగంగా 'జాగృతి' వారం వారం ఏడాది పొడవునా ప్రత్యేక వ్యాసాలు ప్రచురిస్తుంది. మరుగున పడిన యోధుల గాథలు, ఘట్టాలను సరైన ఆధారాలతో మా కార్యాలయానికి పంపించవలసిందిగా కోరుతున్నాం. ఫొటోలు మరచిపోవద్దు! ఉద్యమకారుల కుటుంబ సభ్యులకు, ప్రత్యక్ష సాక్షులకు మా ప్రత్యేక విన్నపం.**

మెయిల్: jagritiweekly@gmail.com




# నిజాంపై నారీ భేరి

దశాబ్దాల ఉద్యమ ఫలితమే పరపాలకుల నుంచి తెలంగాణకు విముక్తి. ఈ ధీరోచిత పోరాటం నెలల తరబడి కొనసాగింది. పలు రకాల దోపిడీలు, అణచివేతలకు నిరసనగా తిరుగుబాటు, సాయుధ పోరు చరిత్రపుటలకెక్కి ఈనాటికీ మహోత్తేజం నింపుతోంది. నిరంకుశ నిజాం పాలనను వ్యతిరేకిస్తూ హైదరాబాద్ సహా ఖమ్మం, మెదక్, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్ ప్రాంతాల్లో సమరభేరి నినాదం ప్రతిధ్వనించింది. అరాచకాల పనిపట్టిన తెలంగాణ సమాజం పరిపూర్ణ జనస్వామ్య వ్యవస్థగా వెలుగొందడానికి ఎన్నింటినో ఎదుర్కొంది. ఆ అనుభవాలు, పరిణామాలు ఇన్నీఅన్నీ కావు. 'హింస పాపమని ఎంచు దేశాన హిట్లరిత్వం ఇంకెన్నాళ్లు' అని గర్జించారు కాళోజీ. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ నినదించారు దాశరథి. 'ఈ భూమి నీదిరా, ఆ నిజాం ఎవడురా' అని ప్రశ్నాస్త్రం ప్రయోగించారు సుద్దాల. కలాలూ గళాలూ ఖడ్గాలుగా మారి కదం తొక్కడంతో నియంతృత్వం తోకముడిచింది. ఇందులో మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి, ఇంకా అజ్ఞాత వీరనారీమణులు మరెందరో!!


ఐలమ్మ


కమలాదేవి

దేశమంతటా స్వాతంత్ర్య సంరంభం. నిజాం సంస్థాన పరిధి ప్రాంతంలో మాత్రం విరుద్ధ వాతావరణం. అప్పట్లో హైదరాబాద్ కేంద్రంగా పరిపాలించిన నిజాంరాజు సమస్తాన్నీ ఆక్రమించడానికి రజాకార్లను ఉసిగొల్పడమే హింసకు దారితీసింది. బలవంతపు వసూళ్లు, పల్లెలపై తెగబడి దోపిడీ సాగించడాలు, గృహదహనాలు నిత్యకృత్యంగా మారాయి. నిరసనాగ్ని మొదట నల్గొండలో రేగి, అటు తర్వాత అంతటా విస్తరించింది. సాయుధ పోరాట యోధులు ఒకరా ఇద్దరా...అనేకమంది! ఎవరి స్థాయిలో వారు, ఎవరి మార్గంలో వారు, ఎవరి పంథా వారిదీ!! ఆ ఉద్యమాగ్ని సర్వత్రా వ్యాపించి, భారత ప్రభుత్వ స్పందన చర్యకు మూలమైంది.


నిజాం సంస్థానమంతా ఇండియన్ యూనియన్‌లో లీనమవడానికి కారకులైన ధీరవనితలు సదా ప్రాతఃస్మరణీయులు. రజాకార్ల దౌర్జన్యాలను నిలువరించడానికి ఆ రోజుల్లోనే అతివల గెరిల్లా దళాన్ని స్థాపించారు ఆరుట్ల కమలాదేవి. పోలీసులు తూటాల వర్షం కురిపించినా లెక్కచేయకుండా ముందుకు దూకారు. సమరంగాన నిలిచి, ముష్కరుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. మహాసభల్లో ప్రసంగాలతో కార్యకర్తలందరినీ కార్యోన్ముఖుల్ని చేశారు. పలుసార్లు కారాగారాలపాలైనా పట్టు వీడలేదు, మడమ తిప్పలేదు. చల్లూరు పరిసరాల్ని రిజర్వు దళాలు చుట్టుముట్టి కాల్పులు సాగిస్తుంటే, గుట్టల మాటున నక్కి తుపాకుల మోత మోగిస్తుంటే,

అదరకుండా బెదరకుండా ముందు నిలిచారామె. తమ బృందానికి ఎక్కడా ఎటువంటి హాని కలగకుండా కవచంలా ఉన్నారు. ఉద్యమబావుటా పట్టిన ఆమె ఏనాడూ వెనుదిరగలేదు. పట్టిన ఆయుధాన్ని పక్కన పెట్టనూ లేదు. ఆమె పోరాట పటిమ పోలీసులనే ఉక్కిరిబిక్కిరి చేసింది. హైదరాబాద్‌తో పాటు వరంగల్‌లో జైలు జీవితం ఆ యోధురాలి ఉక్కు సంకల్పాన్ని మరింత పెంచింది. స్త్రీ శక్తి అంటే ఏమిటో, లక్ష్య సాధనకు ఎంతగా తెగిస్తుందో కనబరచిన దీక్షాదక్షతలు చాలా గొప్పవి. అందుకే రుద్రమగా కీర్తి గడించారు. తెలంగాణ వీరనారిగా తరతరాలకూ చెక్కు చెదరని ఖ్యాతిని సొంతం చేసుకున్నారు కమలాదేవి.

ఆ ఆదర్శనీయ మాటల్లో చేతల్లోనూ సాహసం ప్రతిఫలించేది. దండి సత్యాగ్రహ స్ఫూర్తి, విద్యాభ్యాస కాలంలో వెల్లివిరిసిన స్వేచ్ఛా దీప్తి, మహాసభలూ కీలక సమావేశాల్లో నాయకరీతి కమలాదేవిని రణోన్ముఖం చేశాయి. పోరు యోధుల ఆత్మ బలిదానాలు నిరంతరం మదిలో మెదులుతుంటే, ప్రచండ శక్తిగా తనను తాను రూపుదిద్దుకున్నారు. స్థానిక భాషల్ని, సంస్కృతుల్ని అవమానపరిచే దుష్కృత్యాలను అత్యంత సాహసోపేతంగా ఎదుర్కొన్నారు. బానిసత్వాన్ని, బానిసతత్వాన్ని సహించకుండా అన్ని దశల్లోనూ ఎదురుతిరిగారు. ఆ ధీరురాలి మాటలూ చేతలే ప్రజలను ఉత్తేజితులను చేశాయి. రజాకార్ల మూకలను ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ తిప్పికొట్టారు. అప్పంపల్లి, నిర్మల్, సిర్పూర్, మంథని, మల్లారెడ్డిగూడెం, ఇందూరు తదితర ప్రాంతాల్లో విముక్తోద్యమం ఉవ్వెత్తున కొనసాగింది. ఇదే సందర్భంలో నల్గొండ ప్రాంతానికి సంబంధించి చాకలి ఐలమ్మ పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించాలి. ముఖ్యంగా విసునూరు పరిసరాల్లో ఆమె పాలకుల గుండెల్ని దడదడలాడించారు. మల్లారెడ్డిగూడెంలో అలుగుల వీరమ్మ ఎంతైనా సాహసి. తుపాకులకు ఎదురొడ్డిన యోధ. వీటన్నింటి నేప థ్యంలో, కదలను పాక ప్రాంతాన్ని స్థావరంగా చేసుకున్న కమలాదేవి అక్కడి వారందరినీ ఎంతగానో జాగృత పరచారు.

**'నిజామనగా ఎంత... వాడి తాహతెంత?**

ఓ నిజాము పిశాచమా! కానరాదు నిను బోలిన రాజు!!'



జంధ్యాల శరత్‌బాబు
సీనియర్ జర్నలిస్ట్


ఇటువంటి వాక్యాలే అంకుశాలై దుష్పరిపాలనను తూట్లు పొడిచాయి. మెదక్ ప్రాంతం జోగిపేటలో మహాసభ, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 'వందేమాతరం' ఆలాపన, వీటితో పాటు నాయకీమణుల వ్యూహ చాతుర్యం విమోచనోద్యమానికి బాసట అయ్యాయి. ప్రజల భావవ్యక్తీకరణపై ఆంక్షలు, వెట్టిచాకిరి ద్వారా శ్రమశక్తిని దోచుకోవడం, ప్రతీకార వైఖరితో పోలీసు దళాల్ని అడ్డగోలుగా వినియోగించటం– వనితానేతల ఆగ్రహావేశాలకు కారణాలయ్యాయి. భూమి, భుక్తి కోసమే పోరాటాలు నడిచాయి. ఈ అన్ని సందర్భాల్లోనూ ముదితలదే నేతృత్వం అనేసరికి తప్పనిసరిగా గుర్తుకొచ్చే పేరు మల్లు స్వరాజ్యం.

నా మాటే తుపాకీ తూటా – ఈ ఆత్మకథ కర్త స్వరాజ్యం. రాతలోనే కాదు, చేతలోనూ దిట్ట. అందువల్లనే నిజాం రాజులు గజగజ వణికారు. రజాకార్లు అదిరిపోయి, బెదిరిపోయి పరుగులంకించుకున్నారు. క్రియాశీలతకు మారు పేరైన ఆమె–ఒకటీ రెండు కాదు... మూడేళ్లకు పైగా వియుక్తోద్యమం కొనసాగించారు. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ ప్రాంతాలు గిరిజనులను సమీకరించి నిరంకుశుల మీద సమరం ప్రకటించారు. ఆ మార్గంలో తాను ఎంచుకున్నది పాటనే. జానపదానికే వన్నె తెచ్చిన ఉయ్యాలోపాట గుర్తుండే ఉంటుంది.

**'ఒర్వదీ ప్రభుత్వంబు ఉయ్యాలో**
**పాత సూర్యాపేట ఉయ్యాలో**
**పోరాటమును చూడు ఉయ్యాలో**
**ప్రజల బలమును చూసి ఉయ్యాలో**
**పారిపోయిరి వాళ్లు ఉయ్యాలో!'**

ఇటువంటి పాటలే ఈటెలయ్యాయి. స్వరాజ్యం గొంతులో పదునెక్కాయి. ఈమెది సూర్యాపేట ప్రాంతంలోని కొత్తగూడెం. సోదరుడి స్ఫూర్తితో పోరుబాట పట్టారు. పల్లె సీమల్లో ప్రసంగాల ద్వారా ప్రజల్ని ఉర్రూతలూపారు. ఆమె ఆధ్వర్యంలోనే వందల కొద్దీ మహిళలు సాయుధ శిక్షణ అందుకున్నారు. 'దొరల' అహంకారాన్ని తునాతునకలు చేసింది వారి పోరాట పటిమే! పల్లెల్లో ఉద్యమమంటే కొలనుపాకను తప్పకుండా ప్రస్తావించాలి. అది ఆలేరుకు సమీపంలోని గ్రామం. చుట్టూ ఉన్న మరికొన్ని ఊళ్లు సైతం జాగీరు పాలనలోనివే. అక్కడి జాగీర్దారు చేయని అకృత్యాలంటూ లేవు. కొంతకాలానికి తిరుగుబాటు చోటు చేసుకుంది. గ్రామాల వారీగా రైతులందరూ ఒక్కటై ఉద్యమం సాగించడం తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రధానదశ. మల్లు స్వరాజ్యం నాయకత్వ దక్షత ఎందరెందరినో ముందుకు నడిపింది.

మరొక యోధురాలు కొంజేటి సత్యవతి. నల్లమలలోని ఒక దళానికి నాయకురాలు. పెత్తందార్ల పనిపట్టిన, వాళ్ల దురగాతాల ఆటకట్టించిన సాహసి



కురాలు. రంగక్కగా అందరికీ తెలుసు. పదిహేనేళ్ల ప్రాయంలోనే సాయుధ దళ కమాండర్ అయ్యారు. మహబూబ్‌నగర్, చంచల్‌గూడ జైళ్లలో శిక్ష అనుభవించారు. ఆ సమయంలోనూ హక్కుల సాధనకు సహఖైదీలతో కలిసి ఉద్యమించారు. రెండేళ్లయినా నిండని పసికందుతో జైలు జీవితం గడపాల్సి వచ్చింది.


ఎందరు ఎంతగా బాధించినా, నానా విధాలుగా హింసించినా బెదరని తత్వం ఆమెది. అచ్చంపేట, అమ్రాబాద్‌లను నిరంకుశుల నుంచి విడిపించడానికి ఎంతగానో పోరాడారు. ఓ రోజు... నల్లమలలో గుట్ట దగ్గర తలదాచుకున్న ఆమెకు తూటాల మోత వినిపించింది. కాసేపట్లోనే పోలీసు బలగం చుట్టుముట్టింది. 'కాళ్లూచేతులూ ఆడలేదు. రైఫిల్‌తోనే అక్కడి నుంచి ఉరికిన, ఎక్కడికి పోతున్ననో తెల్వటం లేదు. దళం వాళ్లమంతా అప్పటికే చీలినం. ఆ రోజంతా అడవిలోనే ఒంటరిగా దాక్కొని ఒక గూడేనికి చేరిన. అక్కడివాళ్లు నా కాళ్ల గాయాలకు లేపనం పూసి, నన్ను మనిషిని చేసిన్రు' అంటూ అప్పట్లోనే తన అనుభవాన్ని వివరించారామె.

బడబాగ్నిలా రగిలిన విప్లవాగ్ని ఐలమ్మ. ప్రజా పోరాటస్ఫూర్తి. తూర్పు గూడెంలో పుట్టిన వీరవనిత. సిద్ధాంత నిబద్ధత కలిగిన వ్యక్తి. రాయపాడు, అనాసపురం, భక్తవత్సలాపురం గ్రామాలవారిని ఏకం చేసిన వనితానేత. ఖమ్మం మహాసభకు చిన్ననాటనే హాజరైన క్రియాశీలి. తెలంగాణ విముక్తోద్యమంలో ఈమె కుటుంబీకులెందరో ఉన్నారు. మహబూబాబాద్ ప్రాంతం నైనాల గ్రామవాసి కమలమ్మ. ఇంటి పేరు చెన్నబోయిన. జానపద గీతికలతో జనచైతన్యం పెంచిన కళాకారిణి కూడా. విశిష్ట వనిత కాబట్టే ఈమె చరిత్ర తెలంగాణ పాఠ్యపుస్తకాల్లో చోటు చేసుకుంది. పలు నిర్బంధాలు ఎదుర్కొని అటు తర్వాత అజ్ఞాత జీవితం గడిపిన వ్యక్తి పద్మ. 'బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి' పాటను అంతటా ప్రచారంచేసిన గత చరిత్ర ఉంది. **'సుట్టు ముట్టూ సూర్యపేట, నట్టనడుమ నల్లగొండ; నువ్వుండేది హైదరాబాదు, దానిపక్క గోలుకొండ; గోలుకొండ ఖిల్లా కింద నీ గోరికడతం'** అంటూ ఉద్యమావేశాన్ని రగుల్కొలిపిన నారి. వీరందరినీ స్మరించుకోవడమే పౌరులుగా మన కర్తవ్యం, ధర్మం. ★



# తెలంగాణ రైతాంగ పోరాటం

## 1946-1951




జనగామ తాలూకాలోని 'దొర' విసునూరు రామచంద్రారెడ్డి ఆగడాలే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఆరంభం కావడానికి తక్షణ కారణమైనాయని చరిత్రకారులు చెబుతారు. ప్రజలకు కంటగింపుగా మారిన ఈ దేశ్‌ముఖ్ ఆగడాలు చరిత్ర ప్రసిద్ధి చెందాయి. చాకలి ఐలమ్మ అనే బడుగు వర్గాల మహిళ భూమిని ఆక్రమించడానికి ఈ భూస్వామి మనుషులు ప్రయత్నించడంతో ఘర్షణ మొదలయింది. మిగిలిన చిన్న రైతులు ఆమెకు అండగా నిలిచారు. ఈ క్రమంలోనే రామచంద్రారెడ్డి తన ఆగడాలను విస్తృతం చేశాడు. జూలై 4,1946న భూస్వామి అరాచకాలకు నిరసనగా స్థానిక 'సంఘం' నాయకుడు  దొడ్డి కొమరయ్య అనే రైతు నాయకత్వంలో వరంగల్ జిల్లాలోని కడివెండిలో రామచంద్రారెడ్డి ఇంటి దిశగా దాదాపు వేయి మంది రైతులు నిరసన ఊరేగింపు తీశారు. రైతుల ఊరేగింపు మీద హఠాత్తుగా తుపాకులు పేలాయి. కొమరయ్య అక్కడికక్కడే చనిపోయాడు. ఆయన సోదరుడు మల్లయ్య కాలికి తూటా తగిలింది. మరొక ఇద్దరు కూడా గాయపడ్డారు. సాధారణంగా ఇలాంటి ఎదురుదాడి జరిగితే అంతా పారిపోవడం సహజం. కానీ కొమరయ్య మరణ వార్త తెలిసి దాదాపు రెండు వేలమంది పోగుపడ్డారు. నిరసన ప్రదర్శన రామచంద్రారెడ్డి ఇంటి వైపు సాగింది. భూస్వామి ఇంటిని చుట్టుముట్టారు. ఇదే తెలంగాణ సాయుధ పోరాటానికి ఆరంభం. ఇది ఆధునిక భారతదేశంలో జరిగిన అతి పెద్ద సాయుధ పోరాటంగా చరిత్రకు ఎక్కింది. వరంగల్, నల్లగొండ మొదట ఉద్యమానికి ఊతమిచ్చాయి. దేశ్‌ముఖ్‌లకీ, పట్వారీలకీ తోడు నిజాం ప్రభుత్వం, అందులోనే భాగమైన కాశీం రజ్వీ సేన రజాకార్ల పీడ కూడా రైతాంగాన్ని వేధించింది. సాయుధ పోరాటానికి హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్, సోషలిస్టులు కూడా మద్దతు ఇచ్చారు. సెప్టెంబర్ 17, 1948 నాటికి నిజాం విముక్తమైంది.


ఈ సాయుధ పోరాటం పతాక స్థాయికి చేరుకున్న సమయానికి 15,000 చదరపు మైళ్ల విస్తీర్ణంలోని ముప్పయ్ నుంచి నలభయ్ లక్షల మంది ప్రజల మీద దాని ప్రభావం కనిపించింది. రెండు వేల నుంచి మూడు వేల గ్రామాల మీద రైతుల ఆధిపత్యం ఏర్పడింది. 2000 మంది గెరిల్లా పోరాట యోధులతో, దాదాపు 10,000 మంది మద్దతుదారులతో ఉద్యమం సాగింది. చివరికి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాన్ని అక్టోబర్ 21, 1951న విరమించింది.

ఇది ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నడిపిన ఉద్యమమే. ఈ నాయకులంతా ఒకప్పుడు నిజామాంధ్ర మహాసభలో పనిచేసినవారేనన్నది విస్మరించలేం. కానీ, తమ ఆధ్వర్యంలో జరిగిన ఇంత పెద్ద పోరాటాన్ని అక్షరబద్ధం చేసే సమయం వచ్చే సరికి కమ్యూనిస్టు పార్టీ ముక్కలైంది. ఆ రాజకీయాలు ఈ చరిత్ర నిర్మాణం మీద పడిందన్న సంగతి కూడా గుర్తుంచుకోవాలి. దాదాపు ముప్పయ్ ఏళ్ల తరువాత మాత్రమే ఈ పోరాటం మీద పూర్తి స్థాయి గ్రంథాన్ని పేవియర్ రాశారు. అంతకు ముందు సీపీఎం నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య (1972), సి.హెచ్. రాజేశ్వరరావు, (1972), రావి నారాయణ రెడ్డి (1973), రాజ్‌బహదూర్ గౌర్ (1973) (ఈ ముగ్గురు సీపీఐ) కూడా పుస్తకాలు వెలువరించారు. పేవియర్ చరిత్ర అంతా సీపీఐ ఎంఎల్‌కు చెందిన డీవీ రావు రచన మీద ఆధారపడి ఉందని చెబుతారు. కాబట్టి ఈ మూడు వర్గాల అభిప్రాయాలు ఒకటి కాలేవు. పైగా ఈ ఉద్యమం మీద తెలంగాణ సామాజిక, రాజకీయ పరిస్థితులే కాకుండా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం కూడా ఉంది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో మార్పు అంటే, అందుకు భారత్‌లోని కమ్యూనిస్టు ఉద్యమం మినహాయింపు కాదు. తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమానికి రెండు దశలు ఉన్నాయి. మొదటి దశ 1946 జూలై నుంచి 1948 సెప్టెంబర్ వరకు. రెండో దశ 1948 సెప్టెంబర్‌లో భారత సైన్యం నిజాం రాజ్యం మీదకు వచ్చిన తరువాత రెండోదశ మొదలయింది.

దొడ్డి కొమరయ్య మరణం 300 నుంచి 400 గ్రామాలను కుదిపేసింది. ప్రజలంతా గ్రామాలలో ఏకమై వెట్టి గురించి, జమీందార్లకు చెల్లించే శిస్తుల గురించి చర్చించుకున్నారు. కొమరయ్యను కాల్చి చంపిన కడివెండి గ్రామానికి దగ్గరే ఉన్న ఒక గ్రామంలో రెండు వందల ఎకరాలను స్వాధీనం చేసుకుని పేదలకు పంచారు ఉద్యమకారులు. కానీ ఇది పెద్ద ప్రక్రియ. జమీందార్ల భూములను ఆక్రమించడం, పేదలకు పంచడం, వాటిని వారు నిలబెట్టుకోవడం పెద్ద సమస్య కాబట్టి, ఇంటికి ఒక పురుషుడు వంతున ఉద్యమంలోకి వచ్చారు. ఇక నిజాం ప్రభుత్వం దేశ్‌ముఖ్‌లు, జమీందార్ల వెనకే ఉంది. ఈ ఘర్షణ 1942 నుంచి మొదలయింది. గ్రామ రాజ్యాలు ఇదంతా పర్యవేక్షించేవి. జనంలో ఐక్యత కూడా పటిష్టంగా ఉంది. 1946 నవంబర్‌లో మట్టారెడ్డి అనే రైతును జమీందార్ల మనుషులు చంపితే వేలాది మంది అంత్యక్రియలకు హాజరై సంఘీభావం ప్రకటించారు. గెరిల్లా పోరాట పంథాలో ఉద్యమం సాగింది. ఊరి మధ్యలో ఒక పెద్ద డప్పు ఉంచేవారు. ప్రమాదం ముంచుకు వస్తుంటే దానిని మోగించేవారు. పురుషులు, స్త్రీలు అంతా వచ్చి ఎదురు నిలిచేవారు. రాళ్లు, కారం కూడా ఆయుధాలుగా ఉపయోగించారు. కరపత్రాలు, పాటల బృందాలు, బుర్రకథ దళాలు, గొల్లసుద్దుల ద్వారా ఉద్యమ ప్రచారం జరిగింది.

నవంబర్ 1946లో సీపీఐని నిషేధించారు. దానితో రైతాంగ పోరాటానికి విరామం వచ్చింది. నిజాం ప్రభుత్వం గ్రామాలలో ఏర్పాటు చేసిన సాయుధ భటుల శిబిరాలను తొలగించింది. దీనితో ఆంధ్ర సీపీఐ నాయకత్వం సాయుధ పోరాటాన్ని ఉధృతం చేయాలని నిర్ణయించింది. ఆగస్ట్ 15, 1947 దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కానీ సంస్థానాలకు బ్రిటిష్ ప్రభుత్వం ప్రత్యేక అవకాశాన్ని కల్పించింది. ఆ మేరకు నిజాం, మైనారిటీ వర్గం, అంటే ముస్లింలు స్వతంత్ర రాజ్యంగా కొనసాగాలని అనుకున్నారు. నిజాం సంస్థానంలోని కాంగ్రెస్ వాదులు హైదరాబాద్ భారత్ యూనియన్‌లో విలీనం కావాలని సత్యాగ్రహాలు ఆరంభించారు. ఇదే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మార్గం ఏర్పరించింది.





సీపీఐకి కూడా మద్రాస్ ప్రెసిడెన్సీలోని తెలుగు ప్రాంతాలు, హైదరాబాద్ ప్రాంతాన్ని విలీనం చేసి విశాలాంధ్ర నిర్మించాలన్న ఆలోచన ఉంది.


అయితే భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత గ్రామీణ తెలంగాణకు రజాకార్ల పీడ పతాక స్థాయికి చేరుకుంది. 1948 ఆగస్ట్ నాటికి పనిచేస్తున్న రజాకార్ల సంఖ్య దాదాపు లక్ష. ఆగస్ట్ 15, 1947 తరువాత 13 మాసాలు నిజాం స్వతంత్రంగా ఉన్నాడు. ఆ కాలంలో రజాకార్లు చేసిన అత్యాచారాలు మానవ చరిత్రకే కళంకం. 1948 మధ్య కాలానికి ఉద్యమం కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు పాకింది. అలాగే కృష్ణా, గుంటూరు సరిహద్దులలో కూడా విస్తరించింది. అప్పటికి 20 మంది వంతున 50 నుంచి 60 గ్రామాలలో బృందాలు పనిచేస్తున్నాయి. భారత సైన్యం రాక మీద కమ్యూనిస్టులలో భిన్నాభిప్రాయాలు వచ్చాయి. 1948లో సీపీఐ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన బీటీ రణదివే సాయుధ పోరాటాన్ని కొనసాగించాలన్న పంథాలో నడిచారు. అయితే 1950లో చండ్ర రాజేశ్వరరావు ఆ పంథాను మార్చారు. 1935 నుంచి 1948 వరకు పార్టీ కార్యదర్శిగా పని చేసిన పూరన్ చంద్ జోషి కూడా సాయుధ పోరును విరమించాలని గట్టిగానే పార్టీలో ప్రచారం చేశారు. 1951లో ఆచార్య వినోబా భావే నిర్బంధంలో ఉన్న అనేక మంది కమ్యూనిస్టు కార్యకర్తలతో మాట్లాడారు. వారిని విడిపించడానికి హామీ ఇచ్చారు. పార్టీ సెంట్రల్ కమిటీ పోరాటాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది నాయకులు పార్లమెంటరీ రాజకీయాలలోకి వచ్చారు. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల నుంచి పోటీ చేసిన చాలామంది విజయం సాధించారు. నిజానికి ఈ ఉద్యమం ప్రభావం పట్టణ, నగర ప్రాంతాలను తాకలేదు. జైలు నుంచి విడుదలైన వెంటనే ఎన్నికల రంగంలో దిగిన పోరాట ఉద్యమ నాయకుడు రావి నారాయణరెడ్డి దేశంలోనే అత్యంత ఎక్కువ మెజారిటీ సాధించారు. జనవరి 26, 1950న సివిల్ సర్వెంట్ ఎంకె వెల్లోడికి ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించారు. 1952లో డాక్టర్ బూర్గుల రామకృష్ణరావు హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికయ్యారు. ★



నిజాం విముక్త స్వాతంత్ర్య అమృతోత్సవాలు

# సమాఖ్యకు సలాం!

సెప్టెంబర్ 17, 1948.. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో కలిసిన రోజు. ఆగస్ట్ 15, 1947న బ్రిటీష్ పాలన అంతమై భారతదేశమంతటా స్వాతంత్ర్య సంబరాలు జరుపుకున్నారు. కానీ హైదరాబాద్ సంస్థాన ప్రజలకు ఆ అదృష్టం లేకుండా పోయింది. అప్పటి వరకూ బ్రిటీష్ వారికి సామంతుడిగా ఉన్న హైదరాబాద్ నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్.. తమది స్వతంత్ర రాజ్యమని, హైదరాబాద్ అటు భారత్‌లో, ఇటు పాకిస్తాన్‌లోనూ కలవదని ప్రకటించాడు. అప్పటికే నిజాం రాజు ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా పేర్గాంచాడు. ఆనాడే 236 బిలియన్ల సంపద కలిగి ఉన్నాడు. ఐదు టన్నుల బంగారమూ ఆయన వద్ద ఉంది. హైదరాబాద్ సంస్థానం స్వతంత్రంగా ఉండటానికి నిర్ణయించుకున్నట్లు ఆయన 1947లో ఫర్మానా కూడా జారీ చేశాడు.



కాసిం రజ్వీ

కానీ సంస్థానంలోని ప్రజలు తాము భారత దేశంలో కలవాలని కోరుకున్నారు. ఎందుకంటే దోపిడీ దొంగలు, కిరాయి హంతకులు, మానవ మృగాలకి ఏమాత్రం తీసిపోని విధంగా రజాకార్ల నాయకుడు కాసిం రజ్వీ తయారుచేసిన రజాకార్లు తీవ్ర భయానక వాతావరణం సృష్టించారు. గ్రామాలపై పడి ప్రజలను దోచుకొని, హత్యా కాండను కొనసాగించారు. వారి చేతిలో వేలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. నిజాం నిరంకుశ పాలన గురించి, రజాకర్ల అకృత్యాల గురించి, వాటిని ఎదుర్కోవడానికి జరిగిన తెలంగాణ సాయుధ పోరాటాల గురించి నేటితరం కచ్చితంగా తెలుసుకోవాలి. నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎందరో వీరుల ప్రాణత్యాగాల ఫలితమే.

హైదరాబాద్‌తో పాటు మరాఠ్వాడా, కర్ణాటక



కొచ్చిన్‌లో ఐఎన్‌ఎస్ విక్రాంత్
యుద్ధ విమాన వాహక నౌకను
జాతికి అంకితం చేసిన మన ప్రియతమ ప్రధాని
గౌ॥ నరేంద్ర మోదీ గారికి
(సెప్టెంబర్ 17)
72వ జన్మదిన
శుభాకాంక్షలు...
&
తెలంగాణ విమోచన
అమృత మహోత్సవ
(సెప్టెంబర్ 17)
శుభాకాంక్షలు...
సామ రంగారెడ్డి
రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షులు, బిజెపి, తెలంగాణ
సామ రంగారెడ్డి యువసేన - ఎల్‌బి నగర్ నియోజక వర్గం, రంగారెడ్డి జిల్లా




ప్రాంతాలు నిజాం నవాబు పాలనలో ఉండేవి. దేశం మధ్యలో ఉన్న సువిశాల ప్రాంతం భారత యూనియన్‌లో చేరకపోతే అది దేశ మనుగడకే ముప్పు అని భావించిన నాటి హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్‌పటేల్ హైదరాబాద్ సంస్థానంపై సైనిక చర్యకు దిగాలని నిర్ణయించారు. పరిస్థితిని ముందే ఊహించిన నిజాం నవాబు పాకిస్తాన్ సాయం కోసం వర్తమానం పంపడంతో పాటు, ఐక్యరాజ్య సమితిని ఆశ్రయించాడు.

నిజాం నవాబుతో చర్చల ద్వారా ఈ సమస్యని పరిష్కరించుకుందామని భారత తొలి ప్రధాని నెహ్రూ అనుకున్నారు. కానీ సైనికచర్య ద్వారా వెంటనే నిజాం సంస్థానాన్ని స్వాధీనం చేసుకొని భారత్‌లో విలీనం చేసి రజాకార్లని అరికట్టడం అత్యవసరం అని నాటి హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్‌పటేల్ పట్టుపట్టి నెహ్రూని ఒప్పించారు. భారత ప్రభుత్వం తమపైకి యుద్ధానికి సిద్ధం అవుతోందని తెలిసిన నిజాం నవాబు ఉస్మాన్ అలీఖాన్ ఏ మాత్రం వెనక్కి తగ్గకుండా అందుకు తాము కూడా సిద్ధమేనని ప్రకటించడంతో భారత్–నిజాం సేనల మధ్య యుద్ధం అనివార్యమైంది.

**‘ఆపరేషన్ పోలో’ విజయవంతం**

సెప్టెంబర్ 13, 1948న భారత సైన్యం ‘ఆపరేషన్ పోలో’ పేరిట హైదరాబాద్ సంస్థానాన్ని ముట్టడించింది. దీనికి ‘పోలీస్ యాక్షన్’ అనే పేరు కూడా ఉంది. ఈ సైనిక చర్య కేవలం ఐదు రోజుల్లోనే ముగిసిపోయింది. భారతసేనల ధాటికి తట్టుకోలేక నిజాం నవాబు లొంగిపోతున్నట్లు ప్రకటించాడు.

హైదరాబాద్ నలువైపుల నుంచి భారత సైన్యం ముట్టడిని ప్రారంభించింది. ముందుగా మహారాష్ట్ర వైపు నుంచి అన్ని గ్రామాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దీనికి నల్‌దుర్గ్ అనే సైన్యాధికారి నాయకత్వం వహించారు. సెప్టెంబర్ 14న ఔరంగాబాద్, జాల్నా, నిర్మల్, వరంగల్, సూర్యాపేటను అధీనంలోకి తీసుకొని హైదరాబాద్ వైపు వచ్చారు.

తుల్జాపూర్, తల్ముమడి నుంచి బయల్దేరిన సైన్యానికి జనరల్ డీఎస్ బ్రార్ నాయకత్వం వహించారు. మద్రాస్ వైపు నుంచి వచ్చిన సైన్యానికి ఎ.ఎ. రుద్ర, కర్ణాటక వైపు నుంచి వచ్చే సైన్యానికి బ్రిగేడియర్ శివదత్త నాయకత్వం వహించారు. హైదరాబాద్‌కు నలుదిశల నుంచి భారత సైన్యం ఒక్కో గ్రామాన్ని అధీనంలోకి తీసుకుంటుంటే.. ఆయా గ్రామాల్లోని ప్రజలు సైన్యానికి స్వాగతాలు పలికారు. భారత సైన్యం ముందు రజాకార్లు, నిజాం సైన్యం ఎదురు నిలవలేకపోయింది. మూడు రోజుల్లోనే దక్కన్ భాగాన్ని పూర్తిగా భారత సైన్యం స్వాధీనం చేసుకుంది.

16వ తేదీ మధ్యాహ్నానికి భారత సైన్యం హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో మోహరించింది. భారత సైనిక సంపత్తికి భయపడి నిజాం సైన్యం ప్రధానాధికారి ఇద్రూస్ లొంగిపోయాడు. సెప్టెంబర్ 17న సాయంత్రం సుమారు 5 గంటల సమయాని కల్లా భారత ఆర్మీ హైదరాబాద్‌ను పూర్తిగా తన అధీనంలోకి తీసుకుంది. కాసేపటికి ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ భారత ప్రభుత్వానికి

# వివాదం ఎక్కడ మొదలైంది?

**భా**రత యూనియన్‌లో చేరేది లేదని నవాబు 1947లో ఫర్మానా విడుదల చేయటంతో హైదరాబాద్ స్టేట్ భవిష్యత్తుపై సందిగ్ధతకు బీజాలు పడ్డాయి. ఆ తర్వాత భారత్, పాకిస్తాన్ దేంట్లోనూ చేరబోదని ఆగస్ట్ 8న నిజాం చేసిన ప్రకటనతో తేటతెల్లమైంది. గవర్నర్ జనరల్‌గా ఉన్న మౌంట్‌బాటన్ చాలా చెప్పి చూశారు. స్వతంత్రంగా ఉండటం అసాధ్యమని, చివరకు అన్ని అధికారాలు పోవటం ఖాయమని కూడా హెచ్చరించారు. బ్రిటిష్ అధికారుల నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపిద్దామని కూడా



మేజర్ జేఎన్ చౌదురికి నిజాం సైన్యం లొంగుబాటును ప్రకటిస్తున్న సైనికాధికారి

బాటన్ ప్రతిపాదించారు. నవాబు ససేమిరా అన్నారు. సంస్థానాల్లో ప్రజాభిప్రాయ సేకరణ అన్నది ఆనాటి కాంగ్రెస్ విధానంలో ఒక భాగం. సంస్థానాల్లో భిన్న మతాలకు చెందిన ప్రజలున్న చోట దీన్ని ఇంకా బలంగా నొక్కిచెప్పారు. కశ్మీర్‌లో కూడా ప్రజాభిప్రాయ సేకరణకు అందుకే అంగీకరించారు. హైదరాబాద్‌లో ప్రతిపాదన కూడా అందులో భాగమే. సర్దార్ పటేల్ వీటన్నిటికీ అంగీకరించారు. ఏ సంస్థానానికి ఇవ్వని కొన్ని కీలక మినహాయింపులు హైదరాబాద్‌కు ఇచ్చారు. నైజాం–భారత ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం ఇందుకో ఉదాహరణ. విలీనానికి అంగీకరిస్తే బెరార్ ప్రాంతాన్ని హైదరాబాద్ సంస్థానంలో చేర్చే ప్రతిపాదనకు కూడా ఒక దశలో అంగీకరించారు. రజాకార్ల చేతుల్లో కీలుబొమ్మగా మారి నిజాం యథాతథ ఒప్పందానికి తూట్లు పొడవటంతో భారత సైన్యం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా భారత్ కరెన్సీని సంస్థానంలో నిషేధించటం, ఖనిజాల ఎగుమతిపై ఆంక్షలు విధించటం, రైళ్లపై దాడులు, గ్రామాల్లో రజాకార్ల దారుణాలతో పరిస్థితి విషమించింది. 1948 సెప్టెంబర్ 9న సైన్యాన్ని పంపాలని నిర్ణయం తీసుకున్నారు. మూడు వారాల పాటు నిజాం సైన్యాల నుంచి ప్రతిఘటన ఉంటుందని భావించారు. కానీ మూడో రోజుకే నిజాం సైన్యం తోకముడిచింది. ఈ సైనిక చర్యలో మేనన్ అంచనా ప్రకారం 800 మందికి పైగా చనిపోయారు. 108 గంటల్లోనే భారత సైన్యం అదుపులోకి పరిస్థితి వచ్చింది. వీపీ మేనన్ హైదరాబాద్ వచ్చి స్వయంగా పరిస్థితిని అంచనా వేశారు.

నిజాంకు ముస్లింలలో ఉన్న పలుకుబడిని, ఒక




నెహ్రూ మేనన్

సంస్థానంగా హైదరాబాద్‌కున్న ప్రతిష్టను దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగ అధిపతిగా నవాబుని కొనసాగిస్తే బాగుంటుందని పటేల్‌కు మేనన్ సూచించారు. నెహ్రూను సంప్రదించిన తర్వాతే ఏ సంగతి చెబుతానని పటేల్ అన్నారు. ఆ మరుసటి రోజే నెహ్రూ అంగీకారం తెలిపినట్లు పటేల్ మేనన్‌కి చెప్పారు. కక్ష సాధింపు దృష్టితో కానీ, మతపరమైన దృష్టితో కానీ నిజాం నవాబు పట్ల నెహ్రూ–పటేల్ ద్వయం వ్యవహరించలేదు. ★

కోరుట్ల హరీష్

లొంగిపోతున్నట్టు రేడియో ద్వారా ప్రకటించాడు. అలా ఆపరేషన్ పోలో పూర్తైంది. దీంతో రెండు శతాబ్దాల అసఫ్‌జాహీల పాలన అంతమైంది. నాడు హైదరాబాద్ స్టేట్‌కు ప్రధానిగా ఉన్న లాయక్ అలీ తప్పించుకుని పాకిస్తాన్ పారిపోయాడు. రజాకార్ల నాయకుడైన కాసీం రజ్వీ జైలు పాలయ్యాడు. నిజాం సంస్థానంలో ఉన్న ఔరంగాబాద్, నాందేడ్, పర్బనీ, బీడ్ మహారాష్ట్రలో; గుల్బర్గా, బీదర్, ఉస్మానాబాద్, రాయచూర్ కర్నాటకలో విలీనం అయ్యాయి. అందుకే సెప్టెంబర్ 17న తెలంగాణ విముక్త దినోత్సవంగా పాటిస్తున్నాం.





భారత సైన్యానికి స్వాగతం పలుకుతున్న ప్రజలు

**అనంతర పరిణామాలు**

నిజాం లొంగుబాటు అనంతరం చాలా పరిణామాలు చోటుచేసుకున్నాయి. హైదరాబాద్ స్టేట్‌లో పరిపాలన బాధ్యతలను నాటి మేజర్ జనరల్ జేఎన్ చౌదురీకి అప్పగించారు. సైనిక పాలకుడిగా సెప్టెంబర్ 19, 1948న ఆయన బాధ్యతలు చేపట్టారు. కేంద్రంలో రాష్ట్ర వ్యవహారాల శాఖలో కార్యదర్శిగా ఉన్న ఎంకే వెల్లోడిని భారత ప్రభుత్వం డిసెంబర్ 1, 1949న హైదరాబాద్ తాత్కాలిక ముఖ్యమంత్రిగా నియమించింది. సైనిక పాలన అంతమై తాత్కాలిక ప్రజా ప్రభుత్వం మొదటిసారి ఏర్పడింది. బూర్గుల రామకృష్ణారావు, వీవీ రాజు, విద్యాలంకర్‌లు మంత్రివర్గ సభ్యులుగా ఉన్నారు. జనవరి 26, 1950న హైదరాబాద్ స్టేట్‌లో భారత ప్రజాస్వామ్య రిపబ్లిక్ ఉత్సవం నిర్వహించారు. భారతదేశం సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిందని నిజాం చదివి వినిపించారు. అదేరోజున ఆయనను రాజ్‌ప్రముఖ్‌గా భారత ప్రభుత్వం నియమించింది. 1952లో హైదరాబాద్ స్టేట్ శాసనసభకు మొదటిసారి ఎన్నికలు జరిగాయి. బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. 1956 వరకు కొనసాగారు.

రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణతో భాషా ప్రాతిపదికన నవంబర్ 1, 1956న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. హైదరాబాద్ స్టేట్‌లోని మరాఠా ప్రాంతాలైన 5 జిల్లాలను మహారాష్ట్ర, కన్నడ మాట్లాడే మూడు జిల్లాలను కర్ణాటకలో కలిపారు. తెలంగాణలోని 8 జిల్లాలు, మద్రాస్ నుంచి విడిపోయిన ఆంధ్ర రాష్ట్రంలోని జిల్లాలను కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటుచేశారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో జరుగుతున్న అన్యాయంపై ఆరు దశాబ్దాలపాటు అలుపెరగని పోరాటంతో 2014 జూన్ 2న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది.

**విలీనమా? విమోచనమా?**

ఉమ్మడి రాష్ట్రంలో టీఆర్ఎస్ నేతలు సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కానీ అధికారంలోకి రాగానే ఆ ఊసే మరిచారు. దీనికి కారణం ఆ పార్టీకి, అసదుద్దీన్ నేతృత్వంలోని ఎంఐఎంతో ఉన్న దోస్తీనే కారణమని అందరికి తెలిసిందే. మరికొన్ని రాజకీయ పార్టీలు ముస్లిం సంతుష్టీకరణ కోసం ఈ రోజును విమోచనం దినంగా కాకుండా విలీన దినంగా జరుపుకోవాలని చెబుతున్నాయి. నిజాం నిరంకుశ పాలనను అంతమొందించిన సెప్టెంబర్ 17ను భారతీయ జనతా పార్టీ ప్రతి ఏటా తెలంగాణ విమోచన దినోత్సవంగా పాటిస్తోంది. ★



7వ నిజాం – మీర్ ఉస్మాన్ అలీఖాన్



మహారాజా హరిసింగ్

## జమ్ముకశ్మీర్, నిజాం సంస్థానాల ప్రత్యేకత

సెప్టెంబర్ 17, 1948న నిజాం నవాబుకు చెందిన సైన్యం భారత సైన్యానికి లొంగిపోయింది. దీనితో భారత్ నడిబొడ్డున ఉన్న ఒక పెద్ద సంస్థానం చరిత్ర ముగిసింది. దేశంలో జమ్ముకశ్మీర్, నిజాం సంస్థానాలది ప్రత్యేక చరిత్ర. ఆ రెండింటికి సరితూగే సంస్థానాలు ఆనాడు లేవు. 550 పైచిలుకు ఉన్న సంస్థానాల్లో ఆ రెండే భారత నాయకత్వ పటిమను పరీక్షించాయి. ఆగస్ట్ 15, 1947 నాటికి భారత యూనియన్‌లో చేరకుండా విపరీత తాత్సారం చేసి తీవ్ర ఉత్కంఠను, ఉద్రిక్తతను సృష్టించినవి ఈ రెండే. పాకిస్తాన్ అనుకూల శక్తులు ఒక వైపు నుంచి జమ్ముకశ్మీర్‌ను ముట్టడిస్తూ రావటం వల్ల ఆ సంస్థానం మహారాజా హరిసింగ్ అక్టోబర్ 27, 1947న భారత యూనియన్‌లో విలీనం చేయడానికి అంగీకరించారు. కశ్మీర్ మహారాజు లాగానే నిజాం కూడా చివరి వరకూ స్వతంత్రంగా ఉండటానికి ప్రయత్నించాడు. అనివార్య పరిస్థితుల్లోనే ఇద్దరూ విలీనానికి అంగీకరించారు. ★




# ప్రపంచ కుబేరుడి నిరుపేద సంస్థానం



భారతీయుడిగా ఏటా ఆగస్ట్ 15 సందర్భాన్ని నేను తప్పక గుర్తుంచుకుని గౌరవిస్తాను. అదొక అనుభూతి. కానీ నిజాం ఏలుబడి నుంచి తెలంగాణ విముక్తమైన సెప్టెంబర్ 17న ఈ పేరుతో దినోత్సవం జరుపుకుంటే ఆ అనుభూతి ద్విగుణీకృతమవుతుంది. రజాకార్ల అరాచకాల కాలాన్ని చూసిన వారికి ఈ అనుభూతి లోతుపాతులు మనసును తాకుతాయి. ఇందులోని గాఢత 1948 తరువాత పుట్టిన వారికి అర్థం కాకపోవచ్చు. ఆగస్ట్ 15తో పాటు సెప్టెంబర్ 17ను కూడా ఒకనాటి నిజాం సంస్థాన భాగాలైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలు అధికారికంగా జరుపుకుంటున్నాయి. కానీ తెలంగాణలో మాత్రం అనేక కారణాలతో, ప్రధానంగా రాజకీయ కారణాలతో నాయకులు ఈ ఉత్సవాలను నిర్వహించడానికి నిరాకరించడం నిజంగా విషాదం. హైదరాబాద్ సుదీర్ఘకాలం ముస్లిం పాలనలో ఉండిపోయింది. ఆ పాలన హిందువుల మనోభావాలను దారుణంగా గాయపరిచింది. నిజాం అసమర్థతను మంత్రులు, అధికారులు ఆసరాగా చేసుకుని తీవ్రమైన చర్యలకే పాల్పడ్డారు. సంస్థానానికి ప్రధాని లాయక్ అలీ, సైనికదళాల అధికారి ఎల్ ఎడ్రూస్విత్ నాడు చేసిన ఈ పని చూడండి. పాకిస్తాన్ సర్వసైన్యాధ్యక్షుడి సాయంతో, సిడ్నీ కాటన్ అనే పైలట్ సహకారంతో ఆ దేశం నుంచి ఆయుధాలు, మందుగుండు చేరవేయించారు. కరాచీ నుంచి జూన్ 4,1948న వీటిని బీదర్ చేర్చారు. అక్కడ నుంచి పది విమానాలు అపారమైన నిజాం సంపదతో పాశ్చాత్య దేశాలకు వెళ్లాయి. సంపదను దట్టించడానికి విమానాల సీట్లు కూడా తొలగించారు.

ఈ నేపథ్యంతో నిజాం సంపదను అంచనా వేయాలి. ఇంత అపార ధనరాశులు అనేక మార్గాలలో ఆయన వద్దకు చేరాయి. వారసత్వంగా వచ్చినది, భూసంపద, ప్రభుత్వ లాంఛనాలు, ఆభరణాలు– రకరకాలుగా సంపద చేరేది. వీటన్నిటికి మించిన పెద్ద సంపద 'నజర్'. అంటే అధికారులు, తాబేదారులు, సామంతులు చెల్లించుకునే కానుకలు. ఈ సంపద యావత్తు ఈ ప్రాంతానిది లేదా భారత్‌దే. అది ఎన్ని లక్షల కోట్ల రూపాయలు విలువైనదో అంచనాకు అందదు. ఆఖరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్‌ను ప్రపంచ ధనికులలో ఒకనిగా ఫిబ్రవరి, 1937లో టైమ్ మ్యాగజీన్, 1946లో 'లైఫ్' మ్యాగజీన్ ప్రకటించాయి. ఆ వార్తాకథనం కోసం వచ్చిన మార్గరెట్ బర్క్ వైట్ నిజాం అతి పెద్ద భూస్వామి అని రాశారు. ఆ అతి పెద్ద సంస్థానంలో 15 వంతులలో ఒక వంతు నిజాం సొంత ఆస్తి. సంస్థానం మీద వచ్చిన ఆదాయంలో 15 శాతం నిజాం సొంతం. తన ఇద్దరు కుమారుల కోసమని ఖజానా నుంచి ఇంకొంత ధనం వచ్చేది. ఇదంతా కలిపి కోట్ల రూపాయలలో ఉండేది. తమ ఆభరణాలెన్నో నిజాంకే తెలియదు. ముత్యాలెన్నో కొలతకు అందవు. ఒక సమయంలో కింగ్ కోఠి భవనం పైన ముత్యాలన్నీ పరచగా మొత్తం నిండిపోయిందని చెబుతారు. బంగారం నిల్వ చేయడానికి ఇనప్పెట్టెలు చాలేవి కాదు. ఇవన్నీ బర్క్ వైట్ రాసిన విషయాలు. ముంబయ్‌కి చెందిన జర్నలిస్ట్ డీఎఫ్ కరాకా కూడా నిజాం వ్యక్తిగత ఆస్తి విలువ వంద మిలియన్ పౌండ్లని లెక్క గట్టారు. ఇందులో 25,500,000 పౌండ్లు ధనరూపంలో దగ్గరే ఉండేది. ఆభరణాల విలువ 35,000,000 పౌండ్లు. లండన్ టైమ్స్ ఫిబ్రవరి, 1967లో ఇచ్చిన వివరాల ప్రకారం (సంస్మరణ వ్యాసంలో) వార్షికాదాయం 2,500,000 పౌండ్లు. 150 మంది ఒకేసారి భోజనం చేయడానికి కావలసిన పాత్రలు –అంతా బంగారం– ఉండేవి. 1963లో కేంద్ర ప్రభుత్వం బంగారం మీద నియంత్రణ విధించింది. ఆ సమయంలో నిజాం వారసుడు ముఖరమ్ జా 22 టన్నుల బంగారం ఉందని ప్రకటించాడు.

నిజాం చేతిలో ఉన్న భూమి వివరాలు తెలుసుకుంటే కళ్లు చెదురుతాయి. నిజాం సంస్థానం వైశాల్యం 81,698 చదరపు మైళ్లు. నిజాం సంస్థానంలో గ్రామాలు 22457. ఇవి మూడు రకాలు. మొదటి రకం సెర్ఫ్ ఎ ఖాస్. ఇవి 1961 గ్రామాలు. ఇవన్నీ పాలక కుటుంబాల ఆస్తులు. అసలు ప్రభుత్వానికి చెందిన భూములలో 10 శాతం ఈ రకానికి చెందినవే. వీటి మీద ఆదాయం మొత్తం రాచ కుటుంబానిదే. ఇది 55 లక్షల ఎకరాల సాగు భూమి. వీటి నుంచి 25 మిలియన్ రూపాయల వార్షికాదాయం వచ్చేది. కానీ ఈ భూములు జాగీర్లతో పోల్చుకుంటే దుస్థితిలో ఉండేవి. ఇది కాకుండా ఏటా రూ. 70,00,000 రాష్ట్ర ఖజానా నుంచి అందేవి. సంస్థానాన్ని భారత ప్రభుత్వానికి అప్పగించిన తరువాత నెలకు రూ.50,00,000 భూములకు నష్టపరిహారంగా, మరొక రూ. 50,00,000 రాజ భరణంగా ఏటా లభించేది. వీటిలో దేనికీ ఆదాయపు పన్ను లేనేలేదు. నిజాం ఇంత భారీగా ఆదాయం పొందినప్పటికీ సెర్ఫ్ ఎ ఖాస్ గ్రామాలు అత్యంత వెనుకబడి ఉండేవి. రెండోరకం గ్రామాలలోనే పైఘా, సంస్థాన్, జాగీర్, దేశ్‌ముఖ్‌ల భూములు. ఇందులో పైఘా భూములు నిజాం బంధువులు, సన్నిహితులవి. ఈ గ్రామాల సంఖ్య 6535. భూ ఆదాయమంతా వీళ్ల చేతులలోనే ఉండేది. ఆఖరికి ఖల్సా లేదా దివానీ భూమి ఉన్న గ్రామాలు 13961. అప్పుడు ఆస్తి పన్ను ఎక్కువ.




ఆఖరి నిజాం వద్ద ఆభరణాల గుట్టలే ఉండేవి. అవన్నీ మొగలులు, కాకతీయులు, విజయనగర పాలకులు, ఖాందేష్, అహ్మద్ షాహి, నిజాం షాహి, బరీద్ షాహి, కుతుబ్ షాహీ పాలకుల నుంచి వచ్చినవే. ఆఖరి నిజాం 1911లో అధికారంలోకి వచ్చిన నాటికి జాకబ్ వజ్రం సహా ఎన్నో విలువైన ఆభరణాలు, నవరత్నాలు ఉండేవి. వీటి రక్షణకు నిజాం మూడు ట్రస్ట్‌లు ఏర్పాటు చేశాడు. మొదట కింగ్‌కోఠిలోని రాజ ప్రాసాదంలోనే ఉంచినా తరువాత ముంబాయిలోని మెర్కంటయిల్ బ్యాంక్‌లో దాచారు. తాను మరణించిన తరువాత అందులో రెండు ట్రస్ట్‌లలోని ఆభరణాలను కుటుంబ సంక్షేమం కోసం ఉపయోగించాలని వీలునామా రాశాడు.

1944లో నిజాం తీవ్ర అస్వస్థతకు గురైనప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం ఆయన ఆస్తిని తస్కరించాలని పథకం వేసింది. అప్పుడు వాళ్లు కట్టిన విలువ వంద మిలియన్ పౌండ్లు. ఇది నిజాం అధికారిక నివాసం (కింగ్ కోఠి)లోనిది మాత్రమే. అంటే వ్యక్తిగత సంపద. ఢిల్లీలోని ఇండియా ఆఫీస్ అధికారి ఫ్రాన్సిస్ వైలీ అప్పటి వైస్రాయ్ వేవెల్‌కి ఇందుకు సంబంధించిన రహస్యపత్రం ఒకటి పంపించాడు. హైదరాబాద్‌లోనే ఉండే బ్రిటిష్ రెసిడెంట్ 1945 మే మాసంలో పంపించిన 17 పేజీల నివేదిక ప్రకారం కూడా నిజాం వ్యక్తిగత సంపద వంద మిలియన్ పౌండ్లు.

నజర్ పేరుతో నిజాం గుంజుకున్న డబ్బు, వస్తువుల విలువ అసాధారణమైనది. ఇది మొగల్ దర్బారు సంప్రదాయం. ప్రభుత్వ అధికారులు, సైనికాధికారులు, పైఘాలు, జాగీర్దార్లు వారి వారి



డా॥ దేమే రాజారెడ్డి

సామాజిక హోదాను బట్టి నజర్ విలువ ఆధారపడి ఉండేది. ఈద్‌కు, నిజాం జన్మదినానికి ప్రతి ఉన్నతాధికారి నజర్ ఇవ్వాలి. కనీస నజర్ – ఒక బంగారు నాణెం లేదా నాలుగు వెండి నాణేలు. పేరుకు నాణేలే అయినా ఇవి జేబులో వేసుకుని తీసుకువెళ్లేవి కాదు. వాటి బరువు రెండువందల గ్రాముల నుంచి ఉండేది. ఈ నాణేలను వేరేగా తయారుచేయించేవారు. నాణేలే కాకుండా రత్నాలు, పచ్చలు వంటి జాతి రాళ్లు, గుర్రాలు, ఏనుగులు, దుస్తులు , ఆయుధాలు కూడా నజర్ రూపంలో చెల్లించేవారు. సంస్థానం బయటివారికి కూడా ఇది తప్పేది కాదు. ఒకసారి మౌలానా జఫార్ అలీ అనే పండితుడు నిజాంను వచ్చి కలిశాడు. మూడుసార్లు సలాం చేశాడు. కానీ నజర్ ఏం లేదు. దీనితో నవాబు అలీ నజర్ ఏది? అని అడిగాడని చరిత్రకారులు చెబుతారు. 1965 నాటి పాక్ యుద్ధ సమయంలో నిజాం కేంద్ర ప్రభుత్వానికి 33,000 బంగారు నాణేలు ఇచ్చాడం టేనే ఆయన సంపద ఎంతో అర్థమవుతుంది.

పాకిస్తాన్‌లో చేరడానికి మొగ్గు చూపిన నిజాం మొదట్లో ఆ దేశ ప్రభుత్వం కోసం రూ. 20 కోట్లు సమర్పించాడు. నిజాం దక్కన్ ఎయిర్‌వేస్ ద్వారా బంగారం గుట్టలను చేరవేయించాడు. 1918లో టర్కీ ఒట్టోమన్ రాజ్యం పతనమైన తరువాత పాలకుడు రెండో మాజిద్‌కు నెలకు 300 పౌండ్లు వంతున నిజాం పింఛన్ ఏర్పాటు చేశాడు.

1948లో లండన్‌లోని పాకిస్తాన్ హైకమిషనర్ బ్యాంక్ ఖాతాకు హైదరాబాద్ ఆర్థికమంత్రి 35 మిలియన్ పౌండ్లు (రూ. 306 కోట్లు) ఈ డబ్బు (హైదరాబాద్ ఫండ్) బదలీ చేశాడు. ఈ నిధి మీద బిజినెస్ అండ్ ప్రోపర్టీ కోర్ట్స్ ఆఫ్ ఇంగ్లండ్ అండ్ వేల్స్ 2019లో ఇచ్చిన తీర్పు ప్రకారం అది భారత ప్రభుత్వానికీ, నిజాం వారసులకూ చెందుతుంది. ఇది తమదేనంటూ పాకిస్తాన్ చొరబడినా, భారత్‌కే విజయం లభించింది. ఈ సొమ్ములో వచ్చే వాటాను సంస్థానానికి చెందిన 120 మంది వారసులు పంచుకుంటారని ఆ కుటుంబీకులు చెప్పారు. ప్రభువుల భోగాలకు పోయినంత పోగా మిగిలిన సంపద ఇది. భృత్యులు, బంధువులు కొల్లగొట్టినంత కొల్లగొట్టగా నేటికి కనిపిస్తున్న కనకరాశులు ఇవి.

**(వ్యాసకర్త: న్యూరో సర్జన్, అపోలో. 'మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అండ్ హిస్ వెల్త్' రచయిత)**

## కథ

విశాఖ వెళ్లే బస్సులో సామాన్లు సర్దుకుని కూర్చున్నాడు నిశ్చయ్. తన ప్రాణసఖి నిశ్చల పక్కన లేనందుకు అదోలా ఫీల్ అయ్యాడు. ఎంతైనా పెళ్లయిన కొత్త కదా! కానీ, జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో ఒక పూట పని కోసం రాత్రి బస, మళ్లీ సాయంత్రం బస్సులో ఇంటికి రాక – ఇంత శ్రమపడలేనని తేల్చి చెప్పేసింది నిశ్చల.

నిజమే, నాజూకుగా, బొమ్మలా ఉండే ఆమెను ఇంత శ్రమకి గురి చేయడం అమానుషమేనని తనకే అనిపించింది. పైగా, ఇది సింపుల్‌గా రెండూళ్ల మధ్య ప్రయాణం కానే కాదు. తనుండే ఏజెన్సీ ప్రాంతం నుండి పాడేరు వచ్చి, అక్కడి నుండి విశాఖ వెళ్లే బస్సెక్కి, ఓ రెండు మూడు గంటల్లో అక్కడకు చేరుకుని, రాత్రి ఏ లాడ్జిలోనో బస చేసి, పొద్దున్నే ఆఫీసుకి వెళ్లి, పని చూసుకుని, ఏ మధ్యాహ్నానికో, సాయంత్రానికో బస్సు పట్టుకుంటే చిమ్మ చీకటి అయ్యాకే ఇల్లు చేరుకోవడం! ఏజెన్సీ ప్రాంతాల్లో జనాలు మంచి వాళ్లు గనుక ఆమె భద్రత విషయంగా తనకు ఎటువంటి చింతా లేదు.

ఎటొచ్చీ, 'ఏమైనా తేవాలా?' అని తాను అడిగిన ప్రశ్నకి ఆమె కోరిన కోరిక వింతగా అనిపించింది. స్త్రీలు ఇంత అభివృద్ధి చెందినా కూడా ఆమె ఇలా కోరడం వల్ల తనకు ఏదోలా అనిపించి, వెగటు, విసుగూ వచ్చాయి. కానీ, తమ ప్రేమ ప్రయాణం గుర్తుకి తెచ్చుకుని ఆమెని ఏమీ అనలేక పోయాడు.

తామిద్దరూ చిన్ననాటి స్నేహితులు. కాలంతో పాటు తమ స్నేహం ప్రేమగా పెరిగి పెద్దయ్యింది. ఆమె తండ్రి ఆస్తిపాస్తులని అమ్ముకుని పట్నం వెళ్లి పిల్లలని పట్టభద్రులని చేశాడు. తాను మాత్రం ఉన్న ఊళ్లో డిగ్రీ చదువుకుని, టీచర్ ట్రైనింగ్ ప్యాస్ అయ్యాడు.

ఇంజనీరింగ్ చదివించాలన్న వాళ్ల నాన్నగారి ఆశని అడియాస చేసి ఆమె బీఎస్సీ చదివింది. అంతటితోనే ఆపేసింది, కాబోయే అత్తమామలు వాళ్ల కొడుకు కన్నా ఎక్కువ చదువుకున్న కోడలు వస్తే హర్షించరు కాబట్టి. 'పట్నం పిల్లల్ని పట్టలే'మని వాళ్లనుకున్నా, దృఢ 'నిశ్చ'యంతో, 'నిశ్చల' నిలకడతో ప్రేమికులు గెలిచి, పెద్దల ఆశీస్సులతో భార్యా భర్తలయ్యారు.

పాడేరు నుండి టూ–వీలర్ మీద మాత్రమే వెళ్లే వీలుండే ఒక కుగ్రామంలో కొత్త కాపురం మొదల య్యింది. సింగల్ టీచర్‌గా పని చేస్తున్న తనకి అప్పుడ ప్పుడూ విశాఖపట్నం వెళ్లవలసిన పనుంటుంది. కాపురం పెట్టాక ఇదే మొదలు.

ఆమె గొంతెమ్మ కోరికలేవీ కోరలేదు గాని, ఆ విచిత్రమైన కోరిక కోరే మనసు ఆమెకు ఎలా వచ్చిందో మాత్రం తనకు అవగతమవలేదు. తన తల్లిదండ్రులకి పట్నం పిల్లంటే ఇష్టం లేదు ఇందుకేనేమో, అని కూడా అనుకున్నాడు తను.

* * *

ఆఫీసులో పని అనుకున్న దానికన్నా ముందరే అయిపోయింది. అతను ఎప్పుడు వైజాగ్ వెళ్లినా పుస్తకాలో, ఇంటికీ, ఒంటికీ, వంటింటికీ సంబంధిం చిన వస్తువులు తెచ్చుకోవడం పరిపాటి. కానీ, భార్యకు కావలసింది కొనాలంటే ఎందుకో బెరుకు. తన గురించి ఆ దుకాణం వాడు ఏమనుకుంటాడు? అక్కడ మరెవరైనా ఉంటే తనని 'చీప్' అనుకుని, లోకువ కట్టరూ?

ఇన్ని సందిగ్ధాలు అయిన తరువాత, 'నేను చేసే చిన్న ఉద్యోగాన్ని 'చిన్న'గా చూడకుండా ఇష్టపడి సన్ను కట్టుకున్న మనిషి, పెళ్లయిన తరువాత మొదటి సారిగా కోరిన చిన్న కోరిక తీర్చ లేకపోతే ఎలా?' అని తనకి తాను సర్ది చెప్పుకుని ఆమెకు కావలసిన వస్తువు కొన్నాడు.

దానికోసం దుకాణాదారుణ్ణి నిశ్చయ్ అడిగి నప్పుడు చూసుకోవాలి, దించిన తల ఎత్తకుండా అడిగాడు. ఎవరైనా చూస్తే, 'పిల్లి కళ్లు మూసుకుని, ఎవరూ తనని చూడలేదని భ్రమపడుతుంది' అనే సామెత గుర్తుకు వస్తుంది! అదుగకూడనిది అడిగాడని దుకాణాదారు కూడా అనుకున్నాడో ఏమో, ఆ వస్తువుని ముందు ఒక పాత వార్తాపత్రికలో చుట్టి, తరువాత నల్లరంగు క్యారీ బ్యాగ్‌లో పెట్టి ఇచ్చాడు.

* * *

కాలచక్రం గిర్రున తిరిగి, నిశ్చయ్‌కి వ్యక్తిగతం గాను, వృత్తిపరంగాను పదోన్నతిని ప్రసాదించింది. ఇప్పుడు నిశ్చల–నిశ్చయ్‌లకి ఇద్దరు కూతుళ్లు. కవలలు. పదవ తరగతి మంచి మార్కులతో ప్యాస్ అయ్యారు. తల్లిదండ్రుల ఆదర్శవాదాన్ని పుణికి పుచ్చుకున్న ఆ అమ్మాయిలు మెడికల్, ఇంజనీరింగ్ అని ఎగబడకుండా, ఒకరు సంగీతం, మరొకరు చిత్రలేఖనం నేర్చుకుంటున్నారు. ఇక తన విషయాని కొస్తే, అమ్మాయిలు మాత్రమే చదివే ఒక ఉన్నత పాఠశాలకి హెడ్ మాస్టర్ అయ్యాడు నిశ్చయ్.

* * *

ఆ రోజు పాఠశాలలో అమ్మాయిలు తోరణాలు కట్టి, ముగ్గులు పెడుతున్నారు. కొంత సేపట్లో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యా శాఖాధికారి వచ్చారు. నిశ్చయ్ స్టేజీ మీద వారిరువురి నడుము కూర్చు న్నాడు. ముందుగా డీఈఓ మాట్లాడుతూ, 'మన జిల్లాయే కాదు, మన రాష్ట్రంలో మరే జిల్లాలోనూ జరగని విడ్డూరం ఇక్కడ జరుగుతోంది. మొట్ట మొదటిసారిగా, ఒక ప్రభుత్వ పాఠశాలలో శానిటరీ నాప్కిన్ వెండింగ్ మిషన్ నెలకొల్పు తున్నారు. ఇది ఒక పెద్ద ఘనత. మన దేశంలో స్త్రీల నెలసరి గురించి మాట్లాడడం ఒక సాంఘిక నేరం కింద పరిగణిస్తాం! అవునా?' అన్నారు.

ఆడపిల్లలూ, టీచర్లూ మౌనం వహించారు. 'చూశారా! మీ మంచి కోసం తీసుకునే చర్యల గురించి మాట్లాడడానికి మీకే ఇష్టం లేకుండా ఉంది. మరి, మీకు మేలు చెయ్యాలని మగవాళ్లు అనుకోకపోతే, వాళ్లని తప్పుబట్టలేం కదా! కానీ, మీ హెడ్ మాస్టర్ గారు అలాంటి వారు కారు. ఆడపిల్లల తండ్రులు ఈ దేశంలో ఎంతమందైనా ఉండవచ్చు. కానీ, నిశ్చయ్ వాళ్లలో తలమానికం లాంటి వారు.

'ఈ ప్రస్తావన తీసుకుని నా వద్దకు వచ్చినప్పుడు ముందు నేను విస్తుపోయాను. కానీ, అదే సమ యంలో సంతోషంగా కూడా అనిపించింది. ప్రభుత్వం తమకు తాముగా ప్రవేశ పెట్టిన సంస్కర ణల కన్నా, ప్రజలు ప్రభుత్వాన్ని కోరి చేయించుకున్న సంస్కరణలే ఎక్కువ కాలం నిలుస్తాయి.'

'నిజానికి ఇవ్వాళ గౌరవనీయులైన కలెక్టర్ గారు ప్రారంభించబోయే ఆ మిషన్ స్త్రీలుండే ప్రతీ వృత్తిపరమైన ఆవరణలోనూ ఒక నిత్యావసర వస్తువు. అయినా, ఈ విషయంపై స్త్రీలు నోరు మెదపరు గనుక అది అంత ప్రజాదరణకి నోచుకోలేదు.'

'నెలసరి సమయంలో పాటించవలసిన శుచీ–శుభ్రతల గురించి తల్లులకే సరైన అవగాహన లేదని కచ్చితంగా చెప్పగలను. అలాంటిది, ఈ పాఠశా లలో పిల్లల కోసం ఇలాంటి సదుపాయం చేయాలనుకున్న నిశ్చయ్ మీకు తండ్రి కాని తండ్రి లాంటి వారు. ఆయన్ని మరోసారి అభినందిస్తూ, కలెక్టర్ గారిని ప్రారం భోత్సవం చేసి, సభనుద్దేశించి




ప్రసంగించవలసిందిగా కోరుతు న్నాను', అని ముగించారు డీఈఓ.

కలెక్టర్ కరతాళ ధ్వనుల మధ్య వెండింగ్ మిషన్‌ని, వాడిన నాప్కిన్లని శుచిగా తగులబెట్టే ఇన్సినరేటర్‌ని ప్రారంభించి, 'నేను కూడా సంప్ర దాయబద్ధమైన కుటుంబంలోనే పెరిగి పెద్దవాణ్ణి అయ్యాను. సభ్యత గల మగవాళ్లు ఇలాంటి విషయాల గురించి మాట్లాడడం గాని, ఆరా తీయడం కానీ చేయకూడదని ఇంట్లో నేర్చుకున్నాను. మా అమ్మ, అక్కలు ఆ సమయంలో ఏవేం

# నాలో ఉన్న బూజు

డా॥ చెల్లపిల్ల సూర్యలక్ష్మి

కష్టాలు పడేవారో, ఎలాగ నెట్టుకు వచ్చేవారో నాకు తెలియదు. మా అమ్మ సెర్వైకల్ కాన్సర్‌తో మరణిస్తే కూడా నెలసరి సమయంతో దానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని గుర్తించలేకపోయాను.

'ఐఏఎస్‌కి ఎంపికయ్యాక మసూరీలో మాకు శిక్షణ ఇచ్చారు. ప్రజా సంక్షేమానికి సంబంధించి, వివిధ అంశాలపై విశ్వవిఖ్యాతి గాంచిన వారి ఉపన్యాసాలు వినే అదృష్టం కలిగింది. ఆ వరుసలో, స్త్రీల సంక్షేమంపై అరుణా చలం అనే ఆయన ప్రసంగిస్తారంటే, 'ఈయనెవరు?' అనుకున్నాను. గూగుల్ చేస్తే ఆయన 'ప్యాడ్ మ్యాన్' అని తెలిసింది. అప్పటికింకా ఆ పేరుతో సినిమా రాలేదు. నేను నేర్చుకున్న సంస్కారాన్ని బట్టి, ఆయనపై నాకు ఒక రకమైన చిరాకు పుట్టింది.'

'దానికి తోడు, ఆయన మొదలు పెట్టిపెట్టంగానే, 'ఇక్కడ ఉన్న వాళ్లలో షాప్‌కి వెళ్లి, శానిటరీ నాప్కిన్స్‌ని అడిగి కొన్న వాళ్లు చేతులు పైకెత్తండి' అన్నారు. నేను తల దించుకుని ఉండిపోయాను. కానీ, ఆ రోజున ఒక పాఠం, కాదు కాదు... గుణపాఠం నేర్చుకున్నాను. ప్రజాసంక్షేమం సమకూర్చాలంటే మనం ఇదివరలో మాట్లాడడానికి జంకే విషయాల మీద కూడా నిర్ణయాలు తీసుకోవాలని అర్థమయ్యింది.

అందుకే, నిశ్చయ్ గారు చేస్తున్న కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఘంటాపథంగా చెప్పగలను. ఆ చరిత్రలో నాకు కూడా చోటు దొరికినందుకు గర్వ పడుతున్నాను.

ఇక మీదట జిల్లాలోని పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ–ఒకటేమిటి, స్త్రీలు పనిచేసే పరిసరాలన్నిటిలో ఈ మిషన్లు తప్పనిసరిగా నెలకొల్పాలని ఆదేశాలు ఇస్తాను. అంతేకాదు, అన్నీ జిల్లాల్లోనూ ఈ ఆదేశాలు అమలు పరచాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తాను. మరో విషయం – తమిళనాడుకి చెందిన ఒక స్నేహితుడు, గీతా ఇళంగోవన్ అనే పాత్రికేయురాలు ఈ అంశంపై చేసిన డాక్యుమెంటరీ ఇచ్చారు. దాన్ని ఇప్పుడు చూడండి – మనకి భాష అర్థం కాకపోవచ్చు గానీ, ఆ దృశ్యాలే చెప్పాల్సిన విషయాలు చెప్తాయి అని ముగించారు కలెక్టర్.

ఆ సమయంలో ఎటువంటి శుచీ–శుభ్రతలు పాటించాలో, పర్యావరణానికి మేలు చేసే విధంగా ప్యాడ్ ని ఇన్సినరేటర్ సహాయంతో ఎలా బుగ్గి చెయ్యవచ్చో ఆ డాక్యుమెంటరీలో వివరించారు.

నిశ్చయ్ మాట్లాడుతూ, "పెద్దలు కలెక్టర్ గారు, డీఈఓ గారు నా కృషిని మెచ్చుకున్నారు. దీనంతటికీ కారణం నా భార్య. పెళ్లయిన కొత్తలో ఆమె కొనిపెట్టమని అడిగిన మొదటి వస్తువు శానిటరీ నాప్కిన్. నేను విస్తుపోయాను. అయినా, భార్య కోసం మనసు చంపుకుని ఆ పని చేశాను. ఆ తరువాత బెరుకు దానంతట అదే పోయింది.

'ఎటువంటి విషయమైనా నాతో చర్చించవచ్చని మా అమ్మాయిలని ప్రోత్సహించాను. అరుణాచలం గారి గురించి ఇంతకు ముందే పేపర్‌లో చదివినా, స్త్రీల మొహమాటం వల్ల, ఈ మహత్కార్యాన్ని తలపెట్టినా, నెరవేరే అవకాశం దొరకకపోవడం వల్ల, ఇప్పుడే ఈ పనిని చేయడం కుదిరింది.'

'వెయ్యి మైళ్ల ప్రయాణం కూడా ఒక చిన్న అడుగుతోనే మొదలౌతుంది', అని, ఆంగ్లంలో ఒక నానుడి ఉంది. ఇది వెయ్యో మైలురాయైతే, మా ఆవిడ కోసం నేను నాప్కిన్ కొనడం మొదటి అడుగు అనుకోవచ్చు. ఆవిడే గనుక తన అవసరాన్ని ఒక కోరికలా కోరకుండా ఉంటే, నాలో ఉన్న ఈ బూజుని దులుపుకునే అవకాశం, తద్వారా నలుగురికి మేలు చేసి, ఇలా పెద్దల మన్ననలు పొందడం, జరిగేవి కావేమో' అని కరతాళ ధ్వనుల మధ్య ముగించాడు నిశ్చయ్. ★






మహేంద్రుడు బయటకు వెళ్లిపోయాడు. జనశూన్యమైన. ఆ ఇంటిలో కళ్యాణి కూతురుని దగ్గర పెట్టుకుని ఒక్కతే వుండిపోయింది. ఆమె నాలుగువైపులా పరికించసాగింది. ఆమె మనస్సులో భయం వంటి భావం అంకురించింది. ఈ ప్రాంతాలలో ఎవరూలేరు. మానవ మాత్రులు ఎక్కడా తిరుగుతున్న శబ్దమే వినరావడం లేదు. అప్పుడప్పుడు కుక్కలు, నక్కలు అరుస్తూ వున్న సవ్వడి వినవస్తోంది. ఆమె ఇలా ఆలోచించసాగింది "వారిని ఎందుకలా బయటకు వెళ్లనిచ్చాను? మరికొంతసేపు ఆకలి బాధకు తట్టుకుంటే సరిపోయేదికదా!" కొంత సమయం గడిచిన తరువాత ఆమెకు మరో ఆలోచన వచ్చింది "నాలుగువైపులా తలుపులు బిగించి వేస్తాను."

కాని ఆమె చూడగా ఒక తలుపుకు కూడా గడియగాని, గొళ్లెంగాని వున్నట్లు అనిపించలేదు. ఆమె ఈ ప్రయత్నంలో నాలుగువైపులా తిరుగుతూ వుండగా, ఎదురుగా వున్న ద్వారం నుండి ఒక మనుష్యాకృతి వంటి నీడ వచ్చిపడింది. కంకాళమాత్ర మయిన నల్లని, నగ్న, వికటాకార మనుష్యమూర్తి తలుపు దగ్గర నిలబడింది. ఈ మూర్తి కొన్ని క్షణాలకు తన చేతిని బారసాచి ఎవరినో పిలిచినట్లు సంజ్ఞ చేసింది. కళ్యాణి ప్రాణాలు ఎగిరిపోయినట్లు అనిపించింది. కంకాళం సంజ్ఞ చేయడంతోటే, మరొక మూర్తి అదే ఫక్కీలో వున్నది వచ్చి మొదటి మూర్తి ప్రక్కన నిలవబడింది. మరొకటి మరొకటి వచ్చి నిలబడినాయి. అలా ఎన్నో వచ్చి నిలచినాయి. అంధకారబంధురమైన ఆ గృహం శ్మశాన సదృశం అయింది. ఈ కంకాళమూర్తులు కళ్యాణికి, అమ్మాయికి చుట్టూ వలయాకారంలో నిలబడ్డాయి. కళ్యాణి భయంతో కెవ్వున కేకవేసి మూర్ఛపోయింది. ఒక కంకాళం కళ్యాణిని, అమ్మాయిని ఎత్తుకుని బయటకు నడిచింది. పొలాలను దాటి, అరణ్యంవైపు పరుగుతీసింది.

కొంత తడవుకు మహేంద్రుడు పాలు తీసుకుని వచ్చాడు. అక్కడ తన భార్య, కుమార్తె అగుపించలేదు. ఇంకెవరూ కనిపించడం లేదు. భార్యను, పిల్లను పేరు పేరున పిలువసాగాడు. ఎటువంటి బదులు రాలేదు. వారి జాడ తెలియలేదు.

### 3

దొంగలు కళ్యాణిని ఎత్తుకుపోయి ఒక వనంలో దించారు. ఆ వనం చూడటానికి మనోహరంగా వున్నది. ఆ శోభను చూడటానికి అక్కడ వెన్నెల లేదు. తనివితీర చూచి ఆనందించే కన్నులు కూడ అక్కడలేవు. దరిద్రుని హృదయ సౌందర్యంలాగ ఆ వనసౌందర్యం కూడా వైభవం అనుభవం లేక మోడు వారి పోయి వున్నది. దేశంలో ఆహార ద్రవ్యాలు లేవు. అయినా యీ వనంలో చెట్లు చిగిర్చి పూలు పూస్తున్నాయి. పూల సుగంధం యీ అంధకారంలో కూడా బహు దూరం వ్యాపిస్తోంది. అటువంటి వనసీమలో దొంగలు కళ్యాణిని, ఆమె కుమార్తె సుకుమారిని దిగవిడిచినారు. దొంగలు ఈ ఇద్దరి చుట్టూ వలయాకారంగా కూర్చున్నారు. 'ఈ మనుష్యులను యేమి చేయాలి' అనే విషయం తమలో తాము చర్చించుకోసాగారు. కళ్యాణి వంటిమీద వున్న అలంకార ఆభరణాలను దొంగలు ముందుగానే హస్తగతం చేసుకున్నారు. దొంగలలో ఒక ముఠా ఈ నగలను పంచుకోవడం అనే వ్యవస్థలో మునిగిపోయారు. ఈ పంచుకునే కార్యక్రమం అయిపోయిన మీదట ఒక దొంగ ఇలా అన్నాడు: "మనం ఈ వెండి, బంగారాలు తీసుకుని ఏం జుర్రుకుంటాము? ఒక నగ తీసుకుని నాకు ఒక గుప్పెడు ఆహారం పెట్టండి. ఆకలి బాధకు నా ప్రాణాలు ఎగిరిపోయేట్లుగా వున్నాయి. ఈ రోజు ఉదయం నేను నాలుగు ఆకులు అలములు తిన్నాను. అంతే"

ఒక దొంగ ఇలా బాహాటంగా అనడంతోటే తతిమ్మా దొంగలుకూడా యిదే ధోరణి సాగించారు. వారి యజమానికి వారినందరినీ సమాధానపర్చడం సాధ్యం కాకుండా వచ్చింది.

"అన్నం పెట్టు. బియ్యం ఇవ్వు. ఆకలితో చచ్చిపోతున్నాం! ఈ వెండి, బంగారాలు మాకు అక్కరలేదు" అంటూ గందరగోళంగా తయారయింది అక్కడి వాతావరణం. దళపతి వాళ్లను శాంత పరచటానికి ప్రయత్నం చేస్తున్నాడు. కాని ఎవరు వింటారు? క్రమంగా ఉచ్ఛస్వరంలో మాట్లాడసాగారు అందరూ. ఒకడినొకడు తిట్టుకోవడం, కొట్టుకోవడం జరుగుతోంది. అందరూ కలిసి దొంగల నాయకుడిని, తమ దళపతిని కొట్టనారంభించారు. అసలే ఆకలి బాధకు నక నకలాడిపోతూ వున్నాడేమో, దళపతి రెండు మూడు దెబ్బలకే స్పృహతప్పి నేలమీద పడిపోయినాడు. పడడంతోటే అసువులను కూడా వీడినాడు. దొంగలలో ఒకడు ఇలా అన్నాడు : "కుక్కల నక్కల మాంసం తింటున్నాము. ఆకలితో



ప్రాణం పోతోంది. రండి. ఈ శవాన్ని చీల్చుకు తిందాము."

ఒకడు శవాన్ని కాల్చటానికి అనువుగా నిప్పు రాజవేసే ప్రయత్నంలో మునిగిపోయినాడు. ఆకులు, అలములు, కట్టెపుల్లలు, చిదుకులు పోగుచేసి నెమ్మదిగా నిప్పుచేశాడు. క్రమంగా నిప్పు రాజుకుంది. పెద్ద మంట అయింది.

ఇంతలో వారిలో ఒకడు "ఆగండి! నరమాంసం తినడానికి నిశ్చయించుకున్నప్పుడు అస్థిపంజరంలా వున్న యీ ముసలివాడిని పీక్కుతినడం ఎందుకు? ఇక్కడ కోమలమైన స్త్రీలను ఎత్తుకువచ్చి పడేశాముగదా! ముందు ఆ చిన్నపిల్లను కాల్చుకుతిందాము, బాగుంటుంది" అన్నాడు.

"అలాగే! ఏదో ఒకటి స్థిరంచేయండి అలాగే చేద్దాం'' అన్నాడు మరొకడు. ''ఆకలితో చచ్చిపోతున్నాను. తొందరగా తేల్చండి."

ఈ మాటలతో అందరూ కళ్యాణిని, సుకుమారిని పడవేసిన వైపు తిరిగారు. అయితే ఆశ్చర్యం! ఆ స్థలం నిరామయంగా వుంది. అక్కడ సుకుమారికాని, కళ్యాణికాని పడిలేరు. ఆ ప్రదేశం శూన్యంగా వుంది. దొంగలు ఇందాకటి నుండి తమలో తాము వివాదాలు పడుతున్న సమయంలో కళ్యాణి తెలివి తెచ్చుకుని చిన్నపిల్లను చంకన వేసుకుని అడవిలోనికి పరుగెత్తింది. తాము చంపుకు తిందామనుకున్న మనుష్యులు కానరాకపోవడంతో దొంగలకు శివమెత్తినట్లు అయింది. వారంతా "పట్టుకోండి, పట్టుకోండి" అని అరుస్తూ నాలుగువంకలా పరుగులు తీశారు. అవస్థావిశేషం చేత మనుష్యులు సైతం, జంతుమాత్రంగా తయారవుతారు.

**4**

అరణ్యం మధ్యలో గాఢాంధకారం అలుముకుని వున్నది. కళ్యాణికి దారి కనిపించడం కూడా చాలా కష్టం అయిపోతోంది. చెట్లు చేమలు అడ్డదిడ్డంగా పెరగడంవల్ల దారి యేర్పరుచుకు ముందుకు వెళ్లడం కష్టం అయిపోతోంది. అదీగాక, చీకటి. ముళ్లు గుచ్చుకోకుండా ఒదిగిఒదిగి నడవవలసివస్తోంది. సుకుమారి ఈ ముళ్ల తాకిడికి యేడుస్తూ వుంది. ఈ యేడుపు విని దొంగలు తమ ఉనికి తెలుసు కుంటారేమోనని కళ్యాణి భయపడసాగింది. కళ్యాణి పిచ్చి దానివలె పరుగుతీయసాగింది.

కొంతసేపటికి చంద్రోదయం అయింది. ఇంతవరకు కళ్యాణికి ఒక మొండి ధైర్యం ఉంది. అదేమంటే, చీకటిలో తనను ఆ నరపిశాచులు గుర్తించలేరని చంద్రుని కాంతి యిప్పుడు ప్రసరించ డంతో ఈ ధైర్యమంతా సడలిపోయింది. చంద్రకాంతి వనమంతా ఆవరించింది. అడవి లోపల కూడా వెలుగుతో నిండిపోయింది. ఒక రకమయిన ఉజ్వలతతో వెలిగిపోతోంది అంతా. కళ్యాణి పిల్లను అదుముకుని వడివడిగా పరుగు తీస్తోంది. దొంగలు వెనక అరుచుకుంటు వస్తున్నారు.

పిల్ల యేడుపు వినిపించడంతో దొంగల అరుపులు మరింత అయినాయి. కళ్యాణి దిగ్భ్రమతో ఆగిపోయింది. ఆమె అశక్తురాలయింది. నీరస పడిపోయింది. ఒక వటవృక్షం కింద కటిక శూన్యమయిన ప్రదేశాన్ని చూచుకుని మెత్తటి ఆకుల మీద కూలబడిపోయింది. భగవంతుని స్మరించు కోసాగింది. "భగవాన్! ఎక్కడ వున్నావు నీవు? నిన్ను నిత్యము పూజిస్తున్నాను. నీ ధైర్యంతోనే ఇలా ఒంటరిగా అడవిలో పరుగులు తీస్తున్నాను. ఓ మధుసూదనా! నన్ను తరింపచేయి! ఎక్కడ వున్నావో భగవాన్!'

ఈ సమయంలో భయము, భక్తి ఆమెను



బంకించంద్ర చటర్జీ

ఆవరించినాయి. ఆకలిచేత నీరసించిన శరీరం అచేతనావస్థలోనికి మారుతోంది. అయినా, అంతరిక్త మయిన చైతన్యావస్థలో ఆమెకు ఒక కీర్తన వినిపిస్తోంది. ఈ కీర్తన అంతరిక్షం నుండి, స్వర్గధామం నుండి వస్తున్నట్లుగా వుంది.

**"హరే మురారే! మధుకైట భారే!**
**గోపాల, గోవింద, ముకుంద ప్యారే!**
**హరేమురారే! మధుకైట భారే!**
**గోపాల, గోవింద, ముకుంద ప్యారే!**
**హరే మురారే! మధుకైట భారే!"**

కళ్యాణి చిన్నతనం నుండి పురాణవర్ణనలు వినడానికి అలవాటుపడి వున్నది. దేవ రుషి అయిన నారదుడు వీణాపాణి అయి ఆకాశమార్గంలో పాడుకుంటూ తిరుగుతూ వుంటాడని ఆమె ఎరు గును. ఈ పాట వినడంతోటే ఆమెకు యీ విషయం చప్పున స్ఫురించింది. ఆమె మనస్సులో ఒకరూపం యేర్పడింది. శుభ్రమయిన శరీరం, శుభ్రమయిన వేషం, మహాముని వీణ చేత పుచ్చుకుని ఆకాశంలో వెన్నెలదారుల వెంట నడచి వెడుతున్నాడు. ఈ "హరేమురారే మధుకైట భారే!" క్రమంగా



యీ పాట ఆమెకు దగ్గరగా రాసాగింది. మరింత స్పష్టంగా వినపడసాగింది. "హరే మురారే మధుకైటభారే!" చివరకు కళ్యాణి పారవశ్యంతో కిందికి ఒరిగిపోయింది.

**5**

ఆ అరణ్యంలో కొండరాళ్లతో నిర్మించిన ఒక మఠం వున్నది. పురాతత్త్వవేత్తలు ఎవరయినా ఆ స్థలాన్ని చూచినట్లయితే, ఇక్కడ కొన్ని వేల సంవత్సరాల క్రితం ఒక బౌద్ధ విహారం వుండి వుండేదని చెపుతారు. ఆ బౌద్ధ విహారమే క్రమేణ హిందూ ఆరామం అయిందని కూడా చెపుతారు. అది రెండంతస్తుల భవనం. దానిలో అనేక దేవమందిరాలు, ఎదురుగా నాట్యమందిరం వున్నాయి. చుట్టూ శిలాకుడ్యాలు వుండడం, దట్టమైన అడవి ఆవరించి వుండడంవల్ల ఈ భవనం ఎవరికీ కనిపించదు. చాల ప్రాచీనమైన కట్టడం అవడంవల్ల అక్కడక్కడ గోడలు బీటలు వారి ఒరిగి పోయినాయి. అయితే, పగటిపూట చూస్తే ఈ భవనానికి కొద్దిపాటి మరమ్మత్తులు చేసినట్లు అగుపిస్తుంది. దుర్భేద్యమైన ఈ అడవిమధ్య ఈ భవనంలో మనుష్య సంచారం వున్నదన్న 'విషయం కూడా తెలుస్తుంది పరిశీలనగా చూస్తే, భవనంలో ఒక పక్క అఖండం వెలుగుతోంది. కళ్లు తెరవడం తోటే కళ్యాణి ఈ అఖండానికి ఎదురుగా ఆ రుషి నిలబడి వుండడం చూచింది. కళ్యాణి చాల ఆశ్చర్యంతో నాలుగుపక్కల పరికించి చూడసాగింది. ఆమెకు ఇప్పటికి కూడా పూర్తిగా చైతన్యం కలుగలేదు. ఈ విషయం కనిపెట్టి ఆ మహాపురుషుడు "అమ్మాయీ! ఇది దేవతలు నివసించే చోటు. నీవేమీ భయపడనవసరంలేదు. ఇక్కడ కాసిని పాలు వున్నాయి, తాగు. తరువాత మాట్లాడుకుందాం" అన్నాడు.

మొదట కళ్యాణికి ఏమీ అర్థం కాలేదు. తరువాత కొద్దికొద్దిగా ఆమె హృదయం శాంతపడసాగింది.

బ్రహ్మచారి ఒక్కొక్క మాట అడిగి ఆమె నుండి జవాబులు రాబట్టుకుని విషయమంతా తెలుసు కున్నాడు. కళ్యాణి తన భర్త పేరు నోటితో చెప్పలేక పోయింది. చివరకు బ్రహ్మచారి "నీవు మహేంద్రుని భార్యవా?" అని అడిగాడు. జవాబుగా కళ్యాణి తల ఆడించింది. బ్రహ్మచారికి అర్థం అయింది. "నీవు నామాట విను. నేను నీ భర్తను వెదికి తీసుకువస్తాను. నాలో నమ్మకం వుంచి పాలుతాగు. నీవు త్రాగేంతవరకు నేను బయటకే పోను."

కొంగు సరి చేసుకుని, ఆయనకు సాష్టాంగ ప్రణామం చేసింది. మహాత్ముడు ఆమెను ఆశీర్వదించి గదిలో నుండి వేడివేడి పాలు తీసుకువచ్చి ఆమెకు ఇచ్చి "అమ్మాయీ! ఈ పాలు పిల్లకు కూడా తాగించు, నీవూ తాగు. ఆ తర్వాత మాట్లాడుకుందాం" అన్నాడు. కళ్యాణి సంతుష్ట హృదయంతో పిల్లకు పాలు తాగిస్తోంది. తరువాత ఆయన ఇలా అన్నాడు. "నేను బయటకు వెడుతున్నాను. నీవు ఎటువంటి విచారము, సంకోచము లేకుండా ఇక్కడే కూర్చో". ఈ మాటలు అని ఆయన గదిలో నుండి బయటకు వెళ్లాడు. కొద్దిసేపటి తరువాత తిరిగి వచ్చాడు. ఆయన వచ్చేసరికి కళ్యాణి పిల్లకు పాలు పట్టించడం అయింది. తాను ఏమీ తాగనేలేదు. గ్లాసులోని పాలు కొద్దిగా మాత్రమే వినియోగం అయినాయి. ఆయన ఈ సంగతి పరిశీలనగా చూచి గమనించాడు.

"అమ్మాయీ! నీవు పాలు తాగనే లేదు. నేను మళ్లీ బయటకు వెడుతున్నాను. నీవు పాలు త్రాగేంతవరకు నేను తిరిగి లోనికి రానేరాను."

ఆయన ఈ మాటలు పలికి బయటకు వెళ్లబోతూ వుండగా కళ్యాణి లేచి నిలబడి చేతులు జోడించింది.

"ఏమిటి?" అన్నాడు ఆయన. "నన్ను పాలు త్రాగమని బలవంతం చేయకండి. నాకు బాధగా వుంటుంది. నేను పాలు తాగలేను ఈ స్థితిలో."

ఈ మాటలకు వనవాసి కరుణామయ హృదయంతో ఇలా అన్నాడు. "ఏమిటమ్మా బాధ? నేను బ్రహ్మచారిని. నీవు నాకు కుమార్తెవంటిదానవు.

నీ మనస్సు ఏమిటో నా ముందు విప్పి చెప్పు. ఏమీ బిడియపడకు. నీవు స్పృహ తప్పిపడివుంటే నేను ఇక్కడికి తీసుకువచ్చాను. చాల నీరసంగా వున్నావు. ఏమీ తీసుకోకపోతే మరీ డీలా పడిపోతావు." ..

ఈ మాటలకు కళ్యాణి కళ్లనీళ్లు పెట్టుకుంది. "మీరు దేవుడితో సమానం. మీ ముందు నా బాధ చెప్పుకోవడానికి ఏమీ బిడియం లేదు. ఇంతవరకూ మా స్వామి ఏమీ పుచ్చుకుని వుండరు. వారిని కలుసుకోకుండా, వారి క్షేమం తెలుసుకోకుండా నేను పచ్చి మంచినీళ్లు మటుకు ఎలా తాగగలను?"

"నీస్వామి ఎక్కడ వున్నారు?"

"నాకు తెలియదు వారు నాకోసం పాలు తీసుకురావడానికి వెళ్లారు. ఇంతలో దొంగలు నన్ను ఎత్తుకుపోయినారు. తరువాత వారు ఏమయ్యారో నాకు తెలియదు."

బ్రహ్మచారి ఒక్కొక్క మాట అడిగి ఆమె నుండి జవాబులు రాబట్టుకుని విషయమంతా తెలుసు కున్నాడు. కళ్యాణి తన భర్త పేరు నోటితో చెప్పలేక పోయింది. చివరకు బ్రహ్మచారి "నీవు మహేంద్రుని భార్యవా?" అని అడిగాడు. జవాబుగా కళ్యాణి తల ఆడించింది. బ్రహ్మచారికి అర్థం అయింది. "నీవు నా మాట విను. నేను నీ భర్తను వెదికి తీసుకువస్తాను. నాలో నమ్మకం వుంచి పాలుతాగు. నీవు త్రాగేంతవరకు నేను బయటకే పోను."


"ఇక్కడ కొద్దిగా నీళ్లు దొరుకుతాయా?" అని అడిగింది కళ్యాణి.

బ్రహ్మచారి నీళ్ల కలశం చూపించాడు. కళ్యాణి అంజలి ఘటించింది. బ్రహ్మచారి ఆమె దోసిటిలో నీళ్లుపోశాడు. నీళ్లతో నిండిన దోసిలి బ్రహ్మచారి పాదాల చెంతకు చేర్చి ఆమె "తాము దయతో తమ పాదరేణువులు ఇందులో ప్రసాదించండి" అంది. బ్రహ్మచారి బొటనవేలును నీళ్లలో తాకించాడు. కళ్యాణి ఆ నీళ్లను తృప్తిగా త్రాగింది.. "నేను అమృత పానం చేశాను. ఇంక నన్ను తినమని, తాగమని బలవంతం చేయకండి. నా స్వామి జాడ తెలియ వచ్చేంతవరకు ఇంకేమీ పుచ్చుకోను" అంది కళ్యాణి.

ఈ మాటలకు బ్రహ్మచారి కూడా సంతుష్టుడు అయినాడు.

"నీవు ఇక్కడే ఈ దేవస్థానంలో వుండు. నేను నీ భర్తను వెదికి తీసుకు వస్తాను" అన్నాడు.

(సశేషం)



## వాకాటి పాండురంగారావు స్మారక కథల పోటీ



**జాగృతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక కోసం సుప్రసిద్ధ కథా రచయిత స్వర్గీయ వాకాటి పాండురంగారావు స్మారక 'కథల పోటీ - 2022' నిర్వహిస్తున్నాం. రచయితలకు ఆహ్వానం..**

1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతి, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు జాగృతి పారితోషికం ఉంటాయి.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 3 కథలకు మించి పంపరాదు.
4. కథ తన స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. దీపావళి సంచిక నుంచి ఆరంభించి, వరుసగా ఈ కథలను ప్రచురిస్తాం.
6. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి. చేతి రాత అందంగా, న్యాయనిర్ణేతలకు అర్థమయ్యేలా ఉంటే స్కాన్ చేసి పంపినా పరవాలేదు. కొట్టివేతలు ఉన్నా, సరిగా స్కాన్ చేయకున్నా పోటీకి తీసుకోలేం.
7. కథను పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే **'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027** కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
8. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. సంపాదకునిదే అంతిమ నిర్ణయం.

**ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు వరుసగా రూ.12,000 రూ.7,000 రూ. 5,000**

**కథలు జాగృతికి చేరడానికి చివరి తేది : 21 సెప్టెంబర్, 2022**

---

**జాగృతి వారపత్రిక ఆధ్వర్యంలో**


## ఘనశ్యామల ప్రసాదరావు స్మారక పాటల రచనల పోటీ



**ఎంపిక చేసిన 5 రచనలకు రూ. 4,000/- వంతున బహుమతి**

- ఈ పోటీకీ కొత్తగా రచించిన పాటలనే పంపాలి.
- పాట 20 నుంచి 25 లైన్‌లకు మించరాదు. ఒక రచయిత రెండుకి మించి పంపరాదు.
- జాతీయతను, సేవాభావాన్ని పెంపొందించే పాటలను మాత్రమే పంపాలి.
- ఈ పాట ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీపత్రం జత చెయ్యాలి.
- రచనలు అను ఫాంట్‌లో కాని, యూనికోడ్‌లో కాని డిటిపి చేసి jagriticompetition@gmail.com కి మెయిల్ చేయండి.
- మెయిల్ సబ్జెక్టులో పాటల పోటీకి అని తప్పనిసరిగా రాయాలి.
- పోస్టు ద్వారా: పాటల రచనల పోటీ, జాగృతి వార పత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027.

**రచనలు జాగృతికి చేరవలసిన చివరి తేది: 14 సెప్టెంబర్ 2022**


Wishing our beloved Prime Minister
Shri Narendra Modi Ji
a very happy birhday.
May God give him good health and strength to fulfil his vision of transforming India into a strong, developed and progressive nation.
(september 17)
ALA Chandrasekhar Yadav
Platinum Member of AP High Court Advocates Association
AP High Court Bharatiya Janata Party Legal Cell Core Committee Member
BJP State Executive Member OBC, BJP State Office Incharge OBC-9182930939



మన ప్రియతమ
గౌ॥ నరేంద్ర మోదీ గారికి
(సెప్టెంబర్ 17)
72వ జన్మదిన శుభాకాంక్షలు...
&
తెలంగాణ విమోచన
అమృత మహోత్సవ
(సెప్టెంబర్ 17)
శుభాకాంక్షలు...
శ్రీ R. ఆదిత్యరెడ్డి
BJP కౌన్సిలర్
నార్సింగి మున్సిపాలిటీ



గౌ॥ నరేంద్ర మోదీ గారికి 72వ జన్మదిన శుభాకాంక్షలు...
SAI ANITHA
MULTI SPECIALITY HOSPITAL
24 hours SERVICE
Specialities Available
General Medicine
General Surgery
Laparoscopic Surgery
Orthopaedics Surgery
Plastic Surgery
Neuro Surgery
Paediatrics
Paediatric Surgery
ENT
Gynaecology & Obstetrics
Urology
Gastroenterology
Dermatology
Psychiatry
Radiology
Pathology
Anaesthesology
Pharmacy
Diagnostic Services
Ambulance
Sai Anitha
Multispeciality Hospital
Ph: 040-27208865, 9347208865
www.anvishomeopathy.com
anvi's
Homoeopathy
An ISO 9001-2008 World Class Homoeopathy
Super Speciality Clinics & Stores
30
సం॥ల హోమియోపతి వైద్యవిధానంలో అనుభవజ్ఞులైన వైద్య బృందం ఆధ్వర్యంలో అన్ని రకముల శీఘ్ర, దీర్ఘకాలిక, శారీరక, మానసిక సంబంధిత వ్యాధులకు ప్రత్యేక చికిత్సలు.
ఉప్పల్ డిపో
Ph: 040-29990166, 6305025071
అతి త్వరలో ప్రారంభం
♦ సికింద్రాబాద్ ♦ జనగాం ♦ సిద్దిపేట
ANITHA
VOCATIONAL JUNIOR COLLEGE
Recognised by Govt. of T.S.
Affilliated to Board of Intermediate Education, Hyderabad-T.S.
Courses offered
MPHW (F) - 2 Yrs
Female Only
MLT(Voc) - 2 Yrs
Co-Education
Eligibility
SSC Pass
Inter Pass or Fail
Ph : 040-27215551, 9347208865
Prof. Dr. Ramreddy Marri
Core Committee Member, BJP, Kamareddy Dt

# వారఫలాలు

12-18 సెప్టెంబర్ 2022




సింహంభట్ల సుబ్బారావు

6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఇంటి నిర్మాణయత్నాలు కొలిక్కి వస్తాయి. స్థిరాస్తి పంపకాలు వాయిదా వేస్తారు. వ్యాపారులకు లాభనష్టాలు సమానం. ఉద్యోగులు ఎంతటి బాధ్యత అప్పగించినా భయపడకుండా పూర్తి చేస్తారు. రాజకీయవేత్తలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. క్రీడాకారులు, రచయితల ఆశయాలు సిద్ధిస్తాయి. 12,13 తేదీల్లో వృథా ఖర్చులు. దూరప్రయాణాలు. ఆదిత్య హృదయం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

అనుకోకుండా కొంత సొమ్ము సమకూరుతుంది. దీర్ఘకాలిక రుణ బాధల నుంచి విముక్తి. ఆస్తుల వ్యవహారాలలో బంధువులతో అంగీకారానికి వస్తారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. వ్యాపారాల విస్తరణలో అవాంతరాలు తొలగుతాయి. రాజకీయవేత్తలకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. వైద్యులు, రైతులు ఉత్సాహంగా గడుపుతారు. 14,15 తేదీల్లో ధనవ్యయం. మానసిక ఆందోళన. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

కష్టం ఫలించే సమయం. రావలసిన సొమ్ము సకాలంలో అందుతుంది. సంతాన విషయంలో కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు కోరుకున్న మార్పులు ఉండవచ్చు. ఉన్నతాధికారుల నుంచి సహాయం అందుతుంది. క్రీడాకారులు, పరిశోధకులకు సంతోషకర సమాచారం. 15,16 తేదీల్లో మిత్రుల నుండి ఒత్తిడులు. శ్రమాధిక్యం. శివాష్టకం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆత్మీయుల నుంచి శుభవర్తమానాలు అందుతాయి. కొత్త వ్యక్తుల పరిచయం. ఆర్థిక ఇబ్బందులు చాలావరకు తగ్గుతాయి. మిమ్మల్ని అందరూ గౌరవిస్తారు. వ్యాపారాల్లో లాభాలు తథ్యం. పెట్టుబడులకు లోటు ఉండదు. ఉద్యోగులకు పదోన్నతులు దక్కుతాయి. పారిశ్రామికవేత్తలకు నూతనోత్సాహం. రచయితలు, క్రీడాకారులకు శుభవార్తలు. 12,13 తేదీల్లో మానసిక అశాంతి. ఆకస్మిక ప్రయాణాలు. కనకధార స్తోత్రం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ఆకస్మిక ధనలబ్ధి. రుణబాధలు తొలగుతాయి. కొన్ని రుగ్మతల నుంచి బయటపడతారు. వ్యాపారులు లాభాల దిశగా కొనసాగుతారు. ఉద్యోగులు సమస్యలు అధిగమించి ముందడుగు వేస్తారు. పారిశ్రామికవేత్తలకు అనుకూలత. క్రీడాకారులు, రచయితలు అవకాశాలు పొందుతారు. 13,14 తేదీల్లో సన్నిహితులతో కలహాలు. బాధ్యతలు పెరుగుతాయి. గణపతిని పూజించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

నిరుద్యోగులకు ఉద్యోగ లాభం. రావలసిన సొమ్ము సమకూరుతుంది. అప్పుల బాధలు తొలగుతాయి. ఉద్యోగ విధి నిర్వహణలో చిక్కులు తొలగుతాయి. ఉన్నతాధికారుల నుంచి మంచి గుర్తింపు లభిస్తుంది. రాజకీయవేత్తలకు శుభవార్తలు. క్రీడాకారులు, వైద్యులకు మరింత సానుకూలత. 15,16 తేదీల్లో దూరప్రయాణాలు. ఆరోగ్య సమస్యలు. విష్ణుసహస్ర నామ పారాయణం చేయండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

ఏ కార్యక్రమం చేపట్టినా విజయమే. విద్యార్థుల ప్రతిభాపాటవాలు గుర్తింపులోకి వస్తాయి. అవసరాలకు డబ్బు సమకూరుతుంది. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు విధి నిర్వహణలో అవాంతరాలు తొలగుతాయి. కళాకారులను విజయాలు వరిస్తాయి. రచయితలకు శుభవర్తమానాలు. 17,18 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. బంధువిరోధాలు. శ్రీరామ రక్షా స్తోత్రం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

జీవితాశయం నెరవేరుతుంది. సొమ్ముకు లోటుండదు. దీర్ఘకాలిక రుణబాధలు తీరతాయి. ఆర్థిక పరమైన హామీలు వద్దు. శుభకార్యాలపై చర్చలు జరుపుతారు. సంతానం ఉద్యోగావకాశాలు సఫలమై ఉత్సాహంగా గడుపుతారు. వ్యాపారాలలో ఆశించిన లాభాలు. క్రీడాకారులు, వైద్యులకు మరింత ప్రోత్సాహం. 12,13 తేదీల్లో ధనవ్యయం. మనశ్శాంతి లోపిస్తుంది. విష్ణుధ్యానం చేయండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

నిరుద్యోగులకు శుభవార్తలు. ఆశించిన ఫలితం కనిపిస్తుంది. వాహనాలు, భూములు కొంటారు. ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి. ఊహించని రీతిలో డబ్బు సమకూరుతుంది. ఆస్తుల పంపకాలు పూర్తి చేస్తారు. ఆరోగ్యం మెరుగుపడుతుంది. వ్యాపారాలలో లాభాలు దక్కుతాయి. 13, 14 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబంలో సమస్యలు. నృసింహ స్తోత్రం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

యత్నకార్యసిద్ధి. విద్యార్థులకు అనుకూల ఫలితాలు. స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి చేకూరుతుంది. కుటుంబంలో ఆహ్లాదకరంగా ఉంటుంది. శుభకార్యాల నిర్వహణలో బిజీగా గడుపుతారు. ఉద్యోగాలలో ఉన్నత హోదాలు రాగలవు. కళాకారులకు సన్మానయోగం. వ్యవసాయదారులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. 15,16 తేదీల్లో అదనపు ఖర్చులు. సమస్యలు. ఆంజనేయ దండకం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

చేపట్టిన కార్యక్రమాలు మందగమనంలో సాగుతాయి. ఆలోచనలు స్థిరంగా ఉండవు. విద్యార్థులకు శ్రమాధిక్యం. రావలసిన సొమ్ము సకాలంలో సమకూరక ఇబ్బంది పడతారు. ఉద్యోగాలలో ఉన్నతాధికారులు ఇబ్బంది పెడతారు. రచయితలకు కొన్ని సమస్యలు ఎదురుకావచ్చు. 12,13 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. కనకధార స్తోత్రం పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

అన్నీ శుభసూచకాలే. వాయిదా పడ్డ పనుల్నీ పూర్తిచేస్తారు. ఇంటినిర్మాణ యత్నాలు కలసివస్తాయి. సొమ్ముకు లోటుండదు. ఇతరుల నుంచి రావలసిన సొమ్ము కూడా అందుతుంది. మీ విధానాలు, నడవడిక పట్ల కుటుంబ సభ్యులు ఆకర్షితులవుతారు. వ్యాపారాలలో లాభాలు తథ్యం. ఉద్యోగులకు కోరుకున్న విధంగా మార్పులు. 17,18 తేదీల్లో దూరప్రయాణాలు. ఆరోగ్య సమస్యలు. కనకదుర్గాదేవి స్తోత్రం పఠించండి. ★

# పదరసం-383

## ఆధారాలు

**అడ్డం**

1. హిందీ మన దేశానికి (4)
4. జానపద కవి అనే! (4)
8. రుద్రాక్షలో ఓ పండు (2)
9. పిండివంట (4)
11. పడవ (2)
13. గాడిద ఒక సంవత్సరం (2)
14. కూతురు (3)
17. పురుషుడు (3)
18. ఆలోచన, తలపు (2)
19. బంగారు, ధనము (2)
22. చారు (2)
23. ఓ యుగం (2)
24. దేవుని గుడిలో తీర్థంతో బాటు ఇస్తూండేది (4)
26. కొండ (2)
29. యమధర్మరాజు (4)
30. ఒక తెల్లని లోహము (4)

**నిలువు :**

2. నీరు (2)
3. అరవై ఏండ్లకు చేసుకునే పుట్టినరోజు పండుగ (4)
5. మన్మధ పత్ని (2)
6. దేవశిల్పి (4)
7. ఒకప్పుడు ఇదీ సంస్థానమే... గతంలో ఈ నెలలోనే భారతదేశంలో విలీనమైంది (4)
10. నోరు (6)
12. మిత్రుడు, నేస్తం (4)
15. మంచు, పాలకూర (2)
16. దారి, బాట (2)
20. ఎమ్మెస్ పేరిట ఈవిడ ప్రసిద్ధ సంగీత విదుషీమణి (4)
21. మనసు కవితో ఒక గోత్రం (4)
25. ప్రియురాలు, ఆడుది (2)
27. సారము (2)
28. ఎడము (2)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | 2 | | 3 | ✠ | 4 | 5 | | 6 |
| 7 | ✠ | | ✠ | | ✠ | ✠ | | ✠ | |
| 8 | | ✠ | 9 | | | 10 | ✠ | 11 | |
| | ✠ | 12 | ✠ | | ✠ | 13 | | ✠ | |
| 14 | 15 | | ✠ | ✠ | ✠ | | ✠ | 16 | ✠ |
| ✠ | 17 | | | ✠ | 18 | | ✠ | 19 | 20 |
| 21 | ✠ | | ✠ | ✠ | ✠ | 22 | | ✠ | |
| 23 | | ✠ | 24 | | 25 | | ✠ | 26 | |
| | ✠ | 27 | ✠ | ✠ | | ✠ | 28 | ✠ | |
| 29 | | | | ✠ | 30 | | | | ✠ |

**పదరసం – 383**

పేరు : .............................................................................................

చిరునామా:.............................................................................................

.............................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2022 సెప్టెంబర్ 26 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 379 సమాధానాలు


| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 పు | స్త | 2 కం | ✠ | 3 బి | త్తం | ✠ | 4 వ | ని | 5 త |
| ని | ✠ | 6 ర | క్ష | రి | ✠ | 7 వ | రి | ✠ | రు |
| స్త్రీ | ✠ | వ | ✠ | 8 బి | 9 ము | క్త | ము | ✠ | వు |
| ✠ | 10 వ | ర | 11 దా | ✠ | మ | ✠ | 12 ల్లు | 13 క | ✠ |
| 14 ము | ర | ✠ | 15 హం | 16 పీ | క్షే | 17 త్రం | ✠ | 18 ల | 19 త |
| 20 ని | దా | 21 నం | ✠ | క | ✠ | ఆ | ✠ | ✠ | ళ్లి |
| ✠ | 22 ర | ద | 23 న | ✠ | ✠ | ✠ | 24 డా | 25 బు | ✠ |
| 26 రా | ✠ | 27 న | ల్ల | ✠ | 28 సే | 29 వ | ✠ | 30 స | 31 రే |
| 32 జా | 33 గు | ✠ | 34 న | 35 ది | ✠ | 36 ల | 37 జీ | ✠ | లం |
| 38 జీ | డి | యు | ✠ | 39 శ | ని | ✠ | 40 వి | రా | గి |

**విజేతలు:** కె.వి.ఎస్ఎన్.మూర్తి, టి.వి.నారాయణ, బి.ఇందుశేఖర్, ఎం.విజయలక్ష్మి, సి.జి.శంకరరావు–హైదరాబాద్, వి.అనుపమ–వికారాబాద్, ఆర్.లింగా చారి, టి.భరత్–యాదాద్రి, టి.ఆదిశంకర్–చిత్తూరు, సి.హెచ్.దేవలక్ష్మి–నిర్మల్, పి.సీతామహాలక్ష్మి–తిరుపతి, కె.సత్యనారాయణ, ఎన్.వి.సత్యనారాయణ–విశాఖపట్నం, ఎస్.రాజు–కర్నూలు, జి.ఆదినారాయణరెడ్డి–కడప, ఎస్.పూర్ణకుమారి, ఎస్.భావ్యశ్రీ–ఒంగోలు, టి.జ్యోతి–నెల్లూరు, ఆర్.శేషు–కాకినాడ వి.భాస్కరయ్య–చెన్నై, ఎస్.కృష్ణమూర్తి, కె.కాంతామణి–భువనేశ్వర్.

**బహుమతి పొందిన విజేత: ఎస్.భావ్యశ్రీ–ఒంగోలు**



బూరుగుల శ్యామ్‌సుందర్ గౌడ్
మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బి.జె.పి. అధ్యక్షులు
ఎస్.రాజు
బి.జె.పి. దళిత మోర్చా మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు
జె. రామకృష్ణ
సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ మెంబర్
గౌ॥ నరేంద్ర మోదీ గారికి
(సెప్టెంబర్ 17)
72వ జన్మదిన శుభాకాంక్షలు...
&
తెలంగాణ విమోచన దినోత్సవ
(సెప్టెంబర్ 17) శుభాకాంక్షలు...
బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు
బండి సంజయ్ కుమార్ (ఎంపీ)
ప్రజా సంగ్రామ యాత్ర
నాలుగో విడత పాదయాత్ర కంటోన్మెంట్ అసెంబ్లీ పరిధిలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా వారికి
స్వాగతం - సుస్వాగతం
శ్రీమతి బి.రజని
ఎమ్.ఏ. (పొలిటికల్ సైన్స్) ఎం.బి.ఏ. (హెచ్.ఆర్.)
బీజేపీ కంటెస్టెడ్ ఎంఎల్ఏ, బీజేపీ జాతీయ ఎస్సీ మోర్చా మాజీ కార్యవర్గ సభ్యురాలు
బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ఎస్.సి. మోర్చా ఉపాధ్యక్షురాలు కంటోన్మెంట్ అసెంబ్లీ,
వార్డ్ 5, ప్లాట్ నెం.18, రవి కాలనీ, రోడ్ నెం.4, మహేంద్ర హిల్స్, సికింద్రాబాద్-500026



నిజాం కబంధ హస్తాల నుంచి,
రజాకార్ల అకృత్యాల నుంచి
విముక్తి పొందిన తెలంగాణ
స్వేచ్ఛా వాయువులు పీల్చి
ఈ సెప్టెంబర్ 17న 75వ ఏట అడుగిడుతున్న
శుభ సందర్భంగా నాటి సమర
యోధులను స్మరించుకుంటూ
ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలందరికీ
తెలంగాణ విమోచన దినోత్సవ
శుభాకాంక్షలు
సెప్టెంబర్
17
విశ్వగురువుగా భారతదేశానికి పునర్వైభవం తీసుకురావాలన్న
సంకల్పం బూని, 140 కోట్ల భారతీయుల ఉన్నతికై కంకణం కట్టుకొని,
పేదరికం, అవినీతి, ఉగ్రవాదం వంటి పీడల
నుంచి విముక్తి పొందిన నవభారత నిర్మాణానికై యజ్ఞం చేస్తున్న
భరతమాత ముద్దుబిడ్డ
ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
పోరెడ్డి కిషోర్ రెడ్డి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 74 Issue : 46

